
# నరకంలో హరిశ్చంద్రుడు



నార్ల వెంకటేశ్వరరావు

# నరకంలో హరిశ్చంద్రుడు

నార్ల వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజయవాడ

**NARAKAM LO HARISCHANDRUDU -** *Narla Venkateswara Rao*

| | | |
|---|---|---|
| ప్రచురణ నెం. | : | 2350/ 656 |
| ప్రతులు | : | 600 |
| ప్రథమ ముద్రణ | : | మార్చి, 2017 |
| టైటిల్ డిజైన్ | : | గిరిధర్ |

© రిజర్వ్‌డ్

వెల : **₹ 60/-**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# ముందుమాట

**ఆం**ధ్రదేశంలో పురాణాలను కొత్త కోణంలో పరిశీలించిన ప్రముఖులలో కీ॥శే॥ నార్ల వెంకటేశ్వరరావుగారు (1908 -1985) ఎన్నదగినవారు. రామాయణ, భారత, భాగవతాది పురాణ గాథలన్నీ కల్పిత గాథలేననీ, చారిత్రక ప్రాధాన్యం కలిగిన రచనలు కావనీ హేతుబద్ధమైన విపులీకరణలతో శ్రీ నార్ల వారు నిరూపించారు. **"జాబాలి"**, **"సీతజోస్యం"**, **"నరకంలో హరిశ్చంద్రుడు"**, **"పంచరాత్రం"** (ద్రౌపది) తదితర నాటికలకు వివరణాత్మకమైన విశ్లేషణలతో ఆయన రాసిన పీఠికలే అందుకు ప్రభల తార్కాణాలు.

"మతం కంటే మనిషి ముందు; మనిషి కంటే ప్రకృతి ముందు; ప్రకృతికి ముందు వెనుకలు లేవు; ... నిత్యపరిణామశీలత ప్రకృతి స్వభావం. ప్రకృతి క్రమం నుంచి మనిషికి లభించిన ఆలోచనాక్రమమే హేతువాదం" అని ఆయన విశ్వసించారు. తుదిశ్వాస వరకూ ఆ విశ్వాసంతోనే అనేక రచనలు చేశారు.

ప్రకృతిలో సంభవించే అనేక ఘటనలకు జవాబు కోసం ఆదిమ సమాజం నుండి ఇప్పటి వరకు మానవుడు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఆదిమానవుడి జ్ఞానానికీ, తర్కానికీ అందిన మేరకు సమాధానాలు చెప్పకున్నాడు. జవాబు దొరకని వాటికి ఊహాగానాలు చేశాడు. అలాంటి ఊహాగానాలన్నీ అపోహలైనాయి. ఆ అపోహలే, తదనంతర కాలంలో మతాలయ్యాయి. ప్రకృతి ఆరాధన కూడా అందులో భాగమే. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జీవించిన ఆదిమానవుడికి అవే ప్రశ్నలు ఎదురైనాయి. అందరికీ అలాంటి అనుభవాలే వచ్చాయి. అయితే ఎవరికి తోచిన సమాధానాలు వారు చెప్పకున్నారు. వారి జ్ఞాన పరిమితి విధించిన మేరకు ఆ ఊహలు సాగాయి. ఎవరి ఊహల్లో వారు కూరుకుపోయారు. అవే వారి వారి మతాలైనాయి. ఆ యా దేశాల్లోని మతాలకు సూత్రాల నేర్పర్చుకున్నారు. ఆ సూత్రాలు మతాచార సాంప్రదాయాలైనాయి. ఎవరి దేవుళ్లను వాళ్ళు సృష్టించుకున్నారు. ఒక ప్రాంతం దేవుడు మరో ప్రాంతానికి దయ్యంగా పరిగణించారు. భిన్న మతాల మధ్య శతృత్వాలేర్పడ్డాయి. మత విశ్వాసాల వెనుక ఆర్థిక అంశాలూ క్రమేపీ కీలకమైనాయి. అవి కొన్ని సందర్భాలలో యుద్ధాలకు దారితీశాయి.

పురాణాలపై తొలి సమగ్ర విమర్శ ప్రారంభించినవారు కవిరాజు త్రిపురనేని రామస్వామిగారని ప్రతీతి. పురాణాల ఆధారంగానే ఆయన విమర్శ సాగింది. హిందూ మతంలో విశ్వాసముంచి, హిందువుగా ప్రారంభించిన ఆయన పురాణ విమర్శ చివరికి నాస్తికత్వంతో ముగుస్తుంది. అయితే నార్లగారి రచనలు, పురాణాలపై ఆయన విమర్శలు "యావత్ హిందూమత" సాహిత్యంపైనే సాగినట్లు విజ్ఞులు పేర్కొంటున్నారు. ఆయన రాసిన పౌరాణిక నాటకాల్లో, ప్రత్యేకించి 'జాబాలి', 'సీతజోస్యం', 'నరకంలో హరిశ్చంద్రుడు'కు రాసిన పీఠికల్లో అది స్పష్టంగా వ్యక్తమవుతుంది.

పురాణగాథలపై నార్లవారి విమర్శలలో ముఖ్యమైన మూడవది **"నరకంలో హరిశ్చంద్రుడు"**. ఆయన అభిప్రాయంలో మనకు "సుపరిచితుడైన" సత్యహరిశ్చంద్రునితో పాటు మరో ఇద్దరు హరిశ్చంద్రులున్నారు. ఒకడు అసత్య హరిశ్చంద్రుడు కాగా, మరొకడు రాజర్షి హరిశ్చంద్రుడు. ఈ ముగ్గురు హరిశ్చంద్రులు మన ప్రాచీన గ్రంథాలలో కనిపిస్తా రంటారు నార్ల. ఐతరేయ బ్రాహ్మణం, రామాయణం, భారతం, మార్కండేయ పురాణం, పద్మ పురాణం, వాయు పురాణం, శివ పురాణం, భాగవతం, దేవీభాగవతం మొదలైన పురాణ గ్రంథాల్లో ఈ ముగ్గురు హరిశ్చంద్రులు కనిపిస్తారు. మార్కండేయ పురాణంలోని గాథకే అధిక ప్రాధాన్యం లభించిందనీ, అందులోని హరిశ్చంద్రుడి గాథే మనకు సత్యహరిశ్చంద్రుడిగా దర్శనమిస్తున్నాడని నార్లగారంటారు. ఈ నాటకానికి ఆయన రాసిన పీఠిక కూడా దాదాపుగా సమగ్రమైన "పురాణ విమర్శే". పదకొండవ శతాబ్దిలో **క్షేమేంద్రుడు** రాసిన "చండకౌశిక" నాటకం నుండి, పదిహేనవ శతాబ్దిలో **గౌరన** రాసిన **"హరిశ్చంద్రోపాఖ్యానం"**, పదిహేడవ శతాబ్దికి చెందిన **రామరాజభూషణుడు** రాసిన **"హరిశ్చంద్ర నలోపాఖ్యానం"**, **కందుకూరి వీరేశలింగం** రాసిన నాటకం, **బలిజేపల్లి లక్ష్మీకాంతం** రాసిన నాటకం, **విశ్వనాథ సత్యనారాయణ** రాసిన "కావ్యవేదహరిశ్చంద్ర" నాటకాల వరకూ నార్లవారు పరిశీలించినట్లుగా ఆయన పీఠికలో రాశారు.

పురాణాలను ఇదివరలో రాసినవారికీ, ఇప్పుడు రాస్తున్నవారికీ జంకూ, గొంకూ లేదు. అంతేకాదు, బొంకు, రంకు అనే మాటలను వీరు వినలేదేమో అని నార్లగా రంటారు. రుగ్వేదం ప్రకారం ఊర్వశితో పురూరవుడు కాపురం చేసింది నాలుగేళ్ళు మాత్రమే. అయినా వీరిద్దరు 61 వేల సం॥రాలు సంసారం చేసినట్లు విష్ణుపురాణంలో ఉంది. సిగ్గూ బిడియాలు లేకుండా, చీము నెత్తురైనా లేకుండా బూతులను, బొంతులనూ రాసిన పౌరాణిక గ్రంథాలు మనకు పవిత్ర గ్రంథాలా? అని నార్లవారు ప్రశ్నిస్తారు. అసత్యాలకూ, అవినీతికీ, అన్యాయాలకూ, అత్యాచారాలకూ, అడ్డమైన తప్పుడు పనులకు పరాకాష్టలుగా చెప్పదగు పురాణాల కారణంగా రెండు వేల సం॥రాల నుండి

ఒక ప్రజగా, ఒక దేశంగా, ఒక సంఘంగా మనకు ఎన్ని విధాల అపకారం జరిగిందో చరిత్ర నుండి మనం గ్రహించవచ్చునని నార్లగారంటారు. వీటిని నిరసించినవారిలో రాజా రామమోహనరాయ్, దయానంద సరస్వతి, బాబూ భగవాన్ దాస్ లాంటి ప్రముఖులున్నారు గదా! కనీసం వారి నిరసనల నుండైనా మనం నేర్చుకోకూడదా? అని ఆయన అంటారు. పురాణాల్లో నీతి కంటే బూతే ఎక్కువని వాళ్ళు చెప్పలేదా? ప్రభుత్వ చిహ్నాలపై "సత్యమేవ జయతే" అని రాసుకొని, అసత్యాలనూ, అర్ధసత్యాలనూ ప్రచారం చేయవచ్చునా అని ప్రశ్నిస్తారు.

పురాణాన్నుంచి చరిత్రను వేరుచేయాలి. మతం నుంచి నీతిని విడదీయాలి. చరిత్ర వేషం వేసిన పురాణం మన మేధాశక్తిని బలహీనపరుస్తుంది. హేతుదృష్టిని మందగింపజేస్తుంది. వాస్తవికతకు దూరం చేసి, వెర్రిమొర్రి లోకాల్లో ప్రవేశపెడుతుంది. మతం అంతకంటే దుష్టంగా వ్యవహరిస్తుంది. విశ్వాసం పేర అది మౌఢ్యానికి ప్రోది చేస్తుంది. ఆచారం పేర దురాచారాలను నెలకొల్పుతుంది. సంప్రదాయం పేర సద్వర్తనను చంపివేస్తుంది. నీతి అనే ముసుగులో మతం ఎన్ని దోషాలైనా చేస్తుంది. ఎట్టి దుష్కృత్యాలకైనా సన్నద్ధమవుతుంది. ఎంతటి దౌర్జన్యాలనైనా జరుపుతుంది. అది ఏ మతమైనా కానివ్వండి; దాని చరిత్ర పుటలు కన్నీటితో తడిసి వుంటాయి; ఆ పుటలలో పంక్తులు నెత్తురు మరకల కారణంగా మనం చదవలేని తీరులో ఉంటాయని నార్ల అంటారు.

ప్రాచీన కాలంలో మనవారు అనేక శాస్త్రాలను రాశారని మనం చెప్పకుంటున్నాం. తర్క, వ్యాకరణ, ధర్మ, మీమాంస, వైద్య శాస్త్రాలను, జ్యోతిష, సాముద్రిక, శకున శాస్త్రాలను రాశారని, అవి అందరికీ అనుసరణీయమైనవనీ, మన సాంప్రదాయాలు అక్కడ నుండే పుట్టుకొచ్చాయనీ ఇప్పుడు మరీ విపరీత ధోరణిలో చెప్పకుంటున్నారు.

ప్రజల మనోభావాలను మార్చడానికి, వారు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పక్కదోవల పట్టించడానికి బ్రహ్మోత్సవాలు, యజ్ఞ యాగాదులు, పుష్కరాలూ, గతంలో లేని కొత్త పండుగలు, గుళ్ళ గోపురాల నిర్మాణం, వస్త్రాల సమర్పణ, తీర్థ ప్రసాదాల స్వీకరణ, జాతరలు, తిరునాళ్ళు, అమ్మవార్లకు బోనాలు వగైరాలను ప్రభుత్వాలు పనిగట్టుకొని నిర్వహిస్తున్నాయి. ఏ నాయకుడ్ని చూసినా రుద్రాక్షమాలలు, అంత్ర తంత్రాలు తాయత్తులతో దర్శనమిస్తారు. బొట్లు, విభూది రేఖలు సర్వసామాన్యమైనాయి. చివరకు రౌడీలూ, గుండాలుగా రికార్డుల కెక్కినవాళ్ళు, హత్యకేసుల్లో నిందుతులైన వారు ఈ వేషధారణతోనే సంచరిస్తున్నారు. మనది లౌకికరాజ్యం (Secular) అనే స్పృహ కోల్పోయి రాజ్యాంగ యంత్రాన్నంతా సమీకరించి, కోటానుకోట్ల రూపాయల

ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు. మూఢనమ్మకాలను ప్రోత్సహిస్తున్నారు. కొద్దో గొప్పో అభివృద్ధి అయిన శాస్త్రదృష్టికి (Scientific temper) మతవిశ్వాసాలను జోడించి "సూడోసైన్స్"ను ప్రోత్సహిస్తున్నారు. మన సంస్కృతీ, సంప్రదాయాలకూ కొత్త అర్థాలిస్తున్నారు. అందులో ఏవి మృతప్రాయమై, సమాజానికి నష్టదాయకమైనవో, వాటిని విసర్జించి, సజీవమైన విలువలను ప్రోత్సహించడం లేదు. శాస్త్రజ్ఞానాన్ని ఉద్దేశ పూర్వకంగానే గొంతునొక్కుతున్నారు. మత సాంప్రదాయాలను రుద్దుతున్నారు.

సాంప్రదాయాల పేరుతో, సంస్కృతీ రక్షకుల పేరుతో మతోన్మాదుల ప్రస్తుత దశలో చేస్తున్న సాంస్కృతిక అరాచకానికి నార్ల వెంకటేశ్వరరావుగారు పురాణాలపై రాసిన పుస్తకాలు గొప్పగా ఉపకరిస్తాయనే భావంతో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఈ కార్యక్రమానికి పూనుకున్నది. తెలుగు ప్రజల సాంస్కృతిక నాడిని విశాలాంధ్ర ఎల్లవేళలా పట్టి ఉంచుతుంది. అదొక కర్తవ్యంగా భావిస్తూ సజీవమైన, విలువలతో కూడిన సంస్కృతిని ప్రోత్సహిస్తూ ముందుకెళ్తుంది.

అభివందనాలతో


విజయవాడ

1-3-2017

**గడ్డం కోటేశ్వరరావు**

**సంపాదకులు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**





ప్రియమిత్రుడు

**డాక్టర్ ఎన్. ఇన్నయ్యకు**

శుభాకాంక్షలతో

# నరకంలో హరిశ్చంద్రుడు

## పీఠిక

# పురాణాలు, చరిత్ర

షట్చక్రవర్తులలో మొట్టమొదటివాడు హరిశ్చంద్రుడు, మిగిలిన అయిదుగురు – నలుడు, పురుకుత్సుడు, పురూరవుడు, సగరుడు, కార్త వీర్యార్జునుడు. నేను చూచిన రెండు పుస్తకాలలో వీరి పేర్లు ఇదే క్రమంలో వున్నాయి. ఇదే క్రమాన్ని అన్ని గ్రంథాలు పాటిస్తున్నవో, లేదో నాకు తెలియదు. ఏమైనా, ఒకటి మాత్రం నిశ్చయం. ఇదేక్రమంలో కాకపోతే, మరొక క్రమంలో ఒకనాడు వీరు భారతీయ సార్వభౌములని చెప్పగలిగింది  కేవలం మన పురాణాలే! ఈ పురాణాలను విడిచి, చరిత్ర వద్దకు వస్తే, అది మనకు చెప్పే విషయం – మనదేశంలో మొట్టమొదటి సామ్రాజ్యం క్రీస్తుకు పూర్వం అయిదారు శతాబ్దాలనాటి మగధ సామ్రాజ్యమని.

అయితే, దానినైనా ఒక సామ్రాజ్యంగా పరిగణించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న లేకపోలేదు. ఉదాహరణకు, యునైటెడ్ కింగ్‌డమ్‌గా ఇప్పుడు చెల్లుతున్న రాజ్యాన్ని తీసుకోండి. ఇదొక ద్వీప సముదాయం. దీనిలో ఇంగ్లండ్, స్కాట్లెండ్, వేల్స్ అంతర్భాగాలు కొన్ని దశాబ్దాల క్రితంవరకు ఐర్లెండ్ కూడా దీనిలో అంతర్భాగమే. (ఇప్పుడైనా ఐర్లెండ్ ఉత్తర ప్రాంతమైన ఆల్‌స్టర్ దీనిలో భాగమే). యునైటెడ్ కింగ్‌డమ్‌లోని వేర్వేరు దీవులకు వేర్వేరు భాషలున్నాయి. చరిత్రలున్నాయి, సంస్కృతులున్నాయి. అయినా, ఏకచ్ఛత్రాధిపత్యం కిందికి వచ్చినప్పుడు

వీటిని "యునైటెడ్ కింగ్‌డమ్" (సంయుక్త రాజ్యం) అన్నారే తప్ప, "బ్రిటిష్ ఎంపైర్" అనలేదు. ఈస్టిండియా కంపెనీని రద్దుచేసి, మనదేశం పరిపాలనా బాధ్యతను బ్రిటీష్ ప్రభుత్వం స్వయంగా స్వీకరించింది 1858లో అప్పటికి ఆస్ట్రియాకు ఒక చక్రవర్తి, జర్మనీకి ఒక చక్రవర్తి, టర్కీకి ఒక చక్రవర్తి, రష్యాకు ఒక చక్రవర్తి, వీరితోపాటు మరికొందరు చక్రవర్తులుండేవారు. అందువల్ల తాను చక్రవర్తిని బిరుదును స్వీకరించాలని విక్టోరియారాణి ముచ్చటపడింది. ఇది ముచ్చటగానే మిగలక, క్రమంగా తాపత్రయంగా మారింది. అయితే, బ్రిటీష్ పార్లమెంట్ అందుకు సమ్మతిస్తుందా? "చక్రవర్తి" లేదా "చక్రవర్తిని" పరిపాలనక్రింద జీవించడం స్వాతంత్ర్య ప్రియులకు, ముఖ్యంగా ప్రజాస్వామ్య వాదులకు, ఎంతమాత్రం మనస్కరించదు. రాజులను, రాణులను సయితం, వారి అధికారం నామమాత్రమైనది కానిపక్షంలో నెట్టివేయాలనే వారు ఆకాంక్షిస్తారు. ఏమైనా బ్రిటీష్ పార్లమెంట్ సమ్మతిని పొందడానికి విక్టోరియారాణి 1876 వరకు వేచి వుండవలసివచ్చింది. అప్పుడైనా పార్లమెంట్ చేత ఒక తీర్మానం చేయించడానికి నాటి బ్రిటిష్ ప్రధాని డిజ్‌రేలి తన యెత్తులను, జిత్తులను పూర్తిగా వినియోగించ వలసివచ్చింది. ఇంత జరిగిన తర్వాతకూడా విక్టోరియా కేవలం ఇండియా ఉపఖండానికి సంబంధించినంతవరకు ఆమె "రాణి" (క్వీన్) మాత్రమే.

మగధరాజులు అన్యజాతులను జయించ లేదు, అన్యదేశాలను పరిపాలించ లేదు. అయినప్పుడు వారిని చక్రవర్తులుగా పేర్కొనడం భావ్యమా? మన దేశచరిత్ర, మన జాతి సంప్రదాయాలు మొదలైన వాటి దృష్టినుంచి ఇది భావ్యమే కావచ్చు. ఒకప్పుడు – ఎప్పుడో కాదు; రెండు, మూడు వందల సంవత్సరాల క్రితంవరకు – ఒక్కొక్క భాషా ప్రాంతం మనకు ఒక్కొక్క దేశం. "దేశములు" అనే పదానికి "ఆంధ్ర వాచస్పత్యము" చెబుతున్న అర్థం "అంగము, వంగము, కళింగము, కర్ణాటకము, కేరళము, కామరూపము... ఈ ధోరణిలో చాలా చాలా దూరం సాగుతున్నది. ఇంతే కాదు. ఒకే భాషా ప్రాంతంలో "నాడు" లనేవి ఎన్నెన్నో వుండేవి. మన తెలుగు భాషా ప్రాంతాన్నే ఉదాహరణంగా తీసుకోండి. పలనాడు, వెలనాడు, వేగినాడు, పాకనాడు, పొత్తిపినాడు, పులుగునాడు, జంతురునాడు, కన్నాడు – ఇట్టివి ఎన్ని వుండేవో ఇప్పుడు లెక్క పెట్టడం కష్టం. అన్నట్టు, ఒక మురికినాడు కూడా వుండేది. ఈ పరిస్థితిలో ఏదో ఒక నాడుకు ఏలికైనవాడు రాజు; రెండు, మూడింటికి ఏలికైనవాడు మహారాజు. నాడుల హద్దులనుదాటి, రెండు లేదా మూడు భాషా ప్రాంతాలకు ఏలికైనవాడు చక్రవర్తి! అతడు చక్రవర్తి కానక్కర లేదు. ఏ పిల్లరాజైనా, పీచురాజైనా, అతడిని "అఖండ భూమండలాధీశ్వరా!" అని ఆస్థానకవులు పొగుడుతూ వుండేవారు! సరే దీని కేమిగాని, మనకు చక్రవర్తులు ఆరుగురు కాగా, మహారాజులు పదహారుగురని పురాణాలు చెబుతున్నాయి. కాగా, రాజులకు మితిలేకపోబట్టి కావచ్చు, వారి సంఖ్య విషయమై పురాణాలు మౌనం వహించాయి.

జాతీయతాభావం వ్యాప్తిలోకి వచ్చిందీ, అది పూర్తిగా బలపడిందీ పంధొమ్మిదవ శతాబ్దంలోనే. అందువల్ల ఒకప్పుడు మన దేశంలో వందల సంఖ్యలో చిన్న, పెద్ద రాజ్యాలు నెలకొనడంలో ఆశ్చర్యం లేదు. వెనకటి కాలంవరకు వెళ్ళడం దేనికి? బ్రిటిష్‌వారు 1947లో మన దేశంనుంచి నిష్క్రమించినప్పుడు (జమీందారులు, జాగీరుదారులు వగైరాలను విడిచి పుచ్చగా) రాజుల, మహారాజుల, నవాబుల పేరుతో అయిదున్నర వందల మందికి పైగా వుండేవారు! ఏమైనా, ఒకనాటి మన పాలకులలో కొందరిని భారతీయ చక్రవర్తులుగా పేర్కొనడం విడ్డూరమే. చివరికి అశోకుని రాజ్యమైనా దక్షిణాదిలో నెల్లూరును దాటి వెళ్ళలేదు. అయితే, విడ్డూరాలు కోకొల్లలుగా లేనిది పురాణమే కాబోదు. మనకు అష్టాదశ పురాణాలున్నాయి; తిరిగి అన్ని ఉపపురాణాలున్నాయి. అత్యుక్తులతోనేకాదు, అనృతాలలో కూడా వాటిమధ్య పోటీ కనబడుతుంది. పోతే, అవి వ్రాసే అసహజ విషయాలకు, అసంబద్ధ వివరాలకు హద్దుపద్దులు లేవు. ప్రస్తుత విషయాన్నే, షట్చక్రవర్తుల విషయాన్నే తీసుకోండి. వారిలో అయిదవవాడైన సగరుని భార్యలిద్దరిలో ఒకరి కడుపున ఒక్కగానొక్క కొడుకు పుట్టగా, రెండవ ఆవిడ కడుపునుంచి అరవైవేలమంది బెలబెల బైటికి వచ్చిపడినారని బ్రహ్మాండ పురాణం చెబుతున్నది. పోతే, షట్చక్రవర్తులలో చివరివాడైన కార్త వీర్యార్జునుడు 85,000 సంవత్సరాలు పరిపాలన చేశాడని విష్ణుపురాణం చెబుతున్నది. ఈ విషయంలో రామాయణ భారతాలైనా పురాణాలకు ఎంత మాత్రం తీసిపోవు. రామాయణం కథనం ప్రకారం దశరథుడు జీవించింది. 60,000 సంవత్సరాలు; రాముడు రాజ్యం చేసింది 11,000 సంవత్సరాలు అప్పుడైనా బ్రతుకుపై రోత పుట్టి, సరయూనదిలో దూకి రాముడు ఆత్మహత్య చేసుకొన్నాడుగాని, లేకపోతే, తండ్రి 60,000 సంవత్సరాలు జీవించగా తాను తండ్రినిమించిన ఘనుడు కాబట్టి ఒక లక్ష సంవత్సరాలైనా పూర్తిచేసేవాడే. ఈ సంఖ్యలతర్వాత ఆశ్చర్యార్థక సంజ్ఞలను పెట్టబోయే పురాణాలవిషయంలో అది పిచ్చిపని కాగలదని సంక్షేపించాను.

అత్యుక్తులు, అసంబద్ధాలు, అబద్ధాలు మాత్రమే కాక, అసహజ విషయాలు, అభూతకల్పనలు ఏ దేశానికి చెందిన పురాణాలలోనైనా విశేషంగా వుంటాయి. ఇందుకు కారణం పురాణాలరచన మానవ నాగరికత ప్రాథమిక దశలలో జరగడమే. వాటిని వ్రాసినవారికి అగ్ని ఒక దేవుడు, వాయువు ఒక దేవుడు, సూర్యచంద్రులు ఇద్దరు దేవుళ్ళు, పృథ్వి ఒక దేవత, గోవు ఒక దేవత. ఇక్కడ కాదుగాని, అన్యదేశాలు కొన్నింటిలో మేకపోతు, గొర్రె, పొట్టేలు, ఆబోతు, మొసలి, డేగ – అన్నీ దేవుళ్ళే, అన్నీ దేవతలే, “ఇక్కడ కాదుగాని” అని ఇంతకుముందు నేను వ్రాయడం నిజానికి పొరపాటు, ఇక్కడైనా, పాము పుట్టలలో మనం పాలుపోయడం లేదా? చెట్లకు ప్రదక్షిణలు చేయడం లేదా? కప్పలకు పెళ్ళిళ్ళు చేయడం లేదా? రాళ్ళకు, రప్పలకు సాగిలి మ్రొక్కడం లేదా?

అన్నట్టు, ఇక్కడ ఒక పచ్చి మోసం సయితం జరిగింది. తాము ద్విజులమని, దివ్యజ్ఞానం తమకే పరిమితం కావాలని భావించినవారు, ద్విజేతరులకోసం – ప్రజలలో వాటికి దాదాపు 80 వంతులమంది కోసం – పురాణాలను ప్రత్యేకంగా సృష్టించారు. "మీది హీనజన్మ, మీది హీనబుద్ధి. మీకు పురాణ శ్రవణం చాలు. అంతటితో సంతృప్తి చెందక, వేదాలను మీరు వింటే మీ చెవులలో కరిగించిన సీసం పోస్తాము; వేదాలను మీరు చదివితే, మీ నాల్క కోసివేస్తాము; వేదాలను మీరు జ్ఞాపకం పెట్టుకొంటే, అంతకు మించిన కఠిన దండన మీకు తప్పదు" అని హెచ్చరించారు. ఇంతటి మహాఘోరం జరిగింది ప్రపంచం మొత్తంమీద ఒక్క ఈ దేశంలోనే! పురాణాలు ఏయే దేశాలలో, ఏయే జాతులలో ఏ విధంగా పుట్టినా, ఎంతగా వ్యాప్తిలోకి వచ్చినా, పాశ్చాత్య దేశాలకు, మన దేశానికి ముఖ్యమైన ఒక భేదం కనబడుతున్నది. పురాణాలపట్ల భక్తివిశ్వాసాలు ఆ దేశాలలో క్రమక్రమంగా సన్నగిల్లిపోయాయి, క్రైస్తవ మతాచార్యులు ఎంతగా కొట్టుమిట్టాడినా, బైబిల్‌లోని కట్టుకథలను, పిట్టకథలను నమ్ముతున్నవారు తగ్గిపోయారు, తగ్గిపోతున్నారు. ఈ పరిణామం రెండు, మూడు వందల సంవత్సరాల క్రితం ప్రారంభమైంది; కడచిన నూరేళ్ళలో పూర్తిగా బలపడింది. ఈ విషయంలో ముఖ్యంగా మెచ్చుకోవలసింది గ్రీస్ దేశాన్ని. క్రీస్తుశకానికి అయిదారు శతాబ్దాలకు ముందుగానే అక్కడ కొందరు మేధావులు, తత్వజ్ఞులు, కవులు, నాటక కర్తలు తమ పురాణాలను ఎగతాళి చేశారు. ఏవగించుకొన్నారు.

మనకు వ్యాస, వాల్మీకులు పౌరాణిక కవులు కాగా, గ్రీసు దేశస్థులకు హోమర్, హీసియెడ్‌లు అట్టి కవులు, హోమర్ "ఇలియడ్" "ఒడెసి" అనే రెండు పురాణాలు వ్రాశారు. హీసియెడ్ హోమర్‌చే ప్రభావితుడై దేవుళ్ళ పుట్టుపూర్వోత్తరాలనుగురించి కొన్ని రచనలు చేశాడు. ఇంతేకాక, కర్షకుల దైనందిన జీవితంనుంచి కొన్ని ఘట్టాలను ఎన్నుకొని, వాటిని నీతికథలుగా మలచాడు. ఆ నీతికథలలో సయితం అక్కడక్కడ పౌరాణిక గాథలు దూరినా, మొత్తంపై అవి సమకాలిక సాంఘిక జీవితానికి అద్దం పడుతున్నాయి. హీసియెడ్ క్రీస్తుకు పూర్వం ఎనిమిదవ శతాబ్దికి చెందినవాడు. కాగా, హోమర్ ఏ కాలానికి చెందినవాడో నిర్ధారణగా చెప్పలేకున్నారు. ఇటీవలి పరిశోధకులలో కొందరి అభిప్రాయం ప్రకారం, హోమర్ అనేవ్యక్తి నిజానికి లేడు, ఆ పేరుతో పెక్కుమంది వివిధ కాలాలలో "ఇలియెడ్", "ఒడెసి" పురాణాలకు వాటి ప్రస్తుత రూపాన్ని కూర్చారు. వారు మన సూతులను పోలినవారు కావచ్చు; వీరివలె వారు కూడా పౌరాణిక గాథలను పద్యాలుగా, పాటలుగా పాడుతూ, దేశాటన ద్వారా పొట్టపోసు కొన్నవారు కావచ్చు.

హోమర్ అస్తిత్వాన్ని సందేహించినట్టే వ్యాసుని అస్తిత్వాన్ని కూడా సందేహించాలి. "వ్యాసం" అంటే నిఘంటువులు చెప్పే అర్థం "విరివి వ్రాత" అని. దీన్నిబట్టి వివిధకాలాలలో

విభిన్నవ్యక్తులు చేసిన, లేక క్రోడీకరించిన రచనలను – వేదాలు, పురాణాలు, మహాభారతం వగైరాలను – ఒకే వ్యక్తికి అంటగట్టి, అతడిని "వ్యాసు" డనడం జరిగి వుండవచ్చు. వ్యాసునికి మరొకపేరు "కృష్ణద్వైపాయనుడు" మూడవపేరు బాదరాయణుడు. అతడు చారిత్రక వ్యక్తి కాడనుకొనడానికి బలమైన కారణాలు చాలా వున్నాయి. వ్యాసుని పేరుతో ఎందరెందరు రచయితలు ఎప్పుడెప్పుడు రంగప్రవేశం చేశారో మనకు తెలియదుగాని, క్రీస్తుశకం పదవ శతాబ్దంవరకు వీరు పాతపుస్తకాలలో మార్పులు, చేర్పులు చేస్తూనే పోయారు, కొత్త పుస్తకాలను వ్రాస్తూనేపోయారు. మహాపురాణాలుగా చెల్లుతున్నవాటిలో చిట్టచివర వెలువడినట్టిది భాగవతం. తక్కిన పదిహేడు మహాపురాణాలలోని ముఖ్యాంశాలు దీనిలోవున్నాయి. పురాణాలనుగురించి పరిశోధనలు జరిపిన పాశ్యాత్య పండితులలో ఒకడైన హెచ్.హెచ్. విల్సన్ తేల్చిన సారాంశం ప్రకారం, భాగవత రచన జరిగింది బహుశా క్రీస్తుశకం పన్నెండవ శతాబ్దిలో. మరికొందరు పరిశోధకుల దృష్టిలో అది పదవ శతాబ్ది రచన. ఈ విషయమై నేను ఇంత దీర్ఘంగా ప్రస్తావించడం గ్రీసులో పురాణాల రచన క్రీస్తుకు పూర్వం ఎనిమిదవ శతాబ్దినాటికే నిలిచిపోగా మన దేశంలో అది క్రీస్తుతర్వాత పదవ శతాబ్ది వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగిందని చెప్పడానికే!

ఇంతకంటె కూడా ఆశ్చర్యకర విషయం క్రీస్తుతర్వాత ఇరవయ్యో శతాబ్దిలో సయితం మన పురాణాలలోని కట్టుకథలను, పిట్టకథలను మనలో అత్యధిక సంఖ్యాకులు పరమసత్యాలుగా విశ్వసించడమే! వాటిలోని బొంకులను, రంకులను పవిత్ర విషయాలుగా సంభావించడమే! పామరుల సంగతి విడిచి పెట్టండి. విద్యాధికులైనవారే ఈ పనులు చేస్తున్నారు. అత్యున్నత పదవులనధిష్ఠించి, మనను పరిపాలిస్తున్నవారే ఈ పనులు చేస్తున్నారు. ఇది మన ప్రగతిని ఎంతగా నిరోధిస్తున్నదో, మన భవిష్యత్తుకు ఎంతటి ప్రమాదంగా పరిణమిస్తున్నదో, ఆ మాట తలచుకొంటేనే గుండెలో రాయి పడుతున్నది!

మన దేశంలో ఈనాడు – క్రీస్తుతర్వాత ఇరవయ్యో శతాబ్దిలో – జరుగుతున్నదానికి భిన్నంగా, ఏనాడో – క్రీస్తుకుపూర్వం నాలుగైదు శతాబ్దాలనాడే – జీనోఫెనీజ్ తమ పౌరాణిక కవులిద్దరినీ వేడిగా, వాడిగా నిరసించాడు, ఏడు నిలువుల లోతున వారిని పాతిపెట్టినంత పనిచేశాడు. అదే కాలానికి చెందిన ప్లేటో అంతవరకు వెళ్ళలేదుగాని, తమ పాత పురాణాలవల్ల మేలుకంటె కీడు అధికంగా జరుగుతున్నదన్నారు. ప్లేటో వైఖరి కొంతవరకు మన ద్విజుల వైఖరిని పోలినట్టిది. హోమర్, హీసియెడ్ పురాణాలను ఖండిస్తూనే, పామరజనులకు పురాణాలు అవసరం కాబట్టి, పాత బూతపురాణాలకు బదులుగా కొత్త నీతిపురాణాలు వ్రాయాలని ఆయనన్నాడు.

హీసియెడ్ తెరవేసి చెప్పినట్టు, సోక్రటీజ్ నోటివెంట ప్లేటో "రిపబ్లిక్" గ్రంథంలో చెప్పించినట్టు, గ్రీకు పురాణాలలోని దేవతలు అసూయా విద్వేషాలకు అతీతులు కారు, కామ క్రోధాలకు అతీతులు కారు, మదమాత్సర్యాలకైనా అతీతులు కారు. వారి అధిపతి పేరు "జూస్"(zeus) ఇతడు మన పురాణాలలోని ఇంద్రునికి పెద్దన్నయ్య. ఇతడు ఆడని అబద్ధం లేదు, చేయని మోసం లేదు, ఒడిగట్టని నైచ్యం లేదు. ఇతడు తాగుబోతు, వ్యభిచారి. ఏ ప్రలోభానికైనా ఇట్టే లొంగిపోతాడు; అభీష్టకార్యసిద్ధికై ఏ మాయోపాయానికైనా వెనుదీయడు; స్వీయ ప్రాబల్య రక్షణకై ఎంతటి క్రూరకృత్యాలకైనా సన్నద్ధపడతాడు. ఈ విషయాలలో తక్కిన గ్రీక్ దేవతలైనా తమ అధిపతి జూస్ కంటె ఒక మెట్టు, లేదా అరమెట్టు కిందగా నిలిచినవారే. ఇట్టివారిని దేవతలుగా ఆరాధిస్తే వ్యక్తులుగా మన శీలం ఎంతవరకు నిలుస్తుంది? పౌరులుగా ఇతర పౌరులపట్ల మన ప్రవర్తన ఏ తీరులో వుంటుంది? సంఘంలో మన నైతికపు విలువలు ఏ స్థానంలో వుంటాయి? గ్రీస్‌లో రెండున్నర వేల సంవత్సరాల క్రితమే కొందరు మేధావులు, తాత్త్వికులు వేసిన ఈ ప్రశ్నలు ఇప్పటికైనా మన దేశంలో ఎందుకు వినబడవు?

మన దేశంలోనైనా మన పురాణాలను నిరసించినవారు కొందరు లేకపోలేదుగాని, వారి సంఖ్య బహుస్వల్పం. ఈ శతాబ్దిలో పెరియార్ రామస్వామి, శ్రీ త్రిపురనేని రామస్వామి పురాణాలపై దాడిచేశారు; గత శతాబ్దిలో రాజా రామమోహన్‌రాయ్, దయానంద సరస్వతి వాటిపై దెబ్బతీశారు. అయితే, వారి విమర్శలు గాలికి ఎగిరిపోయినట్టుగా భావించ వలసివస్తున్నది. ఇందు కొక కారణం – వేదకాలంనాటి దేవగణంలో అగ్రగణ్యుడైన ఇంద్రుని పౌరాణికయుగంలో ఒక దిక్పాలుని స్థాయికి (లేదా దిక్పాలకులలో ప్రథమస్థాయికి) దిగజార్చి, బ్రహ్మ విష్ణు మహేశ్వరులను త్రిమూర్తుల స్థానంలో నిలబెట్టడం కావచ్చు. ఇంతకుముందు నేను పేర్కొన్నట్టు, దాదాపు మూడువేల సంవత్సరాలక్రితమే గ్రీస్‌లో పురాణాల రచన నిలిచిపోగా, ఇంచుమించు వెయ్యేళ్ళ క్రితంవరకు అది మన దేశంలో కొనసాగింది. ఈ నాటికైనా మనలో వాటి రచన నిలిచి పోయినట్టు చెప్పలేము. పాత పురాణాలను దేశభాషలలోకి అనువదిస్తూనే వున్నారు. క్రీస్తుకుపూర్వం అయిదవ శతాబ్దానికి చెందిన నాటకకర్త యురిపిడీజ్ చేసినట్టు పౌరాణిక పాత్రలకు నూతనరూప మివ్వడానికి, పౌరాణికగాథలకు నూతన వ్యాఖ్యానాలను చెప్పడానికి ప్రయత్నం చేస్తున్న వారైనా అంతగా మన దేశంలో ఇప్పటికైనా కానరావడం లేదు. పవిత్ర గాథలను అపవిత్రం చేస్తున్నాడని యురిపిడీజ్‌ను ఆయన సమకాలికులు నిరసించారు, నిందించారు. ఆయనను అవహేళన చేస్తూ, అరెస్టొఫెనీజ్ నాటకాలను వ్రాయడంవరకు వెళ్ళాడు. అయినా, యురెపెడీజ్ అదరలేదు, బెదరలేదు, గుండె బేజారు కాలేదు. కొన్ని విలక్షణ ప్రవృత్తులను, కొన్ని

విపరీత మానసికావస్థలను ప్రతిభాపూర్వకంగా విశదీకరించడానికి పౌరాణిక గాథలను, పాత్రలను ఆయన వినియోగించాడు. ఆదిలో ఎంత అవహేళనకు లోనైనా, ఎందరి ఆగ్రహానికి గురికావలసివచ్చినా, చివరికి ఆయన సమకాలికులే ఆయన మౌలికచింతనను, ఆయన ప్రజ్ఞాప్రాభవాలను గుర్తించక తప్పలేదు. ఇంతేకాదు. రెండున్నర వేల సంవత్సరాల తర్వాత కూడా ఆయన పాతగిల లేదు. ఆయన స్థానం ఈనాడు ప్రపంచ నాటక కర్తల వరసలోనే. ఆధునికులలో ఆధునికుడు కావడం ఆయనలో మరొక విశేషం. భానుడు, కాళిదాసు సయితం ప్రపంచ నాటకకర్తలైనా, పౌరాణిక గాథలకు నూతనార్థాలను కట్టించడంలో, వాటిద్వారా నూతన సందేశాన్ని అందించడంలో యురెపిడీజ్ తర్వాతనే వారిద్దరినీ పేర్కొనాలి. పాత యుగాల మాట కేమి? ఇప్పుడు మనం ఆధునిక యుగంలో వున్నాము. అయినా, మనలో ఆధునికదృక్పథం ఎందుకు లేదు? పాతవాసనలు మనను ఎందుకు వదలడం లేదు? ఎదురుకుకాక, వెనుకకే మనం ఎందుకు చూస్తున్నాము. ముందుకుకాక, వెనుకకే మనం ఎందుకు నడుస్తున్నాము? ఈ అన్ని ప్రశ్నలకు సమాధాన మొక్కటే. అది – మనపై మన పురాణాల దుష్ప్రభావం.

ఇక్కడ మరొక్క మాటకూడా చెప్పాలి. ప్రాచీనకాలంలోనే పురాణాలను ఒక పక్కకు నెట్టినందునే, పౌరాణికగాథలలో నిజంకంటె అబద్ధం, నీతికంటె అవినీతి, ఉదాత్తతకంటె నైచ్యం, అన్నింటినీ మించి, వాస్తవంకంటె కల్పన అత్యధికంగా వుంటాయని గుర్తించిన ఘనతకూడా గ్రీక్ మేధావులకే దక్కింది. అందువల్లనే ప్రపంచం మొత్తంమీదనే మొట్టమొదటి చరిత్రకారుడు గ్రీసులో తలయెత్తాడు. ఆయనపేరు– హిరోడెటెన్ (ఈయన సయితం రెండున్నర వేల సంవత్సరాలనాటివాడే!) ఈయన తర్వాత ఎన్నదగు గ్రీక్ చరిత్రకారుడు థూసిడెడీజ్. పురాణాల పట్ల భక్తిగౌరవాలు, ఔషధంలేని జాడ్యంవలె మనలో జీతించిపోయి నందున మన దేశంలో తొలి చరిత్రకారుడుగా చెప్పదగినవాడు క్రీస్తు తర్వాత ఏడవ శతాబ్దికిచెందిన బాణభట్టు. ఆయన వ్రాసిన "హర్షచరిత'ను ప్రధానంగా ఒక కావ్యంగా పరిగణిస్తే, అటుపిమ్మట పేర్కొనదగు చరిత్రకారుడు ప్రాకృతంలో "గౌడవధ" వ్రాసిన వాక్పతిరాజు. ఈయన ఎనిమిదవ శతాబ్దంవాడు. నిజానికి ఈయన కృతి కూడా చరిత్ర లక్షణాల కంటె కావ్యగుణాలనే అధికంగా కలిగివున్నదనేవారు లేకపోలేదు. కాగా, చరిత్రలుగా చెప్పదగిన మన తొలిగ్రంథాలు పన్నెండవ శతాబ్దిలో కల్హణుడు వ్రాసిన "రాజతరంగిణి", బిల్హణుడు వ్రాసిన "విక్రమాంకదేవ చరిత్ర." ఒక సాహిత్య ప్రక్రియగా కావ్యంతోపాటు, నాటకంతోపాటు చరిత్ర మన దేశంలో ప్రాచీనకాలంలోనే ఆవిర్భవించక పోవడానికి కారణాన్ని తిరిగి చెప్పమంటారా? అయితే, వినండి. అది మన దరిద్రపు గొట్టు పురాణాలు దరిద్రపుగొట్టు ప్రభావమే!

# II

## పురాణాలలోని బొంకులు, రంకులు

గ్రీసులో క్రీస్తుకుపూర్వం అయిదవ శతాబ్దిలోనే పురాణాల విమర్శ ప్రారంభం కాగా, మన దేశంలో క్రీస్తుతర్వాత ఇరవయ్యో శతాబ్దిలో సయితం వాటి ప్రశంస జరుగుతున్నదని ఈ పీఠిక మొదటి ప్రకరణంలో చెప్పాను. వాటి ప్రశంసలతోనైనా మనం సరిపుచ్చడంలేదు, పవిత్రగ్రంథాలుగా వాటిని మనం పూజిస్తున్నాము, స్వర్గానికి సింహ ద్వారాలుగా వాటిని మనం ఔదల దాల్చుతున్నాము. తన ఆదర్శ రాజ్యానికి గాంధి పెట్టినపేరు "రామరాజ్యం" అని; అన్ని రుగ్మతలకు దివ్యౌషధం – గాంధి విశ్వాసం ప్రకారం – రామనామమే! గాంధి వియ్యంకుడు రాజగోపాలాచారి రామాయణాన్ని, భారతాన్ని సులభశైలిలో తమిళంలో వ్రాశాడు. ఇంగ్లీషు సమేతంగా అనేక భాషలలో వాటి అనువాదాలు వెలువడినాయి, అవి లక్షల సంఖ్యలో అమ్ముడుపోతున్నాయి. గాంధికి శిష్యుడు, రాజగోపాలాచారికి మిత్రుడు అయిన కె.యమ్. మున్షీ పౌరాణిక గాథలే ఇతివృత్తాలుగా ఎన్నో నవలలు వ్రాశాడు. వాటిలో ఒకటి "భగవాన్ పరశురాముడు". ఇది పాడు కలికాలమైపోయింది కానీ లేకపోతే ఆర్య ధర్మరక్షణకై దానివ్యాప్తికై మున్షీసయితం ఒక గండ్రగొడ్డలిని భుజాన వేసుకొని పద్దెనిమిది జైత్రయాత్రలు సాగించి వుండేవాడే! ఆయన రచనలో చిట్టచివరిది, అయిదారు సంపుటాల తర్వాత కూడా (ఆయన మృతికారణంగా) అసమగ్రంగా నిలిచిపోయినట్టిది "కృష్ణావతారం." పోతే, జాతీయ జ్ఞానపీఠంవారి లక్షరూపాయల బహుమానాన్ని పొందిన వారిలో ఒకరేమో తెలుగులో రామాయణం వ్రాసిన కవికాగా, మరొకరు కన్నడంలో రామాయణాన్ని వ్రాసిన కవి. ఇక, మన ప్రభుత్వం స్వయంగా నిర్వహిస్తున్న రేడియో తన దైనందిన కార్యక్రమాలను తెల్లవారేసరికి పౌరాణికదేవతల సంస్తవాలతో మొదలు పెడుతుంది; పొద్దుపోయినతర్వాత మరల వారి సంకీర్తనలతో ముగింపు చేస్తుంది. అది దేవభాష కాబట్టి చాలామందికి తెలియదుగాని "వేంకటేశ సుప్రభాతం"లో ఎన్నో బూతులున్నాయి.

పోనీ, వెనకటిగాథలకు ఇప్పటివారు కొత్త అర్థాలను చెబుతున్నారా? అదీలేదు. వాటిపై కొత్త వ్యాఖ్యానాలను చేస్తున్నారా? అదీలేదు. పై పెచ్చు స్నానం చేయించి, వలువలనుమార్చి, తల దువ్వి, జడ వేసి, పూలు తురిమి, సుగంధ ద్రవ్యాలను పులిమి, పురాణాలలోని కంపును కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంతటితో నైనా ఆగక, ఆధునికయుగ సమస్య లన్నింటికి మన పురాణాలలో పరిష్కారాలు లభించగలవని ప్రజా బాహుళ్యాన్ని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. మనది సమతా యుగం. మన

రాజ్యాంగదృష్టిలో, మన శాసనాలదృష్టిలో పౌరులందరిదీ సమాన ప్రతిపత్తి. పురాణాలు ఈ సమాన ప్రతిపత్తిని గుర్తించవు. వాటి దృష్టిలో కొందరు అగ్రజాతులవారు కాగా, మరి కొందరు నిమ్నజాతులవారు, కొందరు గొప్ప కులాలవారు కాగా, మరి కొందరు తక్కువ కులాలవారు. అందువల్ల కులాంతర వివాహాలను అవి వ్యతిరేకిస్తాయి; చివరికి సమిష్టి భోజనాలను సయితం అవి వ్యతిరేకిస్తాయి. పాతకాలపు ఆచారవ్యవహారాలను వీసం వాసిగానైనా అతిక్రమిస్తే, వర్ణసాంకర్యం జరుగుతుందని, వర్ణసాంకర్యం జరిగితే, ప్రపంచమే తలక్రిందులు కాగలదని భయపెట్టని పురాణం లేదు. అయినప్పుడు పురాణాలు మన సమతాయుగ ధర్మానికి విరుద్ధమైనవి కావా? రాజులేని వ్యవస్థను పురాణాలు అతి ఘోరవ్యవస్థగా భావిస్తాయి. అయినప్పుడు పురాణాలు మన ప్రజాస్వామ్య యుగధర్మానికే ప్రాణసంకటమైనవి కావా? ఒక్కమాటలో చెప్పాలంటే, మనకు పురాణాలలో విశ్వాసం వుంటే, మన నూతన రాజ్యాంగ విధానాన్ని చింపి ముక్కలు చేయాలి, చెత్తకుప్పపై విసిరి వేయాలి.

మనది పురోగతిని కాంక్షిస్తున్న తరం. యూరప్, అమెరికాలతో పోల్చినప్పుడు – చైనా, జపానులతో పోల్చినప్పుడైనా – మనం ఏడు తరాలు వెనుకబడి వున్నాము. ఉరుకులు, పరుగులు పెడితేనే తప్ప, వాటిని మనం కలుసుకోలేము. కాని, మన పురాణాలు మాత్రం మనం ఎంతగా ముందుకు సాగితే, సనాతన ధర్మానికి, సత్యయుగానికి అంత దూరం కాగలమని ప్రబోధిస్తున్నాయి. అంతగా మనం నాశంకాగలమని హెచ్చరిస్తున్నాయి. అట్టి పురాణాలు మన కాళ్ళకు బందాలు కావా, మన మెడకు ఉచ్చులు కావా? ఈ నాటికీ మన ప్రజలలో నూటికి 60 మందికిపైగా నిరక్షరాస్యులే. వారి మాట విడిచిపెట్టండి. మన సంఘనాయకులైనా, మన ప్రభుత్వాధినేతలైనా, పామరులకు భిన్నంగా ప్రవర్తించడం లేదు. ఒకే నోటితో, ఒకే నాల్కతో మన నూతన రాజ్యాంగాన్ని, మన పాత పురాణాలను ఏ విధంగా వారు మెచ్చుకొనగలుగుతున్నారో వారికే తెలియాలి! ఈ మెచ్చుకోలులో ఏదో ఒకటి విధిగా అబద్ధమైవుండాలి!

ఇంద్రుని "డిమోట్" చేసి, ఆతడి స్థానానికి బ్రహ్మ విష్ణు మహేశ్వరులను "ప్రమోట్" చేయడం మన దేశంలో జరిగినమాట నిజమే. అయినా, ఈ త్రిమూర్తులు ఇంద్రునికంటె ఉత్తములని చెప్పగలమా? ఉత్తములైతే, ఏ మేరకు? అంధవిశ్వాసంతో కాక, విచక్షణాదృష్టితో పరికిస్తే, ఇంద్రునిపై ఋజువర్తనలో వీరి ఆధిక్యత నామ – మాత్రమైనదే కాదా? ఈ విషయాన్ని నిరూపించడానికి పౌరాణిక గాథలను ఉదాహరించగోరితే, ఒక్కొక్కరిని గురించి కనీసం ఒక వందకు పైగా తేలికగా దొరుకుతాయి. అట్టి ప్రయత్నాన్ని నేను చేయబోవడం లేదు. ఒక్కొక్కరిని గురించి ఒక్కొక్క గాథనుమాత్రమే ఉదహరిస్తాను. వాటినైనా

నా మాటలలో కాక "పూర్వగాథాలహరి" అనే నిఘంటువును కూర్చిన వేమూరి శ్రీనివాసరావుగారి మాటలలో ఉదాహరిస్తాను. ముందు బ్రహ్మసంగతి వినండి. అబద్ధాలకోరును "రెండు నాల్కలవాడు" అంటారు. బ్రహ్మకు నాలుగు నాల్కలున్నాయి. ఇందువల్ల ఆయన మరింత సులువుగా, చెలువుగా అబద్ధాలు ఆడగలడని మనం అనుకోవాలి. సరే – ఇప్పుడిక శ్రీనివాసరావుగారు శివపురాణంనుంచి ఏమి యెత్తి వ్రాశారో ఒకసారి చిత్తగించండి:

"విష్ణుమూర్తియు బ్రహ్మయు తమ తమ యాధిక్యమును గూర్చి తగవులాడు కొనుచుండిరి. వారిట్లు పోరాడుచుండగనే వారియెదుట దివ్య ప్రభలతో వెలుగొందుచు స్తంభమువలె, లింగ మావిర్భవించెను. వారు దాని యౌన్నత్యమునకు వెఱగుపడి, దాని యాద్యంతములు పరీక్షింప గోరిరి. విష్ణుమూర్తి వరాహరూపమున గ్రిందివైపునకును, బ్రహ్మ హంసరూపమున నూర్ధ్వమునకును వెళ్ళిరి. ఎవరు తుదవఱకు బోయి వత్తురో వారికి రెండవవారు నమ్రులై పూజించునట్లొడంబడిరి.

"విష్ణుమూర్తి యెంతవెళ్ళినను స్తంభాది యగుపడినది కాదు. అతడు తిరిగి వచ్చెను. బ్రహ్మ తాను అంతమును జూచివచ్చితినని చెప్పెను. బ్రహ్మకు విష్ణువు నమస్కరించెను. కాని, శివుడు ప్రత్యక్షమై బ్రహ్మ యసత్యము పల్కెనని చెప్పెను."

బ్రహ్మదేవుడు ఆడిన అబద్ధం సంగతి విడిచిపుచ్చండి. అసలు ఈ గాథ ఎంత అసభ్యమైనది! ఎంత అశ్లీలమైనది!! అయినా, దీన్ని అక్షర రూపంలోనైనా మిగల్చక, శిల్పంగా మలచడం సయితం జరిగింది! ఇట్టి శిల్ప మొకటి ఉండవల్లి గుహలలోనే కావచ్చు ఒకప్పుడు చూచినట్టు జ్ఞాపకం.

కాగా, దేవీ భాగవతం "అథారిటీ"పై శ్రీనివాసరావుగారు విష్ణుమూర్తిని గురించి వ్రాసిన గాథను, తిరిగి ఆయన మాటలలోనే, ఆలకించండి:

"రేవతుడను వాడు గుఱ్ఱ మెక్కి వెళ్ళుచుండగ విష్ణువు లక్ష్మిని బిలిచి, చూడు మా గుఱ్ఱ మెంత యందముగ నున్నదో యని చెప్పెను. లక్ష్మి యా గుఱ్ఱమును ఱెప్పవేయక చూచుచుండెను. 'నీవు ఱెప్పవేయక యట్లు చూచుచుంటివి. నీకు గుఱ్ఱపు రూపు మనసైనది కాబోలు! నీ వాడుగుఱ్ఱమవై పుట్టు' మని లక్ష్మిని విష్ణువు శపించెను. ఈ శాపమున కామె విచారించెను, 'నీవు శివుని బ్రార్థించుము. నీకు పుత్రుడు కలిగిన పిదప శాపవిముక్తియగు'నని విష్ణువు పలికెను. లక్ష్మి కైలాసమున కేగి శివుని బ్రార్థించెను. శివుడు విష్ణువును రావించెను. విష్ణువు అశ్వరూపముతోడనే వెళ్ళి యా యాడు గుఱ్ఱమును గూడెను. అది గర్భవతియై పుత్రుని బడసెను. వెంటనే లక్ష్మికి శాపవిమోచన మయెను. ఆ పుట్టిన బాలుని లక్ష్మి విష్ణువు అచ్చటనే దిగవిడచి చనిరి. ఆ పుత్రుడే హయహయుడు."

ఈ గాథద్వారా దేవీభాగవతకర్త ఏమి నీతి బోధించగోరినాడో మీకు అంతు చిక్కిందా. నాకు ఇది ఒకే ఒక విషయాన్ని స్ఫురింప జేస్తున్నది. దీన్ని వ్రాసిన వ్యక్తి సభ్యతారహితుడు. సంస్కారహీనుడు. మలినమనస్కుడు, మానవాధముడు.

నాకు కలుగుతున్న జుగుప్సను అణచుకొని, ఇక్కడ శివుని విషయమై ఒక గాథను తిరిగి "పూర్వగాథాలహరి" నుంచే ఉటంకిస్తున్నాను.

"విష్ణువు జగన్మోహినీరూపము ధరించి వచ్చుటచే దానవు లామె రూపము చూచి మోహపరవశతచే మైమఱచియుండి యమృతమును గోల్పోయిరని శివుడు వినెను. ఆ రూపమెట్లుండునో చూడవలెనని యితనికి గుతూహలము కలిగి, తనకు జూపుమని విష్ణువు నడిగెను. 'నీ మతి చలించును. నీవు వికలమనస్కుడ వగుదువు. నీవు చూడజాల'వని విష్ణువు చెప్పెనుగాని, శివుడు బలవంతపెట్టెను. విష్ణువు వల్లెయని యంతర్ధానము నొందెను. ఇతడెచ్చటి కేగెనని నాల్గుమూలలు శివుడు పరికించుచుండగా నింతలో జగన్మోహిని శివునియెదుట నిలచెను. శివునకు మతి చలించినది. ఆమెను బట్టుకొనబోయెను. ఆమె పరుగిడెను. ఆమెవెంట శివుడు పరుగిడెను. నదులు, పర్వతములు, అరణ్యములు సరకుసేయక జగన్మోహని యును, నామె వెనుక శివుడును బరుగిడుచుండిరి. తుదకు శివునకు వీర్యము జారిపడెను. అపుడు హరిమాయ తెలిసికొని స్తుతించెను. విష్ణువు నిజ స్వరూపము దాల్చి గోచరించెను."

ఈ మూడు గాథల తర్వాత నా వ్యాఖ్యానంగా నేను చెప్పవలసింది ఒకే ఒకమాట. శోధించి వీటిని నేను పట్టుకోలేదు; "పూర్వగాథాలహరి" పుటలను ఒకసారి యదాలాపంగా చూచినంతమాత్రాన ఇవి కంటబడినాయి. ఆ నిఘంటువు పుటలలో వీటికంటె అశ్లీలమైన, జుగుప్సాకరమైన, నీచమైన గాథలు కొన్ని వందలున్నాయి.

నేను ఉదహరించిన మూడు గాథలు మూడు పురాణాలలోనివి కాబట్టి, పురాణాలలో ఏమి వున్నా, రామాయణంలో, భారతంలో ఈ విధమైనవి లేవని వాదించడానికి వీలులేదు. రామాయణంలో అహల్య ఇంద్రునితో వ్యభిచరించి, "నా జన్మ పావనమైంది; మనకు ప్రమాదం రాకుండా నా భర్త తిరిగి రాకముందే మీరు చల్లగా తప్పుకొనండి" అని హెచ్చరిక చేసిన గాథ లేదా? ఇదే విధమైన బూతుకథలు భారతంలోనైనా ఎన్ని లేవు? కర్ణుని జన్మవృత్తాంతాన్ని జ్ఞాపకం తెచ్చుకొనండి; ఎవరికి ధర్మరాజును, భీముని, అర్జునుని కుంతి కనిందో జ్ఞాపకం తెచ్చుకొనండి. అంతకుముందు ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు – వీరి పుట్టుక సంగతిని జ్ఞాపకం తెచ్చుకొనండి. ఇంతకంటె ముఖ్యంగా అసలు వేదవ్యాసుని జన్మ వృత్తాంతాన్ని జ్ఞాపకం తెచ్చుకొనండి. నిజానికి ఇవి జ్ఞాపకం తెచ్చుకొనదగు గాథలు కావు కాబట్టి, వీటి ప్రసక్తిని మరి నేను విరమిస్తాను.

శృంగారలీలలు, కామకలాపాలు – వీటిని విడిచిపుచ్చండి; మానవ మాత్రులైన మన విషయంలోనైనా క్షంతవ్యంకాని అసత్యవచనాలు, అన్యాయచర్యలు, కపటవర్తనలు, క్రౌర్య ప్రదర్శనలు – వీటిని సయితం విడిచిపుచ్చండి; సాక్షాత్తు అవతారపురుషులైన రాముడు, కృష్ణుడు వీటిని మించిన దుష్కృత్యాలలో ఎన్నింటికి పాల్పడలేదు? వాలివధలో, శంబుకుని వధలో కేవలం రామభక్తులు తప్ప అన్యులు ఆయన ప్రవర్తనను హర్షించగలరా? సమర్థించగలరా? సీతను ఎంత కఠినంగా, ఎంత కర్కశంగా, ఎంత క్రూరంగా ఆయన చూడలేదు, ఎంతగా ఆమెను సంక్షోభ పెట్టలేదు? రాముని స్వభావాన్ని గురించి నా అభిప్రాయాలను తెలుసుకొన గోరేవారు "జాబాలి", "సీతజోస్యం" అనే నా రెండు నాటకాల పీఠికలను చదవవచ్చు. పోతే, భాగవత కృష్ణునివరకు వెళ్ళక, భారత కృష్ణుని చరిత్రను పరికించినా, దానిలో ఎన్ని అకృత్యాలు లేవు, ఎన్ని అన్యాయాలు లేవు? జరాసంధుని చంపడానికి భీమార్జునులను బ్రాహ్మణవేషంలో ఆయన తీసుకువెళ్ళలేదా? అశ్వత్థామ చచ్చిపోయినట్లు ధర్మరాజుచేత ద్రోణాచార్యునికి అబద్ధాన్ని చెప్పించ లేదా? గదాయుద్ధంలో దుర్యోధనుని కటిప్రదేశానికి కిందుగా మోదవలసిందిగా భీమునికి ఆయన చెప్పలేదా? లెక్కపెట్టగోరితే, కృష్ణుని విషయంలో ఇట్టి సంఘటనలు భారతంలో కనీసం మరొక పది కనబడకపోవు.

అవతారపురుషులే ఈ విధంగా ప్రవర్తించినట్టు మనకు చెప్పే రామాయణ, భారతాలను పవిత్రగ్రంథాలుగా భావించే దేశంలో, వాటిని చదివినా, విన్నా అన్ని పాపాలు ప్రక్షాళన కాగలవని నమ్మే దేశంలో నైతికపు విలువలు తక్కువ స్థాయికి దిగజారితే అందుకు ఆశ్చర్యపడ నక్కరలేదు గదా? నైతికపు విలువలకు అపరిచితులైనవారే గ్రంథకర్తలైతే, వారే పత్రికాసంపాదకులైతే, వారే సంఘనాయకులైతే, వారే దేశపరిపాలకులైతే కంచుకాగడాతో వెదకినా నీతి కనబడుతుందా? నిజాయితీ కానవస్తుందా? అప్పుడే మానవత్వం సయితం పూర్తిగా లోపించదా?

# III

# పురాణాలు చేసిన, చేస్తున్న కీడు

పురాణాలలో బూతుకథలే తప్ప నీతికథలు లేనేలేవా? లేకేమి? కొన్ని వున్నాయి. అయితే, వాటిసంఖ్య బహుస్వల్పం. పైగా, వాటిలోని నీతి వ్యక్తి ముక్తికే, అతడి మోక్షానికే ప్రాధాన్య మిస్తుంది. సమష్టి క్షేమానికి కాదు; సంఘాభివృద్ధికి కాదు, ఇంతే కాదు, ఆ కథలలోని నీతికి ఒక క్రమం లేదు, ఒక పద్ధతి లేదు, ఒక స్థాయి లేదు, ఒక ప్రమాణం లేదు. దేవతలు చేసిన పనినే మానవులు చేస్తే, అది నీతివిరుద్ధం కావచ్చు. ఋషులు

నడిచిన దారినే గృహస్థులు నడిస్తే, అది నీతిబాహ్యం కావచ్చు. ఇదే రీతిగా, భూసురుల విషయంలో ఏది ధర్మమో, అన్యుల విషయంలో అది పాపకృత్యం కావచ్చు. రాజుల విషయంలో ఏది న్యాయమో ఇతరుల విషయంలో అది శిక్షార్హమైన నేరం కావచ్చు. ఇట్టి పరస్పర వైరుధ్యాలు, పరిపూర్ణ వైపరీత్యాలు పురాణాలలోని నీతికథలలో కోకొల్లలుగా వున్నాయి.

పురాణాలను ఆదిలో వ్రాసినవారికి, అటుపిమ్మట వాటిలో మార్పులు, చేర్పులు ప్రవేశపెట్టినవారికి ఇవి తెలియని సంగతులు కావు. కావాలనే, పనికట్టుకొనేవారు ఈ వైఖరి అవలంబించారు, ఈ ధోరణిని అనుసరించారు. వారు కోరింది వర్గన్యాయం కాదు, వర్గాధిక్యత; వారు అభిలషించింది వర్ణసమత కాదు, వర్ణాధిపత్యం. వారు లక్షించింది సంఘోన్నతి కాదు, స్వర్గసుఖం, లేదా జన్మరాహిత్యం.

స్వర్గ సుఖం మాట విడిచిపుచ్చండి, జన్మపునర్జన్మల ప్రసక్తి విడిచి పుచ్చండి. పోతే, వర్ణాధిపత్యం, వర్గాధిక్యత – ఈ రెండు లక్ష్యాలకు సంబంధించినంతవరకు మన పురాణాల రచయితలు అఖండ విజయాన్ని సాధించారు. అన్యదేశాలలో, అన్యసంఘాలలో వర్ణాధిపత్యాన్ని, వర్గాధిక్యతను కాపాడుకొనడానికి తరచుగా బలప్రయోగం చేయవలసి వచ్చింది. ఈ దేశంలో, ఈ సంఘంలో బలప్రయోగంతో అవసరం కలిగిన ఘట్టాలు దాదాపు కానరావు. మన పురాణాలకు సంబంధించినంతవరకు – దానవులు, కిరాతులు, నిషాదులన్నవారిని లెక్కనుంచి మినహాయిస్తే, అన్యులలో ఒక్క నహుషుడు తప్ప, ఒక్క వేనుడు తప్ప, పౌరాణిక నీతిపై, పౌరాణిక ధర్మంపై తిరుగుబాటు చేసిన మూడవ వ్యక్తి ఈ క్షణంలో నాకు జ్ఞాపకం రావడం లేదు. ఒక వేళ నేను గుర్తుతెచ్చుకొనలేక పోతున్నవారు మరికొందరుంటే, అట్టివారు బహుశా ఇద్దరు, ముగ్గురిని మించరు. ఎంతటి దీనస్థితికైనా, మరెంతటి హీనావస్థకైనా, ఎంతటి దురన్యాయానికైనా, మరెంతటి దుర్గతికైనా, ప్రజాబాహుళ్యాన్ని మానసికంగా ఒప్పించగల పద్ధతిని “బ్రెయిన్ వాషింగ్” అంటారు. ఈ “మెదడు ఉతుకుడు” విద్యలో ప్రావీణ్యానికి నోబెల్ బహుమానం వుంటే, దాన్ని మన పురాణాలరచయితలకే వరసగా యిచ్చుకొంటూపోవాలి!

కనీసం ఒకటిన్నర లేదా రెండు వేల సంవత్సరాలుగా ఈ “బ్రెయిన్ వాషింగ్” క్షుణ్ణంగా జరిగివుండకపోతే, మన దేశంలో అగ్రవర్ణాలవారు, అగ్రవర్గాలవారు చేసిన – చేస్తున్న – ఘోరాన్యాయాలకు ప్రతిఘటనగా వారు పెడుతున్న దారుణహింసలకు ప్రతీకారంగా సాయుధ విప్లవాలు కనీసం ఒక వెయ్యి చెలరేగివుండేవి.

పురాణాలలోని నీతికథల ప్రసక్తినుంచి కొంతదూరం వచ్చినట్టున్నాను. అందువల్ల తిరిగి వెనకకు వెడతాను. పురాణాలలోని నీతికథలలో అత్యుత్తమమైనవిగా నాల్గింటిని

పేర్కొనడం కద్దు. వాటిలో మొదటిది హరిశ్చంద్రునికథ, రెండవది నలదమయంతుల కథ, మూడవది సావిత్రీ సత్యవంతులకథ, నాల్గవది శిబిచక్రవర్తికథ. వీటిలో రెండవ, మూడవ కథలలో ఏమి గొప్ప నీతికలదో నా మందబుద్ధికి, లేదా నా వక్రబుద్ధికి అర్థంకావడం లేదు. నలుడు అందగాడు కావచ్చు, రథాన్ని వేగంగా నడపడంలో మొనగాడు కావచ్చు, వంటలో, వార్పులో చేయి తిరిగినవాడు కావచ్చు, ఇవికాక, అతడిలో నాల్గవఘనత ఏదీ కనబడదు. ఆ కాలంనాటి తక్కిన మహీపతులకువలె ఆతడికి కూడా జూదం ఒక మహావ్యసనం. అన్నట్టు, వారి విషయంలో దాన్ని "జూదం" అనరాదు, "ద్యూతం" అనాలి. ఆ వ్యసనంవల్ల అతడు కొన్ని కష్టాలు పడి, చివరికి వాటినుంచి నలుడు ఎలాగో బయటపడ్డాడు. అతడి కష్టాలకు అతడి స్వభావంకాక శనైశ్చరుడు కారణమని చెబుతా రనుకోండి. వాడి పిలకజుట్టు పట్టుకొని, శనిగాడిని లాక్కువస్తే, సమర్థించలేని వ్యసనం, లేదా ఘోరం ఏదైనా మిగులుతుందా? తాగి తందనాలాడితే, అది శనిగాడి పనే, దారిని పోయే పడతిని చెరిస్తే, అది శనిగాడిపనే, ఇరుగుపొరుగువాడితో తగవులాడి వాడిని చంపితే, తిరిగి అది శనిగాడి పనే. పురాణకర్తలు అన్ని కలహాలను నారదునికి అంటగట్టినట్లు అన్ని దౌర్బల్యాలను, దుశ్చర్యలను, దౌర్భాగ్యాలను శనైశ్చరుని నెత్తికి చుడతారు, కాగా, నలదమయంతుల కథలో నీతి ఏదైనావుంటే, అది దమయంతి పాతివ్రత్యం మాత్రమే.

నలునికున్న ద్యూతవ్యసనం సత్యవంతునికి లేదుగాని, ఆశ్వ శాస్త్రంలో, పాకశాస్త్రంలో అతడికున్న ప్రావీణ్యాలు సయితం ఇతడికి లేవు. "చిత్రాశ్యుడు" అని మరొక పేరు ఇతనికి కలదు కాబట్టి, ఒకవేళ గుర్రపుస్వారీలో ఘనుడేమో ఆ సంగతి నాకు స్పష్టంగా తెలియదు. ఏమైనా, ఇతడు వీరుడు కాదు, శూరుడు కాదు. సింహాసనాన్ని పోగొట్టుకొన్న ముసలితండ్రి పరువును కాపాడ్డానికై కత్తి పట్టడానికి బదులుగా, కట్టెలు కొట్టుకు రావడంతో ఇతడు కాలం గడుపుతాడు. ఏమైనా ఈ కథలోని నీతిసయితం తిరిగి పాతివ్రత్యమే. సత్యవంతుని ప్రాణాలను స్వయంగా లాక్కు వెళ్ళడానికి పాశం చేతపుచ్చుకొని, దున్నపోతుపై యమధర్మరాజు వేంచేయడం, ఆయనను బతిమలాడి సావిత్రి తన భర్తను బ్రతికించుకొనడం – ఇది కట్టుకథ కాకపోతే, మరి ఏది కట్టుకథ కాగలదో నాకు తెలియదు.

ప్రతి పురాణంలో, ప్రతి ధర్మశాస్త్రంలో, ప్రతి ప్రాచీనరచనలో పాతివ్రత్యానికి ఇంతగా మహత్తులను అంటగట్టడం భార్యలపై భర్తల ఆధిపత్యాన్ని కాపాడ్డానికే, భర్త జూదరి కావచ్చు, తాగుబోతు కావచ్చు, తిరుగుబోతు కావచ్చు, అతడు రోగి కావచ్చు, క్రూరుడు కావచ్చు, నీచాతి నీచుడు కావచ్చు. అయినా అతడిని ఒక దాసివలె భార్య సేవించాలి, ఒక భక్తురాలివలె పూజించాలి, కేవలం ఒక ఛాయవలె అనుసరించాలి. అతడికోసం ఏ కష్టమైనా పడాలి, ఎంతటి త్యాగమైనా చేయాలి. తనను నీచంగా చూచినా నికృష్టంగా

హింసించినా సహించాలి. సహించడమైనా చాలదు, పతివ్రతగా తన అంతస్తు పెరిగిపోతున్నదని సంతోషించాలి. ఇంతే కాదు, ఆ మానవాధముడే జన్మజన్మలకు తన పతిదేవుడు కావాలని నోములు నోయాలి, పూజలు చేయాలి, ప్రార్థనలు జరపాలి.

స్త్రీలకు సంబంధించినంతవరకు ఇది కూడా తిరిగి "బ్రెయిన్ వాషింగ్." వారి విషయంలో ఇది మరింత ఉధృతంగా జరిగింది, విస్తృతంగా జరిగింది. సంపూర్ణంగా జరిగింది. అందువల్లనే వారి స్థితిగతులు ఈ నాటికి సయితం అతి దయనీయంగా వున్నాయి. ఈ స్థితికి హిందూస్త్రీని దిగజార్చినట్టివి ప్రధానంగా పతివ్రతశిరోమణుల కథలే, గాథలే. నవభారత రాజ్యాంగం పురుషునితోపాటు స్త్రీకి సమాన ప్రతిపత్తిని కల్గించిన తర్వాత కూడా పాతకాలపు పతివ్రతాశిరోమణుల కథలను, గాథలను పురాణాలుగా వినిపిస్తున్నారు, హరికథలుగా చెబుతున్నారు, కావ్యాలుగా ప్రచారం చేస్తున్నారు, నాటకాలుగా ప్రదర్శిస్తున్నారు, సినిమాలుగా తెర కెక్కిస్తున్నారు. స్త్రీలలో నూటికి ఒక్కరైనా ఈ కథలను, గాథలను నిరసించకపోగా, తామే వీటిని ప్రశంసించడాన్ని చూడగా వారి విషయంలో "బ్రెయిన్ వాషింగ్" ఏ మేరకు వెళ్ళిందో మనకు కొంతవరకు బోధపడుతుంది. కేథలిక్ పీఠాధిపతులు "బ్రెయిన్ వాషింగ్"లో ప్రవీణులని చెప్పడం కద్దు. ఈ ఉభయవర్గాల వారు మన పురాణ కర్తల వద్ద "అ, ఆ"లు దిద్దుకోవాలి, గుణింతం నేర్చుకోవాలి.

స్త్రీల విషయంలోకంటె అస్పృశ్యుల విషయంలో పురాణకర్తలు "బ్రెయిన్ వాషింగ్"ను మరింత జయప్రదంగా చేశారు. ప్రాచీనసంఘాలన్నిటిలో ఏదో ఒక వర్గాన్ని హీనంగా చూడ్డం జరిగిన మాట నిజమే. ఉదాహరణకు, రోమన్‌సంఘంలో "స్లేవ్స్" వుండేవారు, స్పార్టన్ సంఘంలో "హీలెట్స్" వుండేవారు, బ్రిటీష్‌సంఘంలో "విలెన్స్" వుండే వారు, జర్మన్, పోలిష్, రష్యన్ సంఘాలలో "యూదీయు" లుండేవారు, అమెరికన్‌సంఘంలో "నీగ్రో" లుండేవారు. ఈ నాటికైనా, అమెరికన్ నీగ్రోలు కొన్ని రాష్ట్రాలలో, ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాలలో, అసమానతలకు అవమానాలకు, అప్పుడప్పుడు అత్యాచారాలకు సయితం గురికావలసి వస్తున్నది. అయితే, ప్రపంచం మొత్తంమీదనే ఏ సంఘమూ – ఎన్నడూ – హిందూసంఘం అస్పృశ్యులను చూచినంత హీనంగా, అంత హేయంగా చూడలేదు. పశువులకంటె తక్కువగా అది వారిని చూచింది. ఇది పొరపాటుమాట. కీటకాలకంటె కూడా తక్కువగా అది వారిని చూచింది. పైగా, ఇది దాదాపు మూడు వేల సంవత్సరాలుగా సాగుతున్నది. నవభారత రాజ్యాంగం అస్పృశ్యతను అపరాధంగా ప్రకటించినా, దాన్ని పాటించే వారు నిరాఘాటంగా పాటిస్తూనేవున్నారు. ఇంతేకాదు. ఇటీవల, ముఖ్యంగా గత దశాబ్దిలో అస్పృశ్యసంఘంపట్ల అత్యాచారాలు పెరిగిపోయాయి. పోనుపోను తరగడానికి బదులు ఇవి మరింత పెరిగిపోతున్నాయి. అయినా, అస్పృశ్యులలో కత్తియెత్తినవా

రెందరున్నారు, కదనరంగంలో నిలిచినవారెందున్నారు? నీగ్రోలు హీనస్థితిలో పడింది నాలుగైదు వందల సంవత్సరాల క్రితమే. అయినా, ఆఫ్రికాఖండంలో ఒకటి, రెండు దేశాలలో తప్ప, అమెరికాఖండంలో బహుకొద్ది రాష్ట్రాలలో తప్ప తిరిగి వారు నేడు తల యెత్తుకొని బ్రతకగలుతున్నారు. మొత్తం నీగ్రోజాతి మరల స్వతంత్ర ప్రతిపత్తిని మరొక దశాబ్దంలోపలనే పొందవచ్చు. ఇందుకు భిన్నంగా మన దేశంలో జరగడం అస్పృశ్యులన్న వారికి సంఖ్యాబలం లేకపోవడం వల్ల కాదు. వారు వేలలో కాదు, లక్షలలో కాదు, కోట్లలో వున్నారు. అయినా, వారిలో కరుకుతనం ఎందుకు లేదు? కనీసం కన్నెర్ర చేయడం వరకైనా వారు ఎందుకు వెళ్ళలేరు? దీనికి కారణం – ఇంతకుముందే నేను చెప్పినట్లు పురాణాలు చేసిన "బ్రెయిన్ వాషింగ్." పూర్వజన్మలో ఏదో ఘోరపాపాలు చేసినందువల్లనే ఇప్పుడు ఈ హీనజన్మ కలిగినదన్న నమ్మకాన్ని పురాణాలు వారికి నూరి పోశాయి.

పురాణాలలోని నీతికథలలో అత్యుత్తమైనవిగా బహుశా పేర్కొన దగు నాల్గింటిలో రెండింటి ప్రస్తావనమాత్రం చేసి, తక్కిన రెండింటి సంగతిని నేను తడవలేదు. హరిశ్చంద్రుని ప్రసక్తిని కొంతదూరం పోయిన తర్వాత విశేషంగా తెస్తాను కాబట్టి ఆయన విషయం ఇక్కడ ముచ్చటించను. పోతే, మిగిలింది శిబిచక్రవర్తి. ఈయన జీవకారుణ్యం హర్షించదగిందే. ఈయన త్యాగగరిమ సంస్తవించదగిందే. కాని, ఎన్ని శ్యేనాలబారినుంచి ఎన్ని కపోతాలను రక్షించడానికై ఈయన తన శరీరాన్ని కోసి యివ్వగలిగేవాడు? అది క్రూరధర్మం కావచ్చు; ఘోరధర్మమే కావచ్చు; అయినా, ఆహారంకోసం ఒకప్రాణి మరొకదాన్ని పట్టిచంపడం ప్రకృతి ధర్మంకాదా? ఈ ప్రకృతిధర్మాన్ని ఏ శిబిచక్రవర్తి అడ్డగలడు? ఇది అసాధ్యమని పురాణకర్తలకు తెలియకపోలేదు. అందువల్ల కపోతం శిబిచక్రవర్తివద్దకు రావడం, ఆయనను శరణువేడడం, కపోతాన్ని భక్షించగోరిన డేగ" అయితే, నన్ను ఆకలితో చావమంటావా?" అని ప్రశ్నించడం, "చావ నక్కరలేదు, పావురం యెత్తు మాంసాన్ని నా తొడనుంచి కోసి యిస్తా" నని ఆయన చెప్పడం – ఈ విధంగా కథను మరింత సాగదీసిన తర్వాత, పురాణకర్తలు "అబ్బే!' ఇది ఉత్తుత్తి నాటకం. శిబిచక్రవర్తి త్యాగగుణాన్ని పరిశీలించడానికి అగ్ని, ఇంద్రుడు పక్షులరూపంలో వచ్చా" రని చల్లగా జారుకొన్నారు. ఏదో ఒక వెర్రిమాట చెప్పి, ఒక పిచ్చి వ్రాత వ్రాసి, ఏ దేవుళ్ళనో, ఏ దయ్యాలనో ప్రవేశపెట్టి, తమను తాము సమర్థించు కొనడంలో మన పురాణకర్తలు ప్రదర్శించే చాకచక్యం ఇంతంత కాదు! ఏమైనా, ఇక్కడ మరొక్క విషయం చెప్పి, ఈ ప్రకరణాన్ని ముగిస్తాను. పురాణాలు చేసిన చేస్తున్న – "బ్రెయిన్ వాషింగ్" నుంచి ఇప్పటికైనా మనం బయటపడ లేకపోతే, ఇప్పటి అజ్ఞానంలోనే, ఇప్పటి అంధకారంలోనే, ఇప్పటి అధోగతిలోనే మన దేశం మిగిలిపోతుంది. పురాణాలు స్వర్గద్వారాలను మనకోసం తెరవడం శుద్ధాబద్ధం; అవి మనను ప్రతీపశక్తుల కారాగారంలో బంధించడం పరిపూర్ణసత్యం.

# IV
# ముగ్గురు హరిశ్చంద్రులు

మనకు సుపరిచితుడైనవాడు సత్యహరిశ్చంద్రుడు. ఈయనతో పాటు అసత్య హరిశ్చంద్రుడు మరొకడున్నాడు. వీరిద్దరికి జతగావున్న మూడవ హరిశ్చంద్రుడు – రాజర్షి హరిశ్చంద్రుడు. ఈ ముగ్గురు హరిశ్చంద్రుల ప్రసక్తి కానవచ్చే ప్రాచీన గ్రంథాలలో ఇవికొన్ని; ఐతరేయి బ్రాహ్మణం, రామాయణం, భారతం, మార్కండేయపురాణం, పద్మపురాణం, వాయుపురాణం, శివపురాణం, భాగవతం, దేవీభాగవతం. వీటిలో ఏయే గ్రంథాలలో, ఏయే హరిశ్చంద్రుడు, ఏయే రూపంలో మనకు సాక్షాత్కరిస్తాడో ఆ వివరాలలోకి నేను వెళ్ళబోవడం లేదు. కాగా, ఇక్కడ నేను చెప్పగోరుతున్నది మార్కండేయపురాణంలోని గాథకే అధిక ప్రాధాన్యం లభించిందని, ఈయనే సత్యహరిశ్చంద్రుడని.

మార్కండేయపురాణంలోని గాథను ఆధారంగా చేసుకొని, క్రీస్తు శకం పది, లేదా పదకొండవ శతాబ్దిలో క్షేమేంద్రుడు "చండకౌశిక" నాటకం సంస్కృతంలో వ్రాశాడు. అటు పిమ్మట ప్రతి భారతీయ భాషలో హరిశ్చంద్రుడు గురించి జానపదగేయాలు, యక్షగానాలు, కావ్యాలు, నాటకాలు మొదలైనవి లెక్కలేనన్ని వెలువడినాయి. మన తెలుగుకు సంబంధించినంతవరకు పదిహేనవ శతాబ్దికి చెందిన గౌరన "హరిశ్చంద్రో పాఖ్యానం" అనే ద్విపదకావ్యం వ్రాశాడు. పదిహేడవ శతాబ్దికి చెందిన రామరాజభూషణుడు "హరిశ్చంద్ర నలోపాఖ్యానం" అనే ద్వ్యర్థికావ్యం రచించాడు. పందొమ్మిదవ శతాబ్దికి చెందిన శంకర కవి "హరిశ్చంద్రో పాఖ్యానం" అనే పద్యకావ్యం ప్రచురించాడు. పోతే, తెలుగులో హరిశ్చంద్రుని గురించి వెలువడిన మొట్టమొదటి నాటకం కందుకూరి వీరేశలింగం వ్రాసినట్టిది. అంతకు కొన్నేళ్ళకు ముందుగానే వ్రాసినా దాని ప్రచురణ 1899లో, నాటినుంచి 1929 వరకు ("ఆంధ్ర వాఙ్మయ సూచిక" వివరణ ప్రకారం) తెలుగులో వచ్చిన హరిశ్చంద్ర నాటకాల సంఖ్య 26. తర్వాత మరెన్ని వచ్చినవో నాకు తెలియదు. ఈ నాటకాలన్నింటిలో ఎక్కువ ప్రసిద్ధి పొందినట్టిది బలిజేపల్లి లక్ష్మీకాంతం రచన. ఇన్ని నాటకాల రూపంలోనే కాక, హరిశ్చంద్రుని గాథ తెలుగులో యక్ష గానంగా వచ్చింది. హరికథగా వచ్చింది, వచనకావ్యంగా వచ్చింది; మత గ్రంథంగా వచ్చింది. ఇట్టి అవతారాలను మరి కొన్నింటిని కూడా అది యెత్తివుండాలి. హరిశ్చంద్ర నాటకకర్తలలో కొత్తదారి తొక్కిన ఘనత విశ్వనాథ సత్యనారాయణదని చెప్పాలి. ఐతరేయ బ్రాహ్మణంలోని, మార్కండేయ పురాణంలోని హరిశ్చంద్రగాథలను ఆయన రెండు విడివిడి నాటకాలుగా వ్రాసి "కావ్య – వేద హరిశ్చంద్ర నాటకములు" అనే పేరుతో ఒకే సంపుటిగా ప్రచురించాడు.

ఐతరేయ బ్రాహ్మణంలో మనకు దర్శన మిస్తాడు కాబట్టి ముగ్గురు హరిశ్చంద్రులలో అతి ప్రాచీనుడు సత్య హరిశ్చంద్రుడు కాదు, అసత్య హరిశ్చంద్రుడే. ఒకరి తర్వాత మరొకరినో, లేక జట్లు జట్లుగానో ఆ వైనం మనకు తెలియదుగాని, ఆయన నూర్గురిని కట్టుకొన్నా, ఒక ర్తుక కడుపైనా పండలేదు. అందుమీదట నారదుని హితోపదేశం ప్రకారం "నాకొకపుత్రుని ప్రసాదిస్తే, వాడిని యజ్ఞపశువును చేసి, నీకు ప్రీతిని కూర్చుతా" నని వరుణదేవునికి హరిశ్చంద్రుడు మొక్కుకొంటాడు. వరుణదేవుని కృపవల్ల ఆయనకు పుత్రసంతానం కలుగుతుంది. ఆ బాలునికి "రోహితుడు" అని పేరు పెడతాడు. లేక లేక కలిగిన కొడుకుని, ఏ తండ్రి బలిపెట్టగలడు? అందువల్ల ఎప్పటికప్పుడు ఏదో సాకు చెప్పి, తన వాగ్ధాన పరిపాలనలో హరిశ్చంద్రుడు విలంబనం చేస్తాడు, కొంత ఊహ తెలియగానే తనను ఎక్కడ యజ్ఞపశువును చేస్తారో అని భయపడి, రోహితుడు అరణ్యాలకు పారిపోతాడు. కొన్ని సంవత్సరాలు ఆ విధంగా గడిచిపోతాయి. ఇది వరుణదేవునికి ఆగ్రహ కారణం కాగా, హరిశ్చంద్రునికి జలోదరవ్యాధిని కలిగిస్తాడు. తండ్రి రుగ్మత వార్తవిన్న రోహితుడు యజ్ఞపశువు కావడానికి సన్నద్ధపడగా, ఇంద్రుడు బ్రాహ్మణవేషంలో వచ్చి, అతడిని వారిస్తాడు. ఇందువల్ల మరో ఆరేళ్ళు దొర్లిపోతాయి. అంతట రోహితుడు తన స్థానంలో యజ్ఞపశువును చేయడానికి "అజీగర్తుడు" అనే పేద బ్రాహ్మణుని ముగ్గురు కొడుకులలో రెండవ వాడిని "శునశ్శేపుడు" అనేవాడిని నూరు ఆవులిచ్చి కొంటాడు. క్షత్రియునికంటె బ్రాహ్మణుడు అధికుడు కాబట్టి, శునశ్శేపుని బలిగొనడానికి వరుణుడు సమ్మతిస్తాడు. అందుపై నరమేధానికి సర్వసన్నాహాలు జరుగుతాయి. అయితే, శునశ్శేపుని యూపస్తంభానికి కట్టడానికి ఒక్కరైనా ముందుకు రారు. మరొక నూరు గోవులను పుచ్చుకొని, ఆ పనిని అజీగర్తుడే చేస్తాడు. ఇక మిగిలింది. శిరశ్ఛేదనం. అన్యులెవ్వరు అందుకు సమ్మతించకపోగా, "నాకు ఇంకొక వంద ఆవుల నివ్వండి. మిగిలిన ఆ కాస్తపనిని కూడా నేనే చేస్తా" నని అజీగర్తుడు కసాయి కత్తితో లేస్తాడు. ఈ ఘట్టంలో శునశ్శేపుడు వేదమంత్రాలను చదివి, వివిధ దేవతలను ప్రార్థించగా, అతడికి యూపస్తంభంనుంచి విముక్తి, లభిస్తుంది, హరిశ్చంద్రునికి ఆరోగ్యం లభిస్తుంది.

నరమేధానికి ఏ ఋషికీ ఏ విధమైన అభ్యంతరం వుండేది కాదు గోదానాలను, భూదానాలను, సువర్ణదానాలను, ఇతర దానాలను పుష్కలంగా స్వీకరించి, నరమేధాన్ని వారు స్వయంగా జరిపించేవారు. శునశ్శేపుని యజ్ఞపశువును చేయబోయినప్పుడు విశ్వామిత్రుడు హోత, జమదగ్ని ఆధ్వరుడు, వసిష్ఠుడు బ్రహ్మ, ఆయాస్యుడు ఉద్గాత. ఈ నలుగురిలో విశ్వామిత్రుడు కొంతనయం. అజీగర్తుని ప్రవర్తనపట్ల జుగుప్స కలిగిందో లేక శునశ్శేపునిపట్ల జాలి కలిగిందో మనకు తెలియదు గాని, యూప స్తంభం నుంచి

బంధవిముక్తి పొందిన శునశ్శేపుని తన కుమారునిగా స్వీకరిస్తాడు. ఇందుకు విశ్వామిత్రుని నూటొక్కమంది కొడుకులలో పెద్దవారు యాభైమంది తండ్రిని వ్యతిరేకిస్తారు. వారిపై ఆగ్రహపడి, ఆర్యావర్తానికి వెలుపల హీనంగా, హేయంగా జీవించవలసిందిగా వారిని ఆయన శపిస్తాడు. కాగా, విశ్వామిత్రుని పుత్రులలో మధ్యముడైన మధుచ్ఛందుడు, అతడి యాభై మంది తమ్ములు తమ అన్నగా శునశ్శేపుని గుర్తిస్తారు. ఈ గుర్తింపు తర్వాత శునశ్శేపుని పేరు "దేవరాతుడు"గా మారుతుంది.

ఇది ఐతరేయ బ్రాహ్మణంలోని గాథ, రామాయణంలో, భాగవతంలో ఇది కొంత భిన్నంగా వున్నది. ఆ విషయాన్ని వివరంగా చర్చించక, ఇక్కడ రెండు, మూడు ముఖ్యాంశాలను మాత్రం పేర్కొంటాను.

విశ్వామిత్రుడు శపించిన కుమారులలో ఒకరి సంతతివారే ఆంధ్రులు. రామాయణ, భారతాల ప్రకారం విశ్వామిత్రుని శాపం "మీరు దస్యులు కండి! కుక్క మాంసం తినండి" అని. అయినా, "ఐతరేయ బ్రాహ్మణంలో మా ప్రసక్తి వున్నది" అని ఆంధ్రులలో కొందరు ఎందుకు గొప్పలకు పోతారో నాకు అర్థంకాని విషయం. తమ గొప్పతనం తమ ప్రాచీనతలో వున్నదా? లేక దస్యులుగా బ్రతుకుతూ, కుక్క మాంసం తినడంలో వున్నదా? ఏమైనా, ఈ విషయంలో గొప్పలకు పోవడం "మతిలేనిపని"గా భావించినందువల్లనే కావచ్చు, "వేద హరిశ్చంద్ర" నాటకంలో విశ్వనాథ అసలు విశ్వామిత్రుని శాపం ప్రసక్తినే విడిచి పెట్టడం జరిగింది.

పోతే ఒకప్పుడు మనదేశంలో నరమేధం సర్వసామాన్యమన్న సూచన ఐతరేయ బ్రాహ్మణ గాథలో వున్నది. ఈ పుణ్యభూమిలో సోదర మానవుని యజ్ఞపశువును చేయడం వేదకాలంతో నిలిచిపోలేదు. మధ్య యుగంలో ఇది కొనసాగింది. ఆధునికయుగంలో సయితం అప్పుడప్పుడు– అక్కడక్కడ – చాటుమాటుగా కొనసాగుతున్నది. విష్ణుకుండినుల వంశానికి చెందిన విక్రమేంద్రవర్మ క్రీస్తుశకం ఆరవశతాబ్దిలో చెక్కించుకొన్న ఒక శిలాశాసనంలో తాను పురుషమేధం జరిపించినట్టు సగర్వంగా చెప్పుకొన్నాడు. ఈ విషయమై మీకు సందేహంవుంటే కుందుర్తి ఈశ్వరదత్తు కూర్చిన "శాసన శబ్దమంజరి"లోని 193వ పుటను ఒకసారి చూడండి. నిజానికి పధ్నాలుగు శతాబ్దాలు వెనకకు వెళ్ళనక్కర లేదు. ఆధ్యాత్మిక సంపద అపారంగావున్న ఈ పవిత్రభూమిలో గుప్తనిధులకోసం, పుత్ర సంతానం కోసం, శత్రునాశంకోసం, అలౌకికశక్తులకోసం ఈనాటికీ నరబలిని చేసేవారు చేయడం లేదా? అన్నట్టు బ్రిటీష్ వారు జోక్యం కలిగించుకొని, దాన్ని నిలిపివేయించిన తర్వాతనే ఆదివాసులలో నరబలి నిలిచిపోయింది. ఒక యువకుని బలిపెట్టకపోతే, పంటలు సరిగా పండవన్న నమ్మకం వారిలో వుండేది. ఆ యువకుడు బ్రాహ్మణుడైతే, పంటలు

సమృద్ధిగా పండగలవని కూడా వారు నమ్మేవారు. “విధిగా ఒక మనిషినే నరక నక్కరలేదు; కోడినో, గొర్రెనో నరికితే సరిపోతుంది” అని వారికి నచ్చచెప్పడానికి బ్రిటీష్‌వారు చాలా శ్రమపడవలసి వచ్చింది!

తిరిగి వెనకకు వెళ్ళి, మనం వేసుకొనవలసిన ప్రశ్నలు కొన్ని వున్నాయి. నారదుని హితవచనం ప్రకారం హరిశ్చంద్రుడు చేసింది బుద్ధిహీనమైన పని కాదా? నూర్గురు భార్యలున్న వాడు, ఒక్కొక్క భార్యకు కనీసం ఒక బిడ్డ చొప్పున, నూర్గురు బిడ్డలను కోరుకొనవచ్చుగదా? తనబోటి చక్రవర్తికి నూర్గురు బిడ్డలను పోషించడం భారం కాదుగదా? నూర్గురు కాకపోతే, యాభైమందిని, పాతికమందిని, కనీసం పదిమందిని కోరుకొన వచ్చు గదా? అప్పుడు వారిలో ఒక పుత్రుని బలియిచ్చినా (అదెంతటి అమానుష కృత్యమైనా) తక్కిన బిడ్డలు మిగిలేవారు కాదా? పుట్టిన వెంటనే బలిపెట్టగలనన్న వాగ్దానంతో ఒకే ఒక పుత్రుని ఎందుకు కోరుకోవాలి? తాను నపుంసకుడను కానని నిరూపించుకొనడానికా? లేక పున్నామనరకాన్ని తప్పించుకొనడానికా? పుట్టిన వెంటనే వాడిని బలిపెట్టినా, ఒక కొడుకు పుడితే పున్నామనరకం తప్పగలదని ఏ శాస్త్రంలోనైనా వ్రాసి పెట్టివున్నదా? లేక నారదుడు ఆ తప్పుడు మాటను తన చెవిలో ఊదినాడా? పురాణాలకథనం ప్రకారం నారదుడు బ్రహ్మ తొడనుంచి పుట్టినవాడు. అతడిది ఇంత వక్రమైన జన్మ అయినందువల్లనే కావచ్చు, అతడు ఏమి చెప్పినా, ఏది చేసినా అది వక్రంగానే వుంటుంది. కలహాలను పెట్టడంలో, వాటిని పెంచడంలో అతడికి అతడే సాటి. అందువల్లనే అతడి బిరుదనామం “కలహభోజను”డని. తాము అల్లుతున్న కథ ఎక్కడ కాస్త చిక్కుపడినా, దాన్ని విప్పడానికి పురాణకర్తలకు నారదుడు ఎంతగానో వినియోగ పడతాడు. పైగా ఏ వాహనం లేకుండానే ముల్లోకాలంలో సంచరించగల దిట్టకాబట్టి పురాణాల రచయితలు “ఓ” అంటే, మరుక్షణంలోనే “కో” అంటూ నారదుడు వారిముందుకు వచ్చి నిలబడతాడు!

ఏమైనా, నేను హర్షించేది, గౌరవించేది ఐతరేయ బ్రాహ్మణంలోని హరిశ్చంద్రుడినే! లేకలేక కలిగిన కొడుకును చేతులారా ఏ తండ్రి బలియివ్వగలడు? మాట తప్పినందుకు తనకు నరకం తప్పకపోయినా కుమారుని బలిపెట్టడానికి నిరాకరించేవాడే నిజమైన తండ్రి. అట్టి తండ్రి వలెనే ఐతరేయ బ్రాహ్మణంలోని హరిశ్చంద్రుడు సంచరించాడు. వరుణుడు ఎన్నిసార్లు వచ్చి, “నీ వాగ్దానాన్ని పరిపాలించ వేమి?” అని నిగ్గదీసినా, “ఇదుగో! అదుగో,” అని వాయిదాలు వేస్తూపోయాడు. ఒక్కొక్క సారికి ఒక్కొక్క కొత్తసాకును వెతుకుతూ పోయాడు. కోపగించిన వరుణుడు తనకు జలోదర వ్యాధిని కలిగించిగ, ఆ బాధను సహించాడు. అంతే తప్ప, రాజభటులను పంపి, లేదా సైనిక దళాలను పంపి, కుమారుని పట్టించడానికి ప్రయత్నించలేదు. తన కుమారుడు నాలుగు కాలాలపాటు బ్రతికితే జలోదర

రూపంలో తాను నరకయాతన అనుభవించడానికి సన్నద్ధపడ్డాడు. ఇంతేకాదు, అనృత దోషానికి నరకానికి వెళ్ళవలసివచ్చినా, అందుకు వెనుదీసేవాడు కాదు.

ఈ హరిశ్చంద్రుని విషయంలో నేను మెచ్చలేని విషయం ఒక్కటే. అది – తన పుత్రునికి బదులుగా శునశ్శేపుని బలిపెట్టడానికి సమ్మతించడం. ఈ ప్రతిపాదన తనది కాకపోవచ్చు. దీన్ని చేసినవాడు రోహితుడు కావచ్చు. అయినా, శునశ్శేపునికైనా తన ప్రాణాలపై తనకు తీపి వుండదా? అతడి తండ్రి దారిద్ర్యాన్ని, అతడి తండ్రి కర్కశహృదయాన్ని అవకాశంగా తీసుకొని, శునశ్శేపుని యజ్ఞపశువును చేయడానికి హరిశ్చంద్రుడు సమ్మతించి వుండవలసింది కాదు. ఇందకు మారుగా జలోదరంతో చనిపోవడానికి, నరకానికి వెళ్ళడానికి సన్నద్ధపడితే, అతడు తన మానవతను, తన మహనీయతను మరింతగా నిరూపించుకొనగలిగేవాడు. హరిశ్చంద్రుడు కానివ్వండి, మరొకడు కానివ్వండి. అసత్యదోషం, నరహత్యదోషం – ఈ రెండింటిలో ఒకదాన్ని కోరుకొనవలసివస్తే, నిస్సందేహంగా మొదటి దోషాన్నే కోరుకుతీరాలి.

ఐతరేయ బ్రాహ్మణంలోని హరిశ్చంద్రుని ప్రవర్తనకు పూర్తిగా భిన్నమైనట్టిది మార్కండేయ పురాణంలోని, ఇతర పురాణాలలోని హరిశ్చంద్రుని ప్రవర్తన. ఈయనకు కావలసింది తనకు ముక్తి, తనకు మోక్షం, తనకు స్వర్గం, తనకు శాంతి, తనకు సౌఖ్యం. పైగా, ఈయనలో సత్యంపట్ల, భక్తికంటె శాపంపట్ల భయం హెచ్చు. విశ్వామిత్రుడు అన్యాయంగా, అధర్మంగా వ్యవహరిస్తున్నాడని ఈయనకు తెలుసు, క్రూరంగా, కర్కశంగా సంచరిస్తున్నాడని ఈయనకు తెలుసు. అయినా, విశ్వామిత్రుడు ఏమి కోరినా "చిత్తం, స్వామీ'' అంటాడే తప్ప, ఎదురు చెప్పడు. విశ్వామిత్రుని చూస్తేనే ఈయనకు వణుకుపుడుతుంది, ముచ్చెమటలు పోస్తాయి, నోటమాట పెగలడమైనా కష్టమైపోతుంది. పిరికితనానికి ఈయనకు పెట్టింది పేరు. "నా నొసటి వ్రాత" అని విలపించడం మాత్రమే ఈయనకు చేతనైన తెలిసిన విద్య. పురాణాల ద్వారా "బ్రెయిన్ వాషింగ్" జరగనివారికి ఈయన సత్యవ్రతుడుగా కాక, శాపభయస్థునివలె గోచరిస్తాడు. నాది హేతువాదం, భౌతిక దృష్టి, నాస్తికమతం. ఈ కారణాన ఆస్తికులైనవారు నా తీర్పును త్రోసిపుచ్చవచ్చు. కాని, సంస్కృత భాషలో, వాఙ్మయంలో మహాపండితుడైన 'మోరిట్స్ ఎంటర్ నిట్స్' తీర్పుని సయితం త్రోసిపుచ్చడం సమంజసం కాగలదా? నే నిప్పుడు చెబుతున్న తీర్పు కొన్ని శతాబ్దాల క్రితం ఆయన చెప్పినట్టిదే.

నా నాటకంలో నేను మరొక అడుగు ముందుకు వేసి, విశ్వామిత్రుడైనా, వసిష్ఠుడైనా, పురోహితవర్గానికి చెందిన వారెవరైనా, తరతరాలుగా – యుగయుగాలుగా – రాజులను తమ గుప్పిటిలో పెట్టుకొని, ప్రజలను దోచుకు తింటున్నట్టివారని చెప్పడానికి

ప్రయత్నించాను. దీని ప్రచురణ ఇప్పుడు జరుగుతున్నా, ఈ నాటకరచన 1965 ప్రాంతంలో జరిగింది. అప్పటిలో ఒకసారి దీన్ని నా మిత్రుడు బందా కనకలింగేశ్వరరావుకు చదివి వినిపించాను. హరిశ్చంద్ర నాటకంలో నాయక పాత్రను ఆయన కొన్ని వందలసార్లు ధరించి వుండాలి. ఆయనకు విశేషఖ్యాతి తెచ్చిన పాత్రలలో అదొకటి. అందువల్ల నా నాటకంలోని హరిశ్చంద్రపాత్ర ఆయనకు ఎంతమాత్రం మనస్కరించక పోవచ్చునని నేను అనుమానించాను. కాని, దాన్ని ఆయన మెచ్చుకొన్నాడు. ఆయన నటుడు మాత్రమే కాదు, న్యాయవాదికూడా. నా నాటకంలో హరిశ్చంద్రునికి యమధర్మరాజు వేసిన ప్రశ్నలు అతి సమంజసమైనవిగా ఆయన భావించాడు. అయితే, ఒక మార్పును ఆయన సూచించాడు. తన కపటనటనకు వసిష్ఠుడు పశ్చాత్తాపపడి, హరిశ్చంద్రుని క్షమాపణ కోరినట్టుగా చివరిలో కొన్ని మాటలను కలపడమే ఆయన సూచించిన మార్పు. పురోహితవర్గంలో మార్పురాదు! రాబోదు. ఏ మాత్రం మారినా, ఆ వర్గం ఆధిక్యత పోతుంది. అధికారం పోతుంది, ఆదాయం పోతుంది. ఆ వర్గాన్ని గురించి తండ్రికున్న భ్రమలు తొలగితే, కొడుకు భ్రమలలో చిక్కుకొనడం సర్వసాధారణంగా జరుగుతోంది. అందువల్లనే పురోహితవర్గం ప్రాబల్యం ఈనాటికీ తగ్గలేదు. నిజానికి ఈ వర్గం ప్రాబల్యం ఈమధ్య మరింత పెరుగుతున్నది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొన్నందునే నా మిత్రుడు సూచించిన మార్పుకు నేను సమ్మతించలేదు.

ఇప్పుడిక రాజర్షి హరిశ్చంద్రుని గురించి క్లుప్తంగా ప్రస్తావిస్తాను. ఈయన ప్రసక్తి మన తెలుగు నాటకాలలో (నేను చూచిన వాటిలో) రాలేదు. అయితే, మార్కండేయ పురాణం సమేతంగా పెక్కింటిలో ఇది వున్నది. శ్మశానవాటికలో హరిశ్చంద్రుడు తన భార్య తలను నరకడానికై కత్తియెత్తినంతనే యమధర్మరాజు సమేతంగా ఆకాశంనుంచి ఊడిపడిన దేవేంద్రుడు, కోసలచక్రవర్తి సత్యసంధతను మెచ్చుకొని, ఆయనను స్వర్గానికి ఆహ్వానిస్తాడు. అంతట "నా ప్రజలందరు నా వెంట రానిదే నేను స్వర్గానికి రాలేను" అని హరిశ్చంద్రుడు స్పష్టం చేస్తాడు (కేవలం తన ముక్తికే, తన మోక్షాన్నే హరిశ్చంద్రుడు కాంక్షించినా డన్న విమర్శకు విరుగుడుగా పురాణకర్తలు అతి తెలివిగా ఇక్కడ ఈ మాటలు దూర్చారు!) ముందు ఏవో కొన్ని అభ్యంతరాలను చెప్పినా చివరికి దేవేంద్రుడు హరిశ్చంద్రుని కోర్కెకు సమ్మతించి, కోసలరాజ్య ప్రజలందరిని కోటి రథాలలో ఎక్కించుకు వెడతాడు. కుమారునికి పట్టాభిషేకం చేసి హరిశ్చంద్రుడు సయితం దేవలోకానికి చేరతాడు. అయితే, మెదడన్న పదార్థం ఏమాత్రం వున్నవానికైనా ఇక్కడ ఒక చిన్న సందేహం కలగాలి. కోసల ప్రజలందరు స్వర్గానికి వేంచేసిన తర్వాత హరిశ్చంద్రుని కుమారుడు ఎవరిని పరిపాలించాడు? చెట్లను, చేమలనా? లేక పక్షులను, జంతువులనా?

పురాణాల విషయంలో ఏదీ వింత కాదు, విపరీతం కాదు, విడ్డూరం కాదు. అయినా, మరొక విషయాన్ని చిత్తగించండి. కావాలని నారదుడు ఉబ్బవేయగా, హరిశ్చంద్రుడు ఒక ఘట్టంలో తాను రాజర్షినని గర్వపడతాడు. ఇందుకు కినిసి ఆయన ప్రజలందరితోపాటు ఆయనను కూడా స్వర్గంనుంచి దేవేంద్రుడు కిందికి తోసిపారవేస్తాడు. వారు కిందికి పడుతుండగా హరిశ్చంద్రుడు తన తప్పిదాన్ని మన్నించవలసిందిగా దేవేంద్రుని వేడుకొంటాడు. అంతటితో దేవేంద్రుని కోపం చల్లారినా, తిరిగి వారికి స్వర్గంలో ప్రవేశాన్ని కల్పించడు. "హరిశ్చంద్రనగరం" అనే పేరుతో రోదసిలో ఒక నగరాన్ని సృష్టించి, అక్కడ నివసించవలసిందిగా ఆదేశిస్తాడు. అందువల్ల తండ్రి త్రిశంకునివలె కుమారుడు హరిశ్చంద్రుడు సయితం అటు స్వర్గంలోకాక, ఇటు భూతలంపై కాక, శూన్యంలో కాలక్షేపం చేస్తున్నాడు. నావంటి నాస్తికునికి ఎంత వెతికినా కనబడదుగాని, ఆస్తికులకు త్రిశంకు స్వర్గంవలె హరిశ్చంద్రనగరం కూడా స్పష్టంగా కనబడుతోనే వుంటుంది. నా బోటివారివి చర్మనేత్రాలు కాగా, వారివేమో జ్ఞానచక్షువులు!

ఈ హరిశ్చంద్రగాథలను ఇంత దీర్ఘంగా నేను చర్చించడం హరిశ్చంద్రుడు చారిత్రకవ్యక్తి అనే నమ్మకంతో కాదు, ఈ గాథలలో పరస్పర వైరుధ్యాలు ఎన్ని – ఏ మేరకు కలవో చూపించడంకోసమే. ఒకే పాత్రకు విభిన్న నామాలవరకు ఈ వైరుధ్యాలు వెళ్ళాయి. ఐతరేయ బ్రాహ్మణంలో హరిశ్చంద్రుని కుమారుని పేరు రోహితుడు, పురాణాలలో ఆతడి పేరు రోహితాస్యుడు, సంస్కృత నిఘంటువులలో రోహితాశ్వుడు, తెలుగుకావ్యాలలో, నాటకాలలో లోహితాస్యుడు. ఇంతకు మించిన వైరుధ్యాలు హరిశ్చంద్రుని భార్య పేరులో వున్నాయి. ఆయన నూర్గురు భార్యలలో ఒకరి పేరునైనా ఐతరేయ బ్రాహ్మణం చెప్పలేదు. పోతే, మార్కండేయ పురాణంలో ఆయన భార్య శైబ్య, శివపురాణంలో ఆమె పేరు సత్యవతి, మహాభారతంలో ఆమె పేరు ఔశీనరి. గౌరన ద్విపద కావ్యంలో, తెలుగు నాటకాలలో ఆమె పేరు చంద్రమతి. ఈ ప్రబుద్ధులు హరిశ్చంద్రుని పేరును కూడా ఈ విధంగా మార్చివుంటే, మరింత సొగసుగా వుండేది. తండ్రిపేరును మార్చకపోయినా, కుమారుని పేరుతో పాటు వయసును కూడా మార్చారు. ఐతరేయ బ్రాహ్మణం ప్రకారం నరమేధ ప్రయత్నం నాటికి అతడి వయసు ఇరవై సంవత్సరాలు దాటి వుండాలి. పురాణాలలో మాత్రం అతడిని బాలుడిగా పేర్కొంటారు. మన తెలుగునాటకాలలో కూడా అతడు బాలాకుమారుడే!

దీని తాత్పర్యం – సత్యహరిశ్చంద్రునిలో సత్యం లేనట్లే, సత్య హరిశ్చంద్రుని గాథలో సయితం సత్యం లేదని కాదా?

# V

# ముని మ్రుచ్చులు

మొట్టమొదటిసారిగా "మునిమ్రుచ్చులు" అనే మాటను వాడిన వారెవరు? "మనుచరిత్ర"లో అల్లసాని పెద్దన కావచ్చునా? ఏమో, నాకు తెలియదు. ఎవరు ముమ్మందుగా దాన్ని వాడినా, అది టంకంలా అతికే మాట, అక్షరాలా నిజమైన మాట. "మ్రుచ్చు" లేదా "ముచ్చు", అనే పదానికి నిఘంటువులు చెబుతున్న అర్థం "దొంగ" అని. మునులన్నవారు – ముఖ్యంగా పురాణాలలోని మునులు – దొంగలకంటె నికృష్టమైనవారు. దొంగలు మీ వస్తువులనే దొంగలిస్తారు, మునులు మీ ఆస్తిపాస్తులతో పాటు మీ వ్యక్తిత్వాన్ని దొంగలిస్తారు. మీ ఆలోచనాశక్తితో పాటు మీ ఆత్మగౌరవాన్ని హరిస్తారు. మీ స్వాతంత్ర్యాభిలాషతోపాటు మీ సమస్తాన్ని హరిస్తారు. ఇవే మాటలను కొంచెం మోటుగా చెప్పాలంటే ముని మ్రుచ్చులు మిమ్ములను చచ్చుదద్దమ్మలుగా మార్చివేస్తారు.

మౌనం వహించేవారు మునులు కాగా, తపస్సుచేసేవారు తాపసులు. వీరిద్దరికి పెద్దన్నయ్యలు ఋషులు. "చిన్నరెడ్డి", "పెద్దరెడ్డి" అన్నట్టు, "చిన్నకమ్మ", "పెద్దకమ్మ" అన్నట్టు ఋషులలో చిన్న పెద్ద తారతమ్యాలున్నాయి. వీరిలో కొందరు శృతర్షులు, కొందరు కాండర్షులు, కొందరు పరమర్షులు, కొందరు రాజర్షులు, కొందరు దేవర్షులు, కొందరు మహర్షులు కాగా, వీరిలో అత్యున్నతస్థానాన్ని అధిష్ఠించినవారు బ్రహ్మర్షులు. వీరి ప్రతిపత్తినిబట్టి వీరి పంతాలు, వీరి పట్టుదలలు, వీరి ప్రగల్భాలు, వీరి పటాటోపం, వీరి ప్రతీకారవాంఛలు పెరుగుతూపోతాయి. ఇదే ప్రకారం, వీరి స్థాయినిబట్టి వీరిలోని స్వార్థం, సంకుచితత్వం, నైచ్యం, నీతిమాలినతనం, క్రోధం, క్రౌర్యం, కపటం మొదలైన సకల దుర్లక్షణాలు పెరుగుతూ పోతాయి. పురాణాలలో మనకు తరచు తారసిల్లే ఋషులు వసిష్టుడు, విశ్వామిత్రుడు, పరాశరుడు, వేదవ్యాసుడు, భృగుడు, గౌతముడు, జమదగ్ని, భరద్వాజుడు, నారదుడు, దుర్వాసుడు. ఇట్టివారు మరికొందరున్నా, వారందరినీ ఇక్కడ పేర్కొనన నక్కరలేదు. కాగా, ఇక్కడ చెప్పవలసింది ఇవి వ్యక్తుల నామాలు కావని, వీటిలో అనేకం వంశాల నామాలని. ఋషులన్నవారిలో ఒక అమ్మకు, ఒక అబ్బకు పుట్టినవారు బహుతక్కువ. ఇంతే కాదు. నవమాసాల తర్వాత ప్రకృతిసిద్ధంగా జన్మించినవారు మరింత తక్కువ. వీరి ఘనతకు ప్రధానకారణం ఇదే కావచ్చు. అయినా, వీరు తమ వంశాలకు మూలపురుషులని కొందరు సగర్వంగా ఎందుకు చెప్పుకొంటారో నాకు అర్థంకాని విషయం.

ఏమైనా, ఇక్కడ నేను వివరించగోరుతున్న విషయం – వసిష్ఠ – విశ్వామిత్రాది నామాలు వ్యక్తులను కాక, వంశాలను – పురోహిత వంశాలను – సూచిస్తాయని. కాకపోతే ఋగ్వేదకాలం నాటి వసిష్ఠ, విశ్వామిత్రులు రామాయణ కాలంవరకు జీవించారని అనుకోవలసి వస్తుంది. అన్నట్టు ఋగ్వేదంలోని ఋక్కులను వ్రాసిన ఋషులు కోరుకొన్న పూర్ణాయుర్దాయం నూరు సంవత్సరాలు మాత్రమే. సంవత్సరానికి వీరు వాడిన పదం "హేమంతం". దీన్నిబట్టి వీరు ఏదో ఒక హిమాచ్ఛాదిత ప్రాంతంనుంచి సప్తసింధు ప్రాంతానికి వలసవచ్చినట్టివారని తీర్మానించుకోవాలి. మహాపండితులలో కొందరు సరిగా ఇదే తీర్మానానికి వచ్చారు.

వ్యక్తులు వేరైనా, ఒకే వంశానికి లేదా ఒకే గోత్రానికి చెందిన ఋషులు ఒకే విధమైన పాడు బుద్ధులను చూపడం కద్దు. ఋగ్వేదకాలంలో వసిష్ఠ విశ్వామిత్ర వంశాలమధ్య ప్రారంభమైన కలహం రామాయణ కాలంవరకు సమసిపోలేదు; అటు తర్వాత కూడా ఆ చిచ్చు ఆరివుండకపోవచ్చు.

మన హరిశ్చంద్ర నాటకంలో ఆ సంగతిని విడిచి పెడతారుగాని, తన కొడుకులను చంపినాడని, తనకు రాజపోషకుడైన హరిశ్చంద్రుని నోట అబద్ధం చెప్పించడంకోసం అతడిని నానాహింసలు పెట్టినాడని విశ్వామిత్రునిపై విద్వేషంతో "నీవు బకరిగా మారిపో!" అని వసిష్ఠుడు శాపం పెడతాడు. అయితే 'నీవు ఆడేలుగా మారిపో!' అని విశ్వామిత్రుడు వెను వెంటనే ప్రతిశాపం పెడతాడు. నా వద్దగల నిఘంటువులను చూడగా, ఇవి ఏ యే పక్షులన్న సంగతి స్పష్టంగా తెలియలేదు. నాకేకాదు, మార్కండేయ పురాణాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన ఎస్.ఇ. పార్జితర్‌కు కూడా ఇది అస్పష్ట విషయంగానే మిగిలింది. పార్జితర్‌కంటె ముందుగా విష్ణుపురాణాన్ని ఆంగ్లీకరించిన హెచ్.హెచ్. విల్సన్ సయితం ఇక్కడ తికమకపడ్డాడు. ఇవి కొంగలలో రెండు జాతులైనా కావచ్చు. ఒకటి కొంగ, మరొకటి బాతు కావచ్చు. అవి ఏవైనా, ఈ రెండు పక్షులు ఎడతెగకుండా కొన్ని వేల సంవత్సరాలపాటు (పురాణాలలో కాలప్రమాణాలు సర్వసాధారణంలో త్రుటిలోపల తృటిలో, లేదా సహస్రాబ్దాలలో వుంటాయి) హోరాహోరీగా పోరాటాన్ని సాగించగా, సమస్త విశ్వం సంచలించిపోతుంది. అంతట సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడే జోక్యం కల్పించుకొని, ఆ పోరు నిలిపించి, వసిష్ట విశ్వామిత్రుల వారి పూర్వరూపాలను ప్రసాదిస్తాడు. అయితే, ఆయన కైనా వారి రూపాలనే తప్ప, వారి నైజాలను మార్చడం సాధ్యపడివుండదు!

ఇంతకే కాదు, ఎంతకైనా తగినవారే ఋషులంటే! బిడ్డా పాపా లేని వారెవరైనా "అయ్యా! మమ్ము కరుణించండి", అని వేడుకొన్నంతనే వారు తమ "యినుపకచ్చడాల్" విప్పివేసేవారు. వశిష్ఠుడు ఆ పని చేశాడు; వ్యాసుడు ఆ పని చేశాడు; ఇతర ఋషులు ఆ

పని చేశారు. తమ నుంచి సంతానభిక్ష కోరకపోయినా, కామాంధులై కచ్చడాలను విప్పిన ఋషుల లెక్కను తేల్చడం అంత తేలిక పనికాదు. ఇట్టివారిలో విశ్వామిత్రుడున్నాడు, పరాశరుడున్నాడు, దధీచి వున్నాడు. పోతే, ఏ దేవవేశ్యనో చూచినంతనే వీర్యస్ఖలనం జరిగిన ఋషిపుంగవుల సంఖ్య పదులతో ఆగదు, వందలను దాటిపోతుంది.

కాగా, మానభంగాలకు సయితం ఈ ఋషివృషభాలలో కొందరు వెనుదీయలేదు, వావి వరసలతో వీరికి పనిలేదు; తాము కామిస్తున్న పరదార నిండుచూలాలన్న జాలి సయితం వీరికి కలగదు. అన్నభార్య మమతతో ఇంత పాశవికంగానూ బృహస్పతి ప్రవర్తించాడు. ఆమె గర్భంలోని శిశువు "ఇది నీకు తగునా?" అన్నందుకు కోపగించి, "నీవు గుడ్డివాడవు కమ్ము!" అని శపించాడు. వాడెంతటి పశుప్రాయుడైనా, దేవతల గురువు కాబట్టి, బృహస్పతి శాపం తగలనే తగిలింది. మమత కుమారుడు పుట్టు గుడ్డిగానే పుట్టాడు. అందుకే అతని పేరు దీర్ఘతముడు.

ఋషిపత్నులలో కొందరు తమ భర్తలకంటె రెండాకులు ఎక్కువ చదివినవారే. ఉదాహరణకు బృహస్పతినే తీసుకోండి. అతడు అన్న పెండ్లాన్ని చెరచగా అతడి భార్య (ఆమె పేరు – తార) చంద్రుడిని తగులుకొంటుంది! పోతే, అహల్య వుండనే వున్నది. ఈ నారీరత్నం ఇంద్రునితో రమించి, "నా జన్మ తరించింది. మా ముసలితొక్కు తిరిగి వచ్చేవేళ సమీపిస్తున్నది; మరి త్వరగా వెళ్ళిపోండి!" అని హెచ్చరిస్తుంది.

తామెంతటి పశుప్రాయులైనా, తాము ఋషులై నందున తాము శాపం పెడితే దానికి తిరుగులేదన్న మూఢవిశ్వాసాన్ని పురాణాలద్వారా పురోహితులమూక, పూజారులగుంపు బహుళ ప్రచారం చేసింది. ఈ ఋషులన్నవారిలో కొందరైనా చారిత్రక వ్యక్తులైతే వీరిని పోల్చవలసింది ఈనాటి రజనీష్, మహేష్‌యోగి, సత్య సాయిబాబా, ధీరేంద్ర బ్రహ్మచారి వగైరా వగైరాలతో. వీరివలె వారుకూడా ప్రచారపద్ధతులలో మహా ప్రజ్ఞా నిధులు. ఆదిలో సూతుల రచనలైన పురాణాలను – కేవలం శూద్రుల కోసం, స్త్రీలకోసం ఉద్దేశించిన పురాణాలను – కాలక్రమాన వీరు సొంతం చేసుకొన్నారు. ఇందుకు బలమైన కొన్ని కారణాలున్నాయి. వాటిలో మొదటిది – గౌతముబుద్ధుని నమ్ముకొంటే, ఆయనే మనకు రక్షకాగలడన్న మౌఢ్యాన్ని మహాయాన బౌద్ధం ప్రచారం చేసింది. అందుమూలంగా మహాయానం ప్రజాదరణ విశేషంగా పొందినంతనే యజ్ఞయాగాదులు పూర్తిగా తగ్గిపోయి, వాటిద్వారా పురోహితుల రాబడి తగ్గిపోయింది. అంతట పురోహితులమూకలో ఒక భాగం రామావతారం, కృష్ణావతారం మొదలైన వాటిని సృష్టించి, గుడులు కట్టి, గోపురాలు కట్టి, పూజాపురస్కారాలు దీపధూపనైవేద్యాలు, పవ్వళింపు సేవలు మున్నగు వాటిని మొదలుపెట్టి, కొత్త కొత్త రీతులలో ప్రజలను దోచుకుతినడం మొదలు

పెట్టింది. చాలా కాలంవరకు వైదిక మతావలంబులు ఈ మార్పును ఈసడించు కొన్నారు. దేవాలయాలలోని పూజారులు కసాయివారికంటె అధములని మనుధర్మ శాస్త్రం వ్రాసింది. ప్రాచీనకాలానికి చెందిన మనుధర్మశాస్త్రంలోనే కాదు, క్రీస్తుశకం పన్నెండవ శతాబ్దికి చెందిన రాజతరంగిణిలో కూడా పూజారుల నింద వున్నది. ఒక వైపున వేదాలపట్ల, మరొక వైపున దేవాలయాలపట్ల సమానంగా భక్తి శ్రద్ధలు తమకున్నట్టు చెప్పుకొనేవారికి ఈ విషయాలు తెలియక పోవచ్చు.

పూజాపురస్కారాలు, దీప ధూపనైవేద్యాలు మొదలైనవాటిని ప్రారంభించకపోతే, తమకు భుక్తి గడవదని నమ్మినంతనే సూతులను మెడపట్టి గెంటివేసి, భూసురోత్తములే పురాణకర్త లైనారు. అప్పటికే చాలాకాలంగా ప్రచారంలోగల కాకమ్మకథలలో వారు మార్పులు చేర్పులు చాలా నేర్పుగా సాగించారు. తమ వర్ణాధిక్యతను, వర్గప్రాబల్యాన్ని పరిరక్షించుకొనడానికి ఎన్నెన్నో ఫోర్జరీలు చేశారు. ఈ విద్యలో వీరికి వీరేసాటి. అతుకు కనబడకుండా పాతగుడ్డకు వీరు కొత్తగుడ్డను కుట్టగలరు. ఎట్టి గట్టి మరకలనైనా ఇట్టే చెరపివేయగలరు; చెడ్డ చెమట కంపునైనా కప్పిపుచ్చగలరు. ఈ ఫోర్జరీ వ్యవహారం ఈనాటికీ కొనసాగుతున్నది. అందువల్లనే కొత్త రామాయణాలు, కొత్త భారతాలు, కొత్త పురాణాలు. కొన్నేళ్ళ క్రితం జాతీయ జ్ఞానపీఠంవారు ఒక తెలుగు రామాయణానికి, ఒక కన్నడ రామాయణానికి బహుమానా లిచ్చారు. ఈ రెండు రచనలు ఫోర్జరీలుగా పేర్కొనదగినవే. సంస్కృతమూలంలోని అనేక విషయాలను వీటి రచయితలు వదిలివేశారు. లేదా వాటికి కొత్త ముస్తాబు చేశారు. ఈ సందర్భంలో ఫోర్జరీ అనే పదాన్ని ఇన్నిసార్లు వాడినందుకు నాపై విరుచుకు పడగలవారికి తెలియక పోవచ్చుగాని, ఈ పదాన్ని నాకంటె చాలా ముందుగా సంస్కృత భాషాపాండిత్యంలో, భారతీయ వాఙ్మయచరిత్రలో సుప్రసిద్ధుడైన మారిన్ వింటర్‌నిట్స్ వాడాడు.

పురాణాలను ఇదివరలో వ్రాసినవారికిగానీ, ఇప్పుడు వ్రాస్తూన్నవారికి గానీ జంకు లేదు, కొంకు లేదు. ఇంతే కాదు, బొంకు, రంకు అనే మాటలను వీరు వినలేదేమో అనిపిస్తుంది. ఒకవేళ విన్నా, వాటిపట్ల వీరికి రోత లేదని అనిపిస్తుంది, అవసరమైతే తమ పరమపవిత్ర గ్రంథాలను సయితం తలక్రిందులు చేసి వీరు వ్రాసివేస్తారు. ఋగ్వేదం ప్రకారం ఊర్వశితో పురూరవుడు కాపురం చేసింది నాలుగేళ్ళు మాత్రమే. అయినా, వీరిద్దరు 61,000 సంవత్సరాలు సంసారం చేసినట్టు విష్ణుపురాణంలో వ్రాశారు! ఇంతటితోనైనా వీరు ఆగలేదు. తమ పాత పురాణాలలోని సంగతులను కొత్త పురాణాలలో చిత్తం వచ్చినట్టు – చేతికి వచ్చినట్లు – మార్చి వేశారు. భాగవతపురాణం ప్రకారం మొత్తం నరకాలసంఖ్య కొన్ని వందలను, లేదా కొన్ని వేలను దాటి వెళ్ళలేదు. గరుడపురాణం

వీటిని 84,00,000 వరకు ఒక్క కలంగీతతో – కాదు, ఒక్క గంటం గీటుతో – పెంచి వేసింది. సిగ్గు బిడియాలు లేకుండా, చీము నెత్తురులైనా లేకుండా బూతులను, బొంకులను వ్రాసిన – వ్రాస్తున్న – పౌరాణిక గ్రంథాలను పవిత్రగ్రంథాలుగా భావించడంకంటె అపవిత్రచర్యను ఏ కొంచెం మెదడున్న వాడైనా ఊహించగలడా? అయితే, ఇక్కడే పురాణాల గడసరితనం వున్నది. అవి మున్ముందుగా దెబ్బతీసేది మెదడుపైనే, అన్యలోకాలని, అలౌకిక శక్తులని, ఆధ్యాత్మిక మహిమలని, శాపాలని, వాటి శ్రాద్ధాలని ఏవేవో పిచ్చి భ్రమలు అవి కలిగిస్తాయి. వెర్రి భయాలను పుట్టిస్తాయి. బహుశా ఏ జాతి పురాణంలోనూ ఒక ఋషి దేవుని కాలెత్తి, తన్నినట్లు వ్రాసిలేదేమో! అది హిందూపురాణాలలో వున్నది. విష్ణుమూర్తి వక్షస్థలంపై భృగుడు ఒక తన్ను తన్నాడట! ఈ ఋషులనుగురించి, వీరి ప్రగల్భాలను గురించి, వీరి ప్రల్లదనాలనుగురించి, వీరి పటాటోపాన్ని గురించి నేను నిరసనగా వ్రాశానని ఈ మధ్యనే ఒక శుంఠ నామీద దుమ్మెత్తిపోశాడు. బహుశా వీడి నమ్మకం తాను ఋషి సంతతివాడినని, బహుశా వీడి విశ్వాసం స్వచ్ఛమైన ఆర్యరక్తం తన రక్తనాళాలలో ప్రవహిస్తున్నదని!

లెక్కలోకి తీసుకొనదగినవాడు కాదు కాబట్టి ఈ శుంఠ ప్రసక్తిని నిజానికి నేను తేవలసింది కాదు కాగా, నా బాధ అత్యుక్తులకు, అసత్యాలకు, అవినీతికి, అన్యాయాలకు, అత్యాచారాలు అడ్డమైన తప్పుడు పనులకు పరాకాష్ఠలుగా చెప్పదగు పురాణాలకారణంగా ఇంచుమించు రెండు వేల సంవత్సరాలనుంచి ఒక దేశంగా, ఒక ప్రజగా, ఒక సంఘంగా మనకు ఎన్నివిధాల – ఎంతగా అపకారం జరుగుతున్నదనే! నాది భౌతికదృష్టి కావచ్చు, నేను నాస్తికుడను కావచ్చు, నేను మానవతావాదిని కావచ్చు. ఈ కారణాల వల్ల నన్ను, నా మానసిక సంక్షోభాన్ని మీరు నిర్లక్ష్యం చేయవచ్చు. కాని, రాజారామమోహన్ రాయ్‌ని నిర్లక్ష్యం చేయగలరా? స్వామి దయానంద సరస్వతిని నిర్లక్ష్యం చేయగలరా? వారు నాస్తికులు కారు, ఆస్తికులే. ఒకవేళ వీరిద్దరిలో రామ్ బ్రహ్మ సమాజీకుడని, దయానంద్ ఆర్య సమాజీకుడని మీరు వారినీ, పురాణాలపట్ల వారి వైముఖ్యాన్నీ అంతగా పట్టించుకొనక పోవచ్చు. అయితే, బాబూ గోవింద్‌దాస్ మాటేమిటి? ఆయన భారతరత్న బాబూ భగవాన్‌దాస్‌కు అన్న కాడా? అస్సాం, మద్రాసు, బొంబాయి రాష్ట్రాలకు గవర్నర్‌గా చేసిన శ్రీశ్రీ ప్రకాశ్‌కు పెదతండ్రి కాడా? హిందూ ధర్మశాస్త్రాలను దార్శనికశాస్త్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసినవాడు కాదా? హిందూమత సంస్కరణకై (అనారోగ్యాన్ని పాటించక) కృషిచేసినవాడు కాదా? తాను వ్రాసిన "హిందూ ఎథిక్స్" అనే గ్రంథంలో ఏయే చెరుపులను, ఎన్నెన్ని చెరుపులను, ఏయే మేరకు పురాణాలు మనకు చేస్తున్నవో ఆయన చెప్పలేదా? నీతికంటె వాటిలో బూతు ఎక్కువని ఆయన చెప్పలేదా? వాటిలోని

దేవుళ్ళను, వాటిలోని ఋషులను ఆరాధ్య దైవాలుగా సంభావిస్తే ఆదర్శ పురుషులుగా సంభావిస్తే, మనజాతి అధోగతిలోనే మిగిలిపోగలదని హెచ్చరించలేదా? అయినా, పురాణాలలోని బొంకులే, వాటిలోని బూతులే ఈనాటికీ మనకు కథలు, కావ్యాలు, నాటకాలు కావా? ఇవే సినిమాలు, ఇవే టెలివిజనులు కావా? తెలతెలవారకముందే రేడియో వీటినే ఓండ్ర పెడుతుంది; సాయం సమయాలలో వీటిపైనే ఈ బొర్ర పొట్టవాడు, లేదా, ఆ పొడుం పట్టువాడు ఊకదంపుడు ప్రసంగాలు చేస్తారు. ఈ దౌర్భాగ్యస్థితినుంచి బయట పడలేకపోతే మనం ఆధునిక యుగంలోకి అడుగు పెట్టగలమా?

ఈనాడు మన ప్రభుత్వచిహ్నాలపై "సత్యమేవ జయతే" అనే సూక్తిని చెక్కుతున్నారు, ముద్రిస్తున్నారు, ఇతర విధాల మనముందు ప్రతినిత్యం దాన్ని పెడుతున్నారు. అయినా, ఈనాటికంటె ఏనాడైనా అసత్యం మన దేశంలో ఎక్కువగా రాజ్యం చేసిందా? ఆ మాటకు వస్తే, ఏ దేశంలోనైనా – ఎక్కడైనా – ఎక్కువగా అది రాజ్యం చేసిందా? ఇందుకొక కారణం – సత్య హరిశ్చంద్రుని పోలిన ఒక భీరుడు, ఒక కపటి, ఒక స్వార్థపరుడు, విలపించడంలో ఒక ఘటికుడు సత్యసంధతకు ప్రతీకగా మనదృష్టిలో చెల్లడమే!

# VI

## నీతి, అవినీతి

ఒక హిరొడెటెస్ మనకులేనట్టే, ఒక అరిస్టాటిల్ కూడా మనకు లేడు. ఆయన ప్రపంచం మొత్తంమీదనే మొట్టమొదటి చరిత్రకారుడుకాగా, ఈయన మొట్టమొదటి నీతిశాస్త్రనిర్మాత. దీని తాత్పర్యం – హిరొడెటెస్ పుట్టకముందు చరిత్ర లేదని కాదు; ఆయన ఘనత పురాణాలనుంచి చరిత్రను వేరుచేయడం; ఈయన వైశిష్ట్యం మతంనుంచి నీతిని విడదీయడం. చరిత్ర అనే ఛద్మవేషం వేసి, పురాణం మానవుని మేధాశక్తిని బలహీన పరుస్తుంది; అతడి హేతుదృష్టిని మందగింపజేస్తుంది. ఆతడిని వాస్తవికతకు దూరంచేసి, వెర్రిమొర్రి లోకాలలో ప్రవేశపెడుతుంది. ఇదే విధంగా – కాదు, ఇంతకంటె దుష్టంగా – మతం వ్యవహరిస్తోంది. విశ్వాసంపేర అది మౌఢ్యానికి ప్రోది చేస్తుంది; ఆచారంపేర దురాచారాలను నెలకొల్పుతుంది;

హిరొడెటెస్‌వలె క్రీస్తుకు పూర్వం అయిదు శతాబ్దాలనాడు కాక పోయినా, కనీసం క్రీస్తు తర్వాత ఏడవ శతాబ్దికి మన దేశంలో ఒక చరిత్రకారుడు (బాణభట్టు) ఉదయించాడు. కాని, ఈనాటికైనా ఒక అరిస్టాటిల్ మనమధ్య తలయెత్తినట్టు చెప్పలేము. సంస్కృత భాష తెలియనివాడిని కాబట్టి ఆ భాషలో పండితులైన నా మిత్రులు కొందరిని "ప్రాచీన కాలంలో,

కనీసం మధ్యయుగంలోనైనా, మతం ఊసు లేకుండా, ఆత్మ, పరమాత్మల ప్రసక్తిలేకుండా, స్వర్గ నరకాలతో నిమిత్తం లేకుండా, మన దేశంలో ఎవరైనా నీతిశాస్త్రం వ్రాశారా?" అని ప్రశ్నించాను. ఇందుకు ఒక్కరు మాత్రం "వ్రాయకేమి? చాలాచాలా వ్రాశారు" అని ప్రత్యుత్తర మిచ్చారు. "అయితే, వాటిలోనుంచి ఒక నీతి సూత్రాన్ని వినిపించండి" అన్నాను. వెంటనే ఆయన ఒక శ్లోకాన్ని చదివి, దాని తాత్పర్యాన్ని కింది విధంగా నాకు చెప్పారు; "ఎప్పుడు భోజనం చేసినా కాళ్ళను, చేతులను మంచినీటితో శుభ్రంగా కడుక్కోవాలి." అటుతర్వాత మడిబట్ట ప్రసక్తి వున్నదో, లేదో ఆయన నాకు చెప్పలేదు. ఏమైనా, ఇది ఆరోగ్యసూత్రం కావచ్చుకాని, నీతి సూత్రం కాగలదా? అటుతర్వాత పనికట్టుకొని భారతీయ నీతి శాస్త్రంపై ఇంగ్లీషులోగల పుస్తకాలను పెక్కింటిని చదివాను. వాటి రచయితలలో కొందరు ముఖ్యులు – గోవింద్ దాస్, సర్ పి.ఎస్.శివస్వామి అయ్యర్, జాన్ మికంజీ, సి.వి. చందవర్కార్, సుశీలకుమార మిత్ర, మనోరమ జౌహరి, సురమదాస్ గుప్త, రోడెరిక్ హింద్రే, రోలెండ్ డబ్లియు, స్కాట్, మగన్‌లాల్ ఎ.బుచ్.అయితే, ఏ పుస్తకాన్ని చదివినా, ఎవరి పుస్తకాన్ని చదివినా, దానిలో మతంనుంచి నీతిని విడగొట్టడానికి జరిగిన ప్రయత్నం స్వల్పం, దాదాపు శూన్యం. వీరిలో డాక్టర్ సురమ స్పష్టంగానే చెప్పింది – హిందూమతంనుంచి హిందూతత్త్వ శాస్త్రాలను వేరుచేయలేమని. మరి కాస్త ముందుకు వెళ్ళి హిందూ మతంనుంచి హిందూ నీతి శాస్త్రాన్ని విడదీయలేమని కూడా ఈమె చెప్పివుండవలసింది. ఈమె "డెవలప్‌మెంట్ ఆఫ్ మోరల్ ఫిలాసఫీ ఇన్ ఇండియా" అనే పేరుతో వ్రాసిన పుస్తకంలో నీతిసూత్రాల చర్చ మొత్తంలో పదిశాతం కాగా మిగిలింది కర్మఫల చర్చ, పూర్వ జన్మవాసనల చర్చ. ఆ వాసనల కారణంగా హిందూసంఘంలో అశేషంగా అసమానతలు ప్రవేశించడం ఎంతో సహజమన్న, న్యాయసమ్మతమన్న చర్చ!

"నీతి" అనే పదానికి నానార్థాలున్నాయి. ప్రాపణము, పాడి, న్యాయము, ఉపాయము, రాజనీతి, సత్ప్రవర్తనము, అశ్వాదులనుగురించి తెలుపు శాస్త్రము – ఇవి దానికున్న భిన్నార్థాలలో కొన్ని మాత్రమే. పోతే, ఒక్క తెలుగు వారు మాత్రం "విధము" "రీతి" అనే ప్రత్యేకార్థంలో కూడా "నీతి" అనే పదాన్ని వాడతారని "సూర్యరాయాంధ్ర నిఘంటువు" వివరిస్తున్నది. నా దృష్టిలో ఈ నిఘంటువు చేసిన ఒక పెద్ద పొరపాటు "నీతికి"కి గల "వినయం" అనే పదాన్ని కూడా ఇది వెలివేసింది. ఇందుకు ఈ నిఘంటుకర్తలకు బౌద్ధంపట్లగల వైముఖ్యమే కారణం కాదుగదా! పంచశీల "వినయపిటకం" బౌద్ధంతో సన్నిహిత సంబంధంవున్న పద బంధాలు మరొక తెలుగు నిఘంటులో "నీతిశాస్త్రం" అనే వాటిని పర్యాయ పదాలుగా "శీలశాస్త్రం" "వినయశాస్త్రం" అనే వాటిని పేర్కొన్నారు. సద్వర్తనకు మనం ప్రస్తుతం "నీతినిజాయితీలు" అనే సమాసాన్ని ఎక్కువగా వాడుతున్నాము.

గుణంలేనివాడిని "నీతి మాలినవాడు"గా నిరసిస్తున్నాము. అందువల్లనే ఆంగ్లేయంలో "ఎథిక్స్" అనే పదానికి ప్రత్యామ్నాయంగా "నీతి" అనేదాన్ని వాడడానికే నేను నిర్ణయించుకొన్నాను.

శుక్ర చాణక్యవిదురాదుల పేర నీతి శాస్త్రాలున్నాయి. అయితే, ప్రధానంగా అవి రాజనీతిశాస్త్రాలు లేదా దండనీతిశాస్త్రాలు. తన రచనలో నీతిని మించి అవినీతి హెచ్చుగా కలదని చాణక్యునికి తెలుసు. అందువల్లనే దాన్ని ఆయన "అర్థశాస్త్ర" మన్నాడు. ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని స్థాపించగోరేవారికి దాన్నిమించిన పాఠ్య గ్రంథం బహుశా మరి దొరకదు.

ప్రాచీనకాలంలోనే మనవారు తర్క, వ్యాకరణ, ధర్మ, మీమాంస, వైద్యశాస్త్రాలను వ్రాశారు. జ్యోతిష, సాముద్రిక, శకున శాస్త్రాలను వ్రాశారు. అర్థకామమోక్షశాస్త్రాలను వ్రాశారు. అశ్వగజ శాస్త్రాలను వ్రాశారు. మరెన్ని శాస్త్రాలనో వ్రాశారు. అయినప్పుడు నీతి (శీల) శాస్త్రాన్ని ఎందుకు వ్రాయలేదు? ఇందుకు ప్రత్యుత్తరాన్ని సులభంగానే చెప్పవచ్చు. మతంనుంచి మానవుని, మానవసంఘాన్ని, మానవ జీవితాన్ని వేరు చేయడం, మనవారికి తెలియదు. అది నరబలుల మతమైనా ఏదో మతాన్ని అనుసరించనివాడు మనవారి దృష్టిలో నరుడేకాదు. అందువల్లనే మహాజుగుప్సాకరమైన "సహజ" మతాన్ని సయితం వారు మత సార్వభౌమత్వం కిందికి తెచ్చారు. అయితే, ఏ మతానికి, లేదా మతశాఖకు ఏ పేరు పెట్టినా, వారిదృష్టిలో మతమంటే కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలే. వారి విశ్వాసం ప్రకారం మతమంటే వర్ణ, కుల, శాఖాది విభేదాలే. అందువల్లనే వారు ఏ శాస్త్రాన్ని వ్రాసినా, పూర్తిగా మత దృక్పథంలోనే వ్రాశారు. అద్వైతం నిజమైతే, ద్వైతం అబద్ధం. ఈశ్వరుడు నిరాకారుడైతే, విగ్రహారాధన మహాపరాధం. బ్రహ్మచర్యంలో మహత్తువుంటే, తంత్ర విద్య గర్హనీయం. అహింస పరమధర్మమైతే, యజ్ఞ యాగాదులు అధర్మాచరణ. అయినా, వీటిలోని పరస్పర వైరుధ్యాలను హిందూమతం గుర్తించదు. "మార్గం ఏదైన గమ్యం ఒక్కటే" అనే సూక్తిని చిలకపలుకువలె అది వల్లిస్తుంది. దానికి కావలసింది ఒక్కటి మాత్రమే. అది – కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలను ఆమోదించడం. కేవలం ఆమోదించడమైనా చాలదు; వాటిని ఔదల దాల్చాలి. అప్పుడు సంఘంలోని అసమానతలకు, అన్యాయాలకు, అఘాతాలకు, అమానుషత్వాలకు బాధ్యత సంఘానిదే కాదు, వ్యక్తిదే. తన అత్యున్నత స్థితివలె తన అధమాధమస్థితికి కూడా బాధ్యత పూర్తిగా వ్యక్తిదే. ఒకడు భూసురుడు కావడం పూర్వజన్మలో తాను చేసుకొన్న పుణ్యంవల్ల. మరొకడు ఛండాలుడు కావడం పూర్వజన్మలో తాను ఒడిగట్టుకొన్న పాపంవల్ల. ఒకడు కుబేరుడు కావడం పూర్వజన్మలో తాను సంపాదించుకొన్న పుణ్యంవల్ల. మరొకడు కటిక దరిద్రుడు కావడం పూర్వజన్మలో తాను మూటగట్టుకొన్న పాపంవల్ల. ఆరోగ్యానికి, రుగ్మతలకు ఇదే మూలం;

ఖ్యాతికి, అపఖ్యాతికి ఇదే రహస్యం. కష్టాలకు, సుఖాలకు ఇదే కీలకం. మతంపేరుతో మానవులను ఎందరెందరో ఎన్నో మోసాలు చేశారుగాని, ఇంతటి సూక్ష్మ బుద్ధితో మోసం చేసినవారు లేరు. ఏదో ఒక ప్రకృతి ధర్మాన్ని (ఉదాహరణకు, గురుత్వాకర్షణ శక్తిని) ఉద్ఘాటిస్తున్న ధోరణిలో మోసంచేసినవారు లేరు. తమ సూత్రాల అమోఘత్వాన్ని నిరూపించడానికి, కొన్ని పురాణాలలో, ఇతర మత గ్రంథాలలో కర్మఫలాన్ని సర్వేశ్వరుడైనా తప్పించుకొనలేడని వారు ఉద్ఘోషించారు.

వ్యక్తికి, అతడి పూర్వజన్మకు, దానిలో అతడి పాపపుణ్యాలకు ఇంత ప్రాధాన్య మిచ్చినవారు సమిష్టి దృక్పథాన్ని ఎలా పెంచుకొనగలరు, సంఘక్షేమాన్ని లక్షించి నీతిశాస్త్రాన్ని ఎలా వ్రాయగలరు? వారు వెళ్ళగలిగింది వ్యక్తికి ముక్తివరకే, అతడికి మోక్షం వరకే, అతడికి స్వర్గ సుఖంవరకే, లేదా నరకంలో యమయాతనల వరకే. అంతటితో ఆగక, మరొక అడుగు ముందుకు వేస్తే అది కులవ్యవస్థ పరిరక్షణవరకే.

వ్యక్తికి, కులానికి, మతానికి, ముక్తిమోక్షాలకు ఇంతగా అగ్రప్రాధాన్య మిచ్చినందువల్లనే హిందువులలో ఒక అరిస్టాటిల్ ఆవిర్భవించలేదు. మత ప్రసక్తిలేకుండా, సంఘదృష్టినుంచి, సమష్టి క్షేమం దృక్పథం నుంచి అతడు ఒక నీతి శాస్త్రాన్ని రూపొందించ లేదు. బౌద్ధ, జైనమతాలు నీతి సూత్రాలకు కొంత అధిక ప్రాధాన్య మిచ్చిన మాట నిజమే. అయితే, అవికూడా ఏదో ఒక రూపంలో కర్మ సిద్ధాంతాన్ని విశ్వసించినవే, జన్మరాహిత్యాన్ని లక్షించినవే.

ఇంతవరకు నేను వ్రాసినదాన్నిబట్టి, హిందూమతంలో, దాని మత గ్రంథాలలో నీతి సూత్రాలకు స్థానం లేనే లేదని భావించరాదు. అక్కడక్కడ – అప్పుడప్పుడు – ఏవో కొన్ని నీతి సూత్రాలను హిందూమత నాయకులు ఏకరువు పెట్టక పోలేదు. పైగా, ఇట్టి సూత్రాలు ఏవో కొన్ని లేకపోతే, వర్ణాశ్రమ బద్ధమైన సాంఘిక జీవితమైనా సాధ్యపడదు. ఇంతే కాదు. చివరికి ఆటవిక సంఘాలలోనైనా "కల్లలాడరాదు" – "దొంగతనం చేయరాదు" "ఇరుగుపొరుగువాని పెండ్లాముతో పొత్తుపెట్టుకోరాదు"– ఇట్టి నీతిసూత్రాలు ఎన్నో కొన్ని వుంటాయి. వీటిని నాగరిక సంఘాలలో కంటె మిన్నగా ఆటవికులే పాటించడం కూడా కద్దు. వారిలో కొందరికి అబద్ధం చెప్పడం చేతనైనా కాదు! ఇంతకుముందు నేను అచ్చుతెనుగులో చెప్పిన నీతిసూత్రాలనే హిందూమతనాయకులు "సత్యం వద" "ధర్మం చర" అని దేవభాషలో చెప్పారు. అంత మాత్రంచేత మనకు ఒక నీతి శాస్త్రం కలదని చెప్పలేము. "ఎథిక్స్"కు సంబంధించిన పాశ్చాత్య శాస్త్రాలను పోలినవి మనకు కూడా రావాలంటే, వాటికి మతంతో, కర్మతో, జన్మపునర్జన్మలతో, స్వర్గనరకాలతో, ముక్తిమోక్షాలతో ఏమీ సంబంధం వుండరాదు. అట్టి నీతిశాస్త్ర నిర్మాణం ఇదివరలో మనదేశంలో జరగలేదు. ఇక ముందైనా ఎంతవరకు జరుగుతుందో అనుమానమే!

మన రాజ్యాంగం మనలో ప్రతి వయోజనుని ఒక వ్యక్తిగా, ఒక పౌరునిగా గుర్తిస్తున్నది. కొన్ని ప్రాథమిక స్వత్వాలను అది మనకు సంక్రమింపజేస్తున్నది. దీనితోపాటు మనపట్ల, మన సంక్షేమంపట్ల ప్రభుత్వానికి కొన్ని ప్రాథమిక బాధ్యతలను నిర్దేశిస్తున్నది. మన రాజ్యాంగం అమలులోకి వచ్చి మూడు దశాబ్దాలు దాటుతున్నాయి. అయినా, శాసనసభలలోనో, న్యాయస్థానాలలోనో, మేధావివర్గాల సదస్సులలోనో తప్ప ఈ విషయాల ప్రసక్తి సయితం ఏమంతగా రావడం లేదు. ఇందుకు మారుగా, మనం నిద్ర లేచింది మొదలు తిరిగి నిద్ర పోయేవరకు – కొందరి విషయంలో నిద్రలోకూడా – వినే మాటలు "నొసట వ్రాసిన వ్రాలును చెరిపేదెవరు?" "కానున్నది కాక మానదు" "కులం తక్కువ వాడే కూటికి ముందు" "కులానికి కులం తెగులు, నీటికి నాచు తెగులు" "కర్మ కంతం లేదు, కాలానికి నిశ్చయంలేదు" "మాలదాన్ని ఎంకటమ్మా! అంటే, మరింత ముందరింట్లోకి వచ్చిందట" – ఇట్టివేకావా? రాజ్యాంగ వ్యవస్థ మారినా మన మతవ్యవస్థ, అంతకంటె ముఖ్యంగా, మన మానసిక వ్యవస్థ ఎంతమాత్రం మారలేదని ఇది సూచించడం లేదా? నిజానికి మన రాజకీయవ్యవస్థ సయితం కేవలం పేరుకే మారింది. ఇప్పుడు శాసనసభ్యులకు ఎన్నికలు వాస్తవానికి కుల ప్రాతిపదికపై, మంత్రివర్గ నిర్మాణాలు తిరిగి కులప్రాతిపదికపై, ప్రభుత్వాధికారం పంపకాలు సయితం కులం ప్రాతిపదికపైనే! అయినప్పుడు ఏమి మార్పు వచ్చినట్లు, ఎక్కడ మార్పు వచ్చినట్టు?

మనకు త్రివిధాలైన నీతిసూత్రాలున్నాయని డాక్టర్ సురమ దాస్ గుప్త వ్రాసింది. ఈ సందర్భంలో "ధర్మం" అనేదాన్ని నీతికి పర్యాయపదంగా ఆమె వాడింది. ఆమె విభజన ప్రకారం మొదటిది సాధారణ ధర్మం, రెండవది వర్ణాశ్రమధర్మం, మూడవది ఆపద్ధర్మం. వీటిలో మొదటి ధర్మం ఆటవిక సంఘాలలో సయితం ప్రవర్తిల్లుతుందని ఇంతకు ముందే నేను వివరించాను. కాగా హిందూమతానికి పంచ ప్రాణాలుగా చెప్పదగింది వర్ణాశ్రమధర్మమే. అగ్రవర్ణాల ఆధిక్యత కోసం, వాటి ఔన్నత్యంకోసం, వాటి క్షేమంకోసం, వాటి సౌభాగ్యంకోసం సృష్టించబడిన ధర్మమిది. ఇతర దేశాలలోని, అన్య సంఘాలలోని వర్గ ధర్మం కంటె ఇది అన్యాయమైనది; అమానుషమైనది. అయినా, దీన్ని పరిరక్షించడమే రాజధర్మమని చెప్పని ధర్మశాస్త్రం లేదు, పురాణం లేదు, ప్రాచీనకావ్యం లేదు, నాటకంలేదు, అన్యరచన లేదు. భగవద్గీతను ఎవరో కొందరు ఫోర్జరీ చేసి, భారతంలో దూర్చింది కూడా వర్ణాశ్రమ ధర్మరక్షణకోసమే.

పోతే, మిగిలింది ఆపద్ధర్మం. శుక్రాచార్యుని అవహేళన చేయడంకోసం భాగవత పురాణంలో ఆయన చేత బలిచక్రవర్తికి – "వారిజాక్షులందు. వైవాహికములందు, బ్రాణవిత్త, మానభంగమందు జకితగోకులాగ్ర జన్మ రక్షణమందు, బొంకవచ్చు నఘము నొందదధిప"

అని చెప్పిస్తారు. శుక్రాచార్యుడు అసురుల గురువైనా, ఆయన చేతకూడా గోవుల రక్షణలో, అగ్రజన్ముల రక్షణలో అనృత దోషాన్ని పాటించ నక్కరలేదని చెప్పించడం ఇక్కడ ప్రత్యేకంగా గమనార్హం కాదా? వర్ణాశ్రమధర్మం రక్షణను నొక్కి చెప్పడానికి సందర్భాలతోనైనా పని లేదు. ప్రస్తుత చర్చతో ప్రత్యక్షసంబంధం లేకపోయినా, ఇక్కడొక విషయాన్ని చెప్పాలి. గోవులను, బ్రాహ్మణులను (అయినచోట, కానిచోట) జతచేయడం. గోవులకు బ్రాహ్మణులతో సాటిగా – వారికంటె మిన్నగా కూడా – పవిత్రత వున్నదని కాదు. ఋగ్వేదకాలంలో కాక, అటుపిమ్మట అనేక శతాబ్దాలవరకు గోవు ఆస్తి మాత్రమే కాదు, అది నాణెం కూడా. ఈనాడు ధరలను మనం రూపాయలలో నిర్ణయించినట్టు ఆనాడు గోవులలో నిర్ణయించేవారు. అందువల్ల గోరక్షణ అంటే అప్పటిలో సంపదరక్షణ. గోవులతో విధిగా బ్రాహ్మణులను జతచేర్చేవారు కాబట్టి బ్రాహ్మణ సంపద రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చేవారన్న మాట! దీన్ని నేను బ్రాహ్మణ విద్వేషంతో వ్రాస్తున్నట్టు ఏ నీచుడైనా నన్ను నిందించగోరితే, వాడికి ఒకప్పుడు విశ్వనాథ సత్యనారాయణగారు, నన్ను గురించి పల్కిన పలుకులను వినిపించాలి. ఒకానొక సందర్భంలో ఢిల్లీలో మేము కలుసుకొన్నప్పుడు ఆయన నాతో “నార్లగారూ మిమ్ములను సరిగా అర్థం చేసుకొంటున్నది నే నొక్కడినే! మీరు బ్రాహ్మణ విద్వేషులని పలువురు మీ పరోక్షంలో మిమ్ము ఆడిపోసుకుంటారు. మీరు బ్రాహ్మణవిద్వేషులు కారు, బ్రాహ్మణత్వవిద్వేషులు” – అన్నారు. “మీ మాట అక్షరాలా నిజం” అని సంతోషంతో చెమ్మగిలిన కళ్ళతో నేను ఆయనకు నమస్కరించాను.

అసలు విషయాన్ని విడిచి, చాలాదూరం వచ్చినట్టున్నాను. ఇప్పుడు తిరిగి వెనకకువెళ్ళి చెప్పవలసిన మాట – శుక్రాచార్యానికి ఆపాదించబడిన మేరవరకు ఆపద్ధర్మాన్ని సాగదీస్తే, అది అష్టావక్ర ధర్మ మౌతుంది. ఈ విషయాన్ని మరొకచోట చర్చిస్తాను.

కాగా, ఎన్నిసార్లు చెప్పినా పునరుక్తి కానట్టిది – హిందూసంఘాన్ని అధోగతికి దిగజార్చినట్టిది వర్ణాశ్రమధర్మమని. అగ్ర వర్ణాలవారు తమకు అవసరమైనపుడు దాన్ని పాటించారు, అవసరం లేనప్పుడు అతిక్రమించారు. తమకు ప్రయోజనకరమైన సందర్భాలలో, సన్నివేశాలలో దాన్ని మార్చారు. దక్షిణలను దండిగా ముట్టజెప్పిన కొందరు శూద్రరాజులను, కొందరు విదేశీయులను కూడా క్షత్రియులుగా గుర్తించి, వారు సూర్యవంశానికి, లేదా చంద్రవంశానికి చెందిన వారని, దొంగ వంశ వృక్షాలను సృష్టించారు. తాము స్వయంగా రాజధర్మాన్ని స్వీకరించి, ప్రభుతను కొనసాగించిన ఘట్టాలలో వర్ణాశ్రమధర్మం విషయంలో కాఠిన్యాన్ని చూపించారు. ఈ ధర్మంవల్ల హిందూసంఘానికి కొంత సుస్థిరత సిద్ధించిన మాట నిజమే. అయితే, అది నిస్సారమైన, నిస్తేజమైన, నిర్జీవమైన సుస్థిరత; ఈజిప్షియన్ మమ్మీల సుస్థిరత.

# VII

## "కావలసింది భావవిప్లవం"

మానవ స్వభావంలో కొన్ని దార్ఢ్యాలతోపాటు కొన్ని దౌర్బల్యాలు కూడా వుంటాయి. నీతి శాస్త్రనిర్మాతలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మానవస్వభావాన్ని నీతిశాస్త్రకారుని మానవస్వభావం నిర్లక్ష్యం చేస్తుందని "బెర్ట్రండ్ రసెల్" చెప్పినమాట పూర్తి నిజం. ఈ విషయంలో గాంధి పెద్ద పొరపాటు చేశాడు, హిమవత్పర్వతాన్ని మించిన పొరపాటు చేశాడు. దీన్ని ఒక పొరపాటు అనడం నా తొందరపాటువల్లనే. వాస్తవానికి ఆయన చేసినవి రెండు పొరపాట్లు. వీటిలో రెండవదాన్ని గురించి ముందు ప్రస్తావిస్తాను.

ఆధునిక యుగంవైపుకు కాక, మధ్యయుగంవైపుకు, ప్రాచీనయుగం వైపుకు గాంధీ దేశాన్ని నడిపించాడు. రామభజనతో ఆయన నిద్రలేచేవాడు, రామభజన చేసి మరీ నిద్రపోయేవాడు. ఇతర మతగ్రంథాలను తన ప్రార్థన సమావేశాలలో వినియోగించినా, ఆయనకు అత్యంత ప్రియమైన గేయం, "రఘుపతి రాఘవ రాజారామ్!" ఇంతే కాదు. తన ఆదర్శ రాజ్యానికి ఆయన పెట్టినపేరు, "రామరాజ్యం". ఆయన ఆర్థిక విప్లవానికి ప్రాతిపదిక, "సూత్ర యజ్ఞం". ఆయన విశ్వాసం ప్రకారం పారిశ్రామికవిప్లవం, ఆధునిక నాగరికత సైతాన్ సంతానం. ఇది కాలానికి ఎదురీదడం, యుగధర్మాన్ని తలక్రిందులు చేయడానికి యత్నించడం! గత శతాబ్ది ఉత్తరార్ధంలో మన దేశం ఒక అడుగు ముందుకు వేయగా, ఈ శతాబ్ది పూర్వార్ధంలో గాంధి దాన్ని ఏడడుగులు వెనుకకు వేయించాడు.

పోతే ఇప్పుడిక గాంధి చేసిన మొదటి పొరపాటుకు వస్తాను. రాజకీయాలలో నైతిక విలువలను ప్రవేశపెట్టడాన్ని తన జీవితం పరమ లక్ష్యాలలో ఒకదాన్నిగా ఆయన పదే పదే చాటుకొన్నాడు. కాని ఆయన చేసిన పనిమాత్రం రాజకీయాలలో నీతికి బదులుగా అవినీతిని ప్రవేశపెట్టి వాటిని ఒక రొచ్చుగుంటగా మార్చడం! ఆయన రెండవ పొరపాటుకు మూలం ఆధునిక యుగధర్మాన్ని ధిక్కరించడం కాగా, మొదటిదానికి కారణం మానవస్వభావంలోని దౌర్భల్యాలను నిర్లక్ష్యం చేయడం. పురాణాల దుష్ప్రభావం వల్లనే ఆయన తన మొదటి పొరపాటు చేశాడని నా నమ్మకం.

సత్యహరిశ్చంద్రుని కథ ప్రభావంవల్లనే ఆదిలో సర్వేశ్వరుడిని సత్యంగా ఆయన నిర్వచించాడు. అటుపిమ్మట, "సత్యమే సర్వేశ్వరు"డని దాన్ని సవరించాడు. "సత్యం" అనే పదానికి "యథార్థం" మొదలుకొని, "శాపం" వరకు నానార్థాలున్నాయి. వీటిలో ఏ ప్రత్యేకార్థం సత్యాన్ని పరమేశ్వరుడుగా ఆయన నిర్వచనం చెప్పినాడో మనకు తెలియదు.

క్షత్రియుడుగా జన్మించిన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కావడానికి ఎన్నెన్ని ప్రయత్నాలను – ఎంతటి కఠోర ప్రయత్నాలను – చేశాడో పురాణాలు వివరిస్తున్నాయి. ఇంతకుముందు చెప్పినట్లు పురాణాల ప్రభావం గాంధిపై విశేషంగానే పడింది. క్రైస్తవమతానికి చెందిన "సెయింట్స్" ప్రభావం దానికి జతపడింది. ఈ రెండింటివల్ల ఆయన కూడా బ్రహ్మర్షి కాగోరినాడు, దివ్యశక్తులను సాధించగోరినాడు. వైశ్య ప్రతిపత్తినుంచి బ్రహ్మర్షి ప్రతిపత్తికి పెరగడానికి గాంధి ప్రయత్నం చేశాడని ఇటీవల నాకు గట్టి అనుమానం కలుగుతున్నది. ఆ ప్రయత్నాన్ని తనకు మాత్రమే గాంధి పరిమితం చేసుకొనివుంటే మనకు, మన దేశానికి ఘోరాపకారం జరిగేది కాదు. కాని, తన ఆశయాలను, విశ్వాసాలను దేశంపై రుద్దడానికి ఆయన కృషిచేశాడు. దానివల్ల బహుశా కొన్ని తరాలవరకు సమసిపోని మహారిష్టాలు మనకు సంభవించాయి.

దేశంకోసం, సంఘంకోసం త్యాగాలను చేయవలసిందే. కానీ, తినడానికి తిండి, కట్టుకొనడానికి గుడ్డ, తలదాచుకొనడానికి నీడ, రోగం రొష్టూ వస్తే మందుమాకులు, పిల్లలకు చదువుసంధ్యలు – ఇట్టి ప్రాథమిక జీవితావసరాలకు సయితం ఏర్పాట్లు చేయకుండా త్యాగం చేయమనడం భావ్యమా? ఒక వెల్లువ వలె దేశభక్తి కట్టలు త్రెంచుకొన్నప్పుడు కొందరు ఎంతకైనా సన్నద్ధపడవచ్చు. కాని, ఆ పొంగు ఎందరిలో నిలుస్తుంది? ఎంతకాలం నిలుస్తుంది? గాంధికైతే ఆయన ప్రాథమికావసరాలను తీర్చడానికి బిర్లా, బజాజ్ మొదలైన కోటీశ్వరు లుండేవారు. అట్టివారు ఎందరికి లభిస్తారు? ఎంతకాలం లభిస్తారు? అయినప్పుడు, నెమ్మది నెమ్మదిగా వారిలో నైతికపు విలువలు పలచబడిపోవా? ప్రజలను ప్రజాసంస్థలను తమ పోషణకై, తమ కుటుంబ పోషణకై (తమ కిష్టమైనా, కష్టమైనా) వినియోగించుకొనవలసిన దౌర్భాగ్యస్థితిలో వారు పడరా? 1920 – 1947 సంవత్సరాల మధ్య ఎందరు ఈ స్థితికి దిగజారలేదు?

అహింస ఒక మహత్తరాదర్శమే కావచ్చు. కాని, ఒక చెంపపై ఛెళ్ళున కొట్టగా, రెండవ చెంపను అందించగలవారు ఎందరుంటారు? చివరికి గాంధికైనా అన్ని సందర్భాలలో ఇది సాధ్యపడిందా? ఖరే, నారిమన్, సుభాష్ ప్రభృతుల విషయంలో ఆయన నూటికి నూరుపాళ్ళూ క్రోధరహితంగానే, అహింసా ధర్మానుసారమే ప్రవర్తించినట్టు చెప్పగలమా?

పోతే, బ్రహ్మచర్యం, ప్రత్యేకించి నాతిగల బ్రహ్మచర్యం, ఎందరికి సాధ్యం? తానైనా బ్రహ్మచర్యాన్ని పాటించ నారంభించింది నలుగురు కొడుకులను కన్న తర్వాతనే కాదా? ఏడు పదులు దాటిన తర్వాత కూడా కామేచ్ఛను తానెంతవరకు జయించగలిగానో పరీక్షించి

తెలుసుకొనడంకోసం నగ్నయువతులను తన సరసను శయనించవలసిందిగా ఆయన కోరలేదా?

ఈ విధంగా వ్రాసుకుపోతే మానవస్వభావంలోని దౌర్బల్యాలను పరిగణనలోనికి తీసుకొనకుండా ఏవేవో మహత్తర లక్ష్యాలను అనుసరించ వలసిందిగా తన సహచరులను గాంధి ప్రోత్సహించిన సందర్భాలకు అంతు కనబడదు. ఇంతేకాక, దీనివల్ల కలిగిన మహా అనర్థాలకు సయితం మితి కనబడదు. ఒక బ్రహ్మర్షిస్థాయికి తాను పెరగగలిగితే, దేశవిభజనను నిరోధించడం మొదలుకొని, సత్యకాలాన్ని తిరిగి తీసుకురావడం వరకు తాను సాధించగలనని గాంధి కలలు కని ఉండాలి. అవి ఆయన పిచ్చికలలే కాని వెనుకటిది సత్యకాలం కానేకాదు. చరిత్రకారులదృష్టిలో వెనుకటిది ఆటవికయుగం. అప్పటిలో ప్రజాబాహుళ్యంలో నూటికి 90 మంది పశువుల కంటె దీనంగా, హేయంగా బ్రతుకుతూ వుండేవారు. ఇదే విధంగా "రామరాజ్యం" అనేది నిజానికి లేదు. "అన్నమో రామచంద్రా!" అని ఆ కాలంలో ప్రజలు అలమటిస్తూ వుండేవారు. నా రామాయణనాటకాల పీఠికలు ఒకదానిలో నేను చెప్పినట్టు అయోధ్యలో దశరథుని రాజప్రాసాదం మట్టిమిద్దె.

ఇది గాంధిని నిరసించడం కాదు; గాంధీయిజాన్ని నిరసించడం. వ్యక్తిగా ఆయన గొప్పవాడే కావచ్చు, గౌరవించదగువాడే కావచ్చు కాని, ఆయన భావాలు, ఆయన విశ్వాసాలు గర్హించదగినవి. పదేళ్ళక్రితం ఇది నా ధోరణి కాదు. అయితే, ఈ మధ్య కాలంలో నాలో ఎందుకు మార్పు వచ్చింది? ఏదైనా, ఒక చెట్టు మంచి చెడుగులను గురించి చెప్పవలసింది అది కాసే కాయలనుబట్టి. గాంధేయవిప్లవం కాస్తున్నవి అన్నీ పుచ్చుకాయలు, చచ్చుకాయలే, అన్నీ చేదుకాయలు, విషపుకాయలే. అందువల్ల గాంధీయిజంపట్ల నానాటికి నాకు – నాకేకాదు – స్వతంత్రంగా ఆలోచించగల ప్రతివ్యక్తికీ – వైముఖ్యం కలుగుతున్నది. జుగుప్స పెరుగుతున్నది.

గాంధి కానివ్వండి, మరొకరు కానివ్వండి, ప్రతి నీతిశాస్త్రనిర్ణేత (రసెల్ హెచ్చరించినట్టు) మానవస్వభావంలోని దౌర్బాల్యాలను నిర్లక్ష్యం చేయరాదు. మానవుని త్యాగానికి, అతని సహిష్ణుతకు, అతడి ప్రజా సేవాదీక్షకు కొన్ని పరిమితులున్నాయి. దీన్ని విస్మరించడం ఎంతమాత్రం తగదు. నా వాదం తాత్పర్యం – విత్తమునుంచి వారిజాక్షులవరకు ఆపద్ధర్మం సాకుతో అబద్ధాలు చెప్పవచ్చునని కాదు; నీచంగా, నికృష్టంగా వర్తించవచ్చుననడం అసలే కాదు. కానీ, నిజం చెప్పటం ఒక చెడ్డదోషం కాగల సన్నివేశాలు మానవజీవితంలో నిశ్చయంగా కొన్ని వుంటాయి. మన పురాణాలైనా ఈ సంగతిని కాదనలేదు. ఇందుకు నిదర్శనంగా మహాభారతంలోని కౌశికుని కథను జ్ఞాపకం తెచ్చుకొనండి.

కౌశికుడు సత్యసంధుడు. ఇతర సద్గుణాలకైనా కొదవలేనివాడు ఒక ఆశ్రమాన్ని నిర్మించుకొని, దానిలో ఆయన తపస్సు చేస్తూవుండగా, దొంగలకు భయపడి కొందరెవరో పరుగుపరుగున వచ్చి, ఆయన పంచ చేరారు. తరువాత కొద్ది సేపటిలోనే దొంగలు ఆ దారినేవచ్చి, "మీ ఆశ్రమంలో కొందరు దాగున్నారు, వారెక్కడ?" అని నిగ్గదీశారు. అబద్ధం చెప్పకూడదన్న నమ్మకంతో "అదిగో! అక్కడ!" అని వారిని కౌశికుడు చూపించాడు. వెంటనే వారిపై కత్తులు దూసి, వారిని చంపి, వారి సొత్తును దొంగలు పూర్తిగా దోచుకుపోయారు. తన సత్యసంధతకు కౌశికుడు చివరికి పొందింది స్వర్గసుఖం కాదు, నరకయాతన.

స్వర్గనరకాలలో నాకు విశ్వాసంలేదు కాబట్టి, స్వర్గధామానికి వేంచేయడానికి ముందు (ధర్మరాజువలె) గాంధి నరకలోకంలోకి ఒకసారి తొంగి చూడవలసివచ్చినట్టు అనబోను. కాని గాంధి సయితం ఒక చిన్న అబద్ధం చెప్పిన సంఘటన ఒక ఆప్తమిత్రుని ద్వారా మూడు, నాలుగు దశాబ్దాల నాడు నేను విన్నాను. ఆ మిత్రుని పేరు – ఆర్. వెంకటరాజులు నాయుడు. తంజావూరుజిల్లాకు వలసవెళ్ళిన తెలుగు రైతు కుటుంబంలో ఆయన జన్మించాడు. విద్యాభ్యాసం ముగిసినంతనే జర్నలిజంలో ప్రవేశించి, కౌలాలంపూర్‌లోని ఒక తమిళ దినపత్రిక సంపాదకత్వంవరకు ఆయన యెదగగలిగాడు. 1932 ప్రాంతాల ఆయన డాక్టర్ వరదరాజులు నాయుడు గారి దినపత్రిక "తమిళనాడు"కు అసోసియేట్ ఎడిటర్. అప్పటిలో ఆయన మైసూర్ సంస్థానంలోనికి నందికొండలకు విశ్రాంతికై వెళ్ళడం జరిగింది. సరిగా అదే సమయంలో గాంధి కూడా అక్కడనే విశ్రాంతికై విడిది చేసి వున్నాడు. ఒకనాడు గాంధి దర్శనంకోసం చాటుమాటుగా అప్పటి మైసూరు మహారాజా నందికొండలకు వచ్చాడు. తన చర్య బ్రిటీషువారికి కోపం కలిగించవచ్చునని భయపడి "నా రాకవార్త బయటికి పొక్కకుండా దయచేసి కట్టుదిట్టాలు చేయండి" అని గాంధిని అర్థించాడు. అందుపై గాంధి అక్కడున్న న్యూస్ ఏజెన్సీల విలేకరు లందరిని పిలిపించి, "మహారాజా రాకవార్తను ప్రచురణకు పంపవద్దు" అని సూచించాడు. ఆయన సూచనను వారు పాటించారు. అయితే, నందికొండలలో వెంకటరాజులు నాయుడు ఉనికి సంగతి గాంధికి తెలియదు. మహారాజా రావటం, గాంధిని దర్శించడం, తిరిగి వెళ్ళడం – ఈ వార్తను ఆయన తన పత్రికకు పంపించగా, దాన్ని అది ప్రముఖంగా ప్రచురించింది. సహజంగానే ఇది మహారాజాను కలవర పరచింది. మీరు నా విన్నపాన్ని గురించి తగినంత శ్రద్ధ తీసుకొనలేదా? అని గాంధికి ఆయన వర్తమానం చేశాడు. అంతట నాయుడును పిలిపించి, "నీవు పంపిన వార్త అబద్ధమని మీ పత్రికకు వెంటనే తంతి పంపించు" అని గాంధి బలవంతం చేశాడు. ఇందుకు నాయుడు ససేమిరా ఒప్పుకొనలేదు. అందుపై

న్యూస్ ఏజెన్సీల ప్రతినిధులను గాంధి స్వయంగా తిరిగి పిలిపించి, "మైసూరు మహారాజా నన్ను చూడ్డానికై వచ్చినట్టు ఒక మద్రాసు తమిళ దినపత్రికలో వెలువడినవార్త శుద్ధ అబద్ధం" అని ఒక ప్రకటన విడుదల చేశాడు! అన్ని సందర్భాలలో సత్యాన్ని పాటించడం గాంధికైనా సాధ్యం కాదని ఈ సంఘటన నిరూపించడం లేదా? నేను విననివి గాంధి జీవితంలో ఇట్టి సంఘటనలు మరి ఎన్నివున్నవో!

పదిహేను, పదహారు శతాబ్దాల మధ్య కాలంలో యూరప్ పునరుజ్జీవనానికి దోహదంచేసిన క్రైస్తవ మేథావి, మానవతా వాది ఎర్మాసస్ నిజమాడరాని సందర్భాలు, అట్టి సన్నివేశాలు కొన్ని వుంటాయని స్పష్టంగా హెచ్చరించాడు. ఇదే మాటను శామ్యూల్ బట్లర్ (ఈయన పట్ల బెర్నార్డ్ షాకు గురుభావం వుండేది) మరింత గడసరిగా చెప్పాడు. "ఏది సత్యం అంటే ఎన్నడూ అబద్ధం చెప్పకపోవడం కాదు; ఎప్పుడు అబద్ధాన్ని చెప్పవలెనో, ఎప్పుడు చెప్పరాదో నిర్ణయించుకొనడంలో విజ్ఞత" అని ఆయనన్నాడు. జైనమతాచార్యులు సయితం అబద్ధం చెప్పడం ఏయే సందర్భాలలో సముచితమో, ఎప్పుడు అనుచితమో వివరించారు. మార్గం మధ్యలో అపరిచితులు ఎవరైనా తమకు తటస్థపడి ఆ ప్రాంతాన్ని గురించి, అక్కడి గ్రామాలు, పట్టణాలు మొదలైన జనపదాలగురించి, పంటలు, పశువులు మున్నగువాటిని గురించి ఆరా తీయడానికి ప్రయత్నిస్తే, శ్రమణులు తమకు ఏమీ తెలియదని అనృతం చెప్పాలని, ఇందువల్ల, అనృత దోషం వారిని బాధించదని స్పష్టం చేశారు. దీన్నిగురించి మరికొన్ని విషయాలను తెలుసుకొనగోరేవారు హెర్మన్ యాకోబే ఇంగ్లీషులోకి అనువదించిన జైన సూత్రాలలో మొదటి భాగాన్ని 145–147 పుటలు చూడవచ్చు. ఇందుకు భిన్నంగా అది ఏ సందర్భమైనా, లేక సన్నివేశమైనా, ఆడినమాటను తప్పరాదనడంవల్ల – పాప పుణ్యాల మాట అటుంచి – కొన్ని వైపరీత్యాలు, లేదా విషఫలాలు తప్పకపోవచ్చు.

ఇట్టిదే ఇందుకొక నిదర్శనం గయుని కథ. "నీకు ఎవరినుంచి, ఎందువల్ల ప్రాణాపాయం కలగబోతున్నది?" అని ప్రశ్నించకుండానే "శరణు! శరణు!" అని గయుడనగానే, అందుకు సమ్మతించి, ఆడినమాట తప్పరాదన్న పట్టుదలతో గయునికోసం అర్జునుడు కృష్ణునితో యుద్ధానికి దిగటం తగునా? ఈ అనాలోచిత చర్యవల్ల కృష్ణార్జునుల మధ్య యుద్ధం అనివార్యం కాలేదా? వారిమధ్య పోరు నిలపడానికి తమతమ లోకాలనుంచి త్రిమూర్తులు పరుగు పరుగున రావలసిన అగత్యం కలగలేదా?

బ్రాహ్మణ వేషంలో వచ్చినవాడు నిజంగా బ్రాహ్మణుడు కాదని, దొంగవేషగాడని తెలిసిన మీదట వామనుడికి చేసిన వాగ్దానాన్ని బలిచక్రవర్తి పాలించవలసింది కాదు. ఇది కపటాన్ని, మోసాన్ని ప్రోత్సహించడమే. ఈ ప్రోత్సాహం అనృతదోషం కంటె పెద్దది కాదా?

ఏ పురాణాలను చూచినా వాటిలో కనబడేవి ఇట్టి అసంబద్ధపు గాథలే, అసహజ సంఘటనలే, నీతిపేరిట చెల్లే అవినీతి చర్యలే! అయినా, పురాణాల ప్రభావం నానాటికీ పెరుగుతున్నదే తప్ప, తరగటం లేదు. ఇందువల్ల అజ్ఞానం చిక్కబడుతున్నది, అంధ విశ్వాసాలు పెచ్చరిల్లుతున్నాయి, అవినీతి దావానలంవలె ప్రజ్వరిల్లుతున్నది. నోరు విప్పితే ఏదో ఒక అబద్ధపు కూతకూయని రాజకీయవాదులు దేశంలో ఈనాడు ఎందరున్నారు? మంత్రిపదవి మొదలుకొని, బంట్రోతు పనివరకు లంచాల గడ్డి తిననివారు ఎందరున్నారు? వర్తకవాణిజ్యాలలో, చిన్న, పెద్ద పరిశ్రమలలో వీలైనన్ని దగుల్బాజీ పనులు చేయనివారెంద రున్నారు? చివరికి విద్యాలయాల ప్రాంగణంలోకి కూడా, న్యాయస్థానాల ప్రాకారాలలోకి కూడా అవినీతి చొచ్చుకుపోలేదా? ఈనాడు "సత్యమేవ జయతే" అనే సూక్తికి మనం చెప్పుకొనవలసిన అర్థంలో ఏ తప్పుడు కూతలు కూసినా, ఏ వెధవపనులు చేసినా, ఒక పదవిని సంపాదిస్తే, లేదా హెచ్చుగా డబ్బును కూడబెడితే, సత్యం ఆ తుచ్ఛుని పక్షాన్నే వుండి వుండాలని ఇంగ్లీషులో ఒక లోకోక్తి వున్నది. దాని తాత్పర్యం "పెద్దపటాలాల పక్కనే పరమేశ్వరు డుంటాడని." అదే విధంగా ఏ గడ్డికరచినా, ఎవడికాళ్ళు పట్టుకొన్నా, ఎన్నిసార్లు "ఛీ ఛీ" అనిపించుకొన్నా, ఎందరి కూటిలో మట్టి పోసినా, ఎన్నెన్ని కొంపలు కూల్చినా, చివరికి ఖూనీలు చేయించినా, కోటలో పాగావేసినవాడి పక్షానే, కోటికి పడగ లెత్తినవాడి పక్షానే సత్యం వున్నదని తీర్మానించుకొనవలసిన పరిస్థితిలో ఈనాడు మనం పడ్డాము ఇంతే కాదు, పూర్వజన్మలో ఎంతో పుణ్యాన్ని మూటకట్టుకొని వుండకపోతే, ఎవడైనా చకచక పైకి ఎందుకు ప్రాకగలడన్న మూఢవిశ్వాసం ప్రజలలో ఈనాడు మరింతగా విశ్వరూపాన్ని ధరిస్తున్నది.

తరచి చూస్తే మన మతంలోనే, మన వేదాంతంలోనే కల్ల వున్నది, కపటం వున్నది. అందువల్లనే మనం చెప్పేదానికి, చేసేదానికి పొంతన ఎంతమాత్రం లేకుండా పోతుంది. ఇంకొక సంగతినికూడా ఇక్కడ చెప్పాలి. వేరొక మతంలో కనబడని ఒక విపరీత సూత్రం – ఒక విడ్డూరపు సిద్ధాంతం – హిందూమతంలో వున్నది. దాని ప్రకారం జీవన్ముక్తుడు పాపపుణ్యాలకు అతీతుడు. ఈ విషయం "అనుగీత"లో వున్నది; కొన్ని ఉపనిషత్తులలో కూడా వున్నది. జీవన్ముక్తుడు, లేదా ఆత్మస్వరూపాన్ని తెలుసుకున్నవాడు తల్లిని చంపినా, తండ్రిని చంపినా, మరెంతటి ఘోరకృత్యాన్ని చేసినా, అతడికి ఏ పాపమూ అంటదు. "చంపేవా డెవడు? చచ్చేవా డెవడు?" ఇది కాదా భగవద్గీతలో కృష్ణుడు పార్థుడికి చేసిన మహోపదేశం! ఏ నీతిసూత్రాలైనా సామాన్యులకే, తిరిగి వారిలో హీనకులాలవారికే! జీవన్ముక్తుల విషయంలో పాపాలప్రసక్తి రాదు, రారాదు. ఇందువల్లనే కావచ్చు – జీవన్ముక్తులైన ఋషులు గుంపులు గుంపులుగా వుండే మన పురాణాలలో వారు పలికేవన్నీ

బొంకులే, వారు చేసేవన్నీ రంకులే! "ఇవేనా పుణ్యగ్రంథాలు? వీటిని పారాయణం చేస్తే స్వర్గద్వారాలు మనకోసం తెరుచుకుంటాయా?" అని ప్రశ్నించేవాళ్ళు పెక్కుమంది దృష్టిలో పాషండులే, పాపిష్ఠివాళ్ళే!

కాగా, ప్రస్తుతానికి నేను చివరిమాటగా ఒకే ఒకదాన్ని చెప్ప గోరుతున్నాను. పురాణాల దుష్ప్రభావం నుంచి ఇప్పటికైనా ఒక ప్రజగా మనం బయటపడలేకపోతే, రాముడు, కృష్ణుడు, నలుడు, హరిశ్చంద్రుడు మున్నగువారిని సముద్రాంతరాలకు సాగనంపకపోతే, ధర్మశాస్త్రాలను భస్మీపటలం చేయకపోతే, కులవ్యవస్థను రూపుమాపకపోతే, హేతుదృష్టిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొనకపోతే మనదేశం పైకి కాక క్రిందికే, మరింత క్రిందికే – పోతుంది, మనం వెనుకకే – మరింత వెనుకకే – నడుస్తాము. మనలో భావవిప్లవం రానంతవరకు ఏ పంచవర్ష ప్రణాళికలు, ఏ పంచ సూత్రాలూ అధోగతినుంచి మనను తప్పించలేవు.

నార్ల వెంకటేశ్వరరావు

**"లుంబిని",**
**బంజారా హిల్స్,**
**హైదరాబాదు.**

# నరకంలో హరిశ్చంద్రుడు

(నాటకం)

# నరకంలో హరిశ్చంద్రుడు

(నాటకం)

## పాత్రలు

| | | |
|---|---|---|
| **హరిశ్చంద్రుడు** | : | అయోధ్య చక్రవర్తి |
| **లోహితాస్యుడు** | : | హరిశ్చంద్రుని కుమారుడు |
| **వసిష్ఠుడు** | : | హరిశ్చంద్రుని రాజపురోహితుడు |
| **సత్యకీర్తి** | : | హరిశ్చంద్రుని మహామంత్రి |
| **కృష్ణపాణి** | : | హరిశ్చంద్రుని ప్రధానరాజవైద్యుడు |
| **మాధవ శర్మ** | : | హరిశ్చంద్రుని మరొక రాజవైద్యుడు |
| **యమధర్మరాజు** | : | నరకలోకాధిపతి |
| **చిత్రగుప్తుడు** | : | యమధర్మరాజు ఆస్థానంలో లేఖకుడు |

*వీరు కాక ఒక రాజభటుడు, ఇద్దరు పరిచారకులు, ఇద్దరు యమకింకరులు*

## రంగాలు

**ప్రథమాంకం** : అయోధ్యాపురిలో హరిశ్చంద్రుని శయ్యాగారం

**ద్వితీయాంకం** : సంయమనిలో యమధర్మరాజు న్యాయస్థానం

**తృతీయాంకం** : ప్రథమాంకంలోవలె హరిశ్చంద్రుని శయ్యాగారం

## సమయాలు

**ప్రథమాంకం** : ఉదయం తొమ్మిది, పది గంటలమధ్య

**ద్వితీయాంకం** : మరికొన్ని క్షణాలకు

**తృతీయాంకం** : తిరిగి మరికొన్ని క్షణాలకు

# ప్రథమాంకం

హరిశ్చంద్రుని శయ్యాగారం. చక్రవర్తి హంసతూలికాతల్పంపై పరుండి వుంటాడు. వృద్ధాప్యంతోపాటు దౌర్బల్యం ప్రవేశించిన వయస్సు, శుష్కించి వెలవెలబారిన ముఖం, భుజాల నంటుతున్న శిరోజాలు. కర్ణకుండలాలు, వజ్రాంగుళీయం తప్ప అన్య రాజాభరణాలు లేవు. చీనాంబరాన్ని ధరించాడు శయనించి వున్నప్పుడు నిచోళం (దుప్పటి) లోనుంచి శిరోభాగం మాత్రమే కానవస్తూ వుంటుంది. శయ్యపై లేచి కూర్చున్నప్పుడు అనాచ్ఛాదిత వక్షస్థలం కనబడుతూ వుంటుంది.

సత్యకీర్తి హరిశ్చంద్రుని సమవయస్కుడు, ఆరోగ్యంకాని, పటుత్వంకాని సడలలేదు. ప్రగల్భుడు కాడు గాని, స్వామిభక్తి పరాయణుడు. ధౌతాంబరాన్ని ధరించాడు. ఉత్తరీయం కూడా తెల్లనిదే. కుడిచేతి వేళ్ళకు రెండు ఉంగరాలు, మెడలో హారం.

రాజవైద్యులు, పరిచారకులు, రాజభటుడు – వీరిని తమ తమ ప్రతిపత్తికి తగు వేషభూషలు.

తెర లేచినప్పుడు రాజతల్ప శిరోభాగంలో ఒక పరిచారకుడు. అతడికి రెండవ వైపుగా మరొక పరిచారకుడు. ఉభయులు వీవనలతో విసురుతూ వుంటారు.

తల్పం సమీపంలో నాలుగు భద్రాసనాలు వుంటాయి. అప్పుడప్పుడు వాటిపై మహామంత్రి, రాజవైద్యులు కూర్చుండి లేస్తూ వుంటారు.

చక్రవర్తి రుగ్మత ప్రసక్తివచ్చిన సందర్భాలలో మహామంత్రి, రాజవైద్యులు ఆయన శయ్యకు వీలైనంత దూరంగా చేరుతూ వుంటారు.

తెర లేచినప్పుడు రాజవైద్యులు కృష్ణపాణి, మాధవశర్మ ఆందోళనతో కూడిన ముఖాలతో ఏవో మంతనా లాడుతూవుంటారు. మహామంత్రి అశాంతిలో ఒకచోట నిలవలేక పచార్లు చేస్తూ వుంటాడు.

**హరిశ్చంద్రుడు** : (తీవ్ర జ్వరపీడితునికి సహజమైన అశాంతితో శయ్యపై ఇటునటు కదులుతూ) దేవీ! దేవీ!!

**సత్యకీర్తి** : సార్వభౌములు నిద్రలో కలవరిస్తున్నారు.

**కృష్ణపాణి** : నిద్రలో కలవరింతలు కావు, మహామంత్రీ! విషజ్వర తీవ్రతలో...

**సత్యకీర్తి** : విషజ్వరమా!

**కృష్ణపాణి** : నా నోట తిరిగి చెప్పించడం దేనికి? తమరు పెద్దలు, అనుభవజ్ఞులు! తమకు తెలియని దేమున్నది?

(సత్యకీర్తి గట్టిగా నిట్టూర్చుతాడు)

**హరిశ్చంద్రుడు** : దేవీ! దేవీ! చంద్రమతీ!!

**సత్యకీర్తి** : కఫదోషంతో వచ్చిన స్వల్పజ్వరమని, త్వరలోనే తగ్గిపోతుందని...

**కృష్ణపాణి** : (మాటకు అడ్డువస్తూ) నిన్నటి పరిస్థితి అంతే, మహామంత్రీ! ఇంతలోనే ఇంతగా ముంచుకు వస్తుందని మాకు మాత్రం ఏమి తెలుసు?

**మాధవశర్మ** : మాకు మాత్రం... (మాట మధ్యలో ఆగి, ప్రధాన రాజవైద్యుని వైపు తిరిగి) కృష్ణపాణి భిషగ్వరులు మమ్మి మన్నించాలి. (తిరిగి మహామంత్రితో) మాకు మాత్రం ఇది కేవలం కఫజ్వరం కాదని, జాగ్రత్త వహించకపోతే విషమించవచ్చునని ఆదిలోనే తోచింది.

**కృష్ణపాణి** : (కోపంగా) ఆదిలోనే తమకు తోచిందా? అయితే, మమ్మి హెచ్చరించ లేదేమి?

**మాధవశర్మ** : రాజవైద్యులలో తమరు ప్రధానులు. నాడీనిదానంలో అద్వితీయుల మని తాము చెప్పుకుంటారు. అందువల్ల....

**కృష్ణపాణి** : (తీవ్రంగా) అందువల్ల?

**మాధవశర్మ** : తమరు ఆగ్రహిస్తే, మే మేమి చెప్పగలం?

సత్యకీర్తి : (కృష్ణపాణితో) మీరు కాస్త శాంతించండి. (మాధవశర్మతో) మీకు నిన్ననే ఇది విషజ్వరమని తోచివుంటె, మాతోనైనా కాస్తమాట అన్నారు కాదేమి?

మాధవ శర్మ : మన్నించండి, అది మా తప్పిదమే!

కృష్ణపాణి : (రోషంగా) నిన్న మాతోపాటు మీరుకూడా నాడీపరీక్ష చేశారు; మీ కేమి దోషం కనబడింది?

మాధవశర్మ : కఫదోషంతోపాటు వాతప్రకోపం కానరాలేదా?

కృష్ణపాణి : వాతప్రకోపం రాత్రి ప్రవేశించింది.

మాధవశర్మ : సార్వభౌముల రుగ్మత చలితో ప్రారంభమైంది. కఫవాతాలు ఏకకాలంలో ప్రకోపించకపోతే, ఆ లక్షణం కనబడుతుందా? ఇది రక్తధాతువు నాశ్రయించిన సతతజ్వర మని మేము ప్రారంభంలోనే నిర్ణయించు కున్నాము.

కృష్ణపాణి : ఏ ప్రమాణంతో? ప్రత్యక్ష ప్రమాణంతోనా? అనుమాన ప్రమాణంతోనా? ఆప్తోపదేశ ప్రమాణంతోనా?

మాధవశర్మ : ప్రత్యక్ష ప్రమాణం వుండగా, అన్య ప్రమాణాలు దేనికి? కేవలం కఫజ్వరమైతే, అంత చలితో ప్రారంభం కాదు!

కృష్ణపాణి : గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించినట్లు – చాల్చాలు – నాడీనిదానంలో మమ్ము తప్పు పట్టడమా? (సత్యకీర్తి వైపు తిరిగి) వ్యాధి వశం తప్పిపోయినందున ఈ మాధవశర్మ మాపై నెపం నెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. మీకు తెలియవా? – ఈ ప్రబుద్ధుని కుత్సితాలు, ఇతడి కుతంత్రాలు!

సత్యకీర్తి : (ఆందోళనతో) వ్యాధి వశం తప్పినట్టేనా? మరి చేయగలిగింది లేదా?

కృష్ణపాణి : (నీరసంగా) ఏమీ కనబడదు.

హరిశ్చంద్రుడు : దేవీ! దేవీ!

సత్యకీర్తి : (మాధవశర్మతో) మీ రేమంటారు?

మాధవశర్మ : మే మైనా ఇప్పుడు చేయగలిగింది లేదు.

కృష్ణపాణి : ("ఇప్పుడు" అనే మాటను నొక్కుతూ) "ఇప్పుడు చేయగలిగింది ఏమీ లేదంటున్నావు – ముందుగా అయితే నీ వేమైనా చేయగలిగేవాడివా?

**మాధవశర్మ** : దుర్లక్షణాలు కనిపించగానే మా కవకాశ మిచ్చివుంటే, ఎవరి హస్తవాసి ఎట్టిదో తెలిసేది!

**కృష్ణపాణి** : ఛీ! నీచుడా! మా హస్తవాసిని శంకిస్తావా? ఇంతకాలంగా శ్రీవారి ఆరోగ్యాన్ని కాపాడిన దెవరు? ఎన్నో గడ్డు గండాలనుంచి శ్రీవారిని తప్పించిన దెవరు? నీవా, మేమా?

**మాధవశర్మ** : పోనీ అని మిన్నకుంటే నువ్వు నోరు పారవేసుకుంటున్నావ్! నీ బండారం కాస్తా ....

**సత్యకీర్తి** : (చికాకుగా) సంతోషించాం! మీ కలహానికి సమయా సమయాలులేవా?

**కృష్ణపాణి** } ఒకేసారిగా { క్షమించండి!
**మాధవశర్మ** } ఒకేసారిగా { మన్నించండి!

**సత్యకీర్తి** : క్షమించడం లేదు, మన్నించడం లేదు. ఏదైనా ఒక దారి వుంటే చూడండి.

**కృష్ణపాణి** : ఏ దారైనా, ఇహ ఆ పరమేశ్వరుడే చూపించాలి.

**మాధవశర్మ** : ఇప్పుడు మన చేతిలో ఏమీ లేదు.

**కృష్ణపాణి** : నీ కొద్ది బుద్ధి పోనిచ్చావ్ కాదు. "ఇప్పు"డంటూ మళ్ళీ అదే కూత కూస్తున్నావ్!

**మాధవశర్మ** : కూతలు కూస్తున్నది నేను కాదు, నువ్వు!

**సత్యకీర్తి** : (పట్టరాని కోపంతో, బుసకొడుతూ) మీకు మతి పోయిందా? ఇక్కడేనా మీరు కాట్లాడవలసింది? మీ రిద్దరు తక్షణం బయటికి దయచెయ్యండి!

**మాధవశర్మ** : నా తప్పేమున్నది, మీరేచెప్పండి, మహామంత్రీ! తాము చూస్తూనే వున్నారుగదా? ఇతడు నాపై ఎంతగా నోరు పారవేసు...

**సత్యకీర్తి** : అన్నీ చూస్తూనే వున్నాము. ముందు మీరు కదలండి. (మాధవశర్మ తటపటాయించగా) కదులుతారా, లేదా?

**మాధవశర్మ** : మహామంత్రులు...

**సత్యకీర్తి** : మళ్ళీ చెబుతున్నాను... కదులుతారా, లేదా?

**మాధవశర్మ** : (వెళ్ళిపోతూ) ఆగ్రహించకండి, వెడుతున్నాము (నమస్కరిస్తూ) మేము తెలియక చేసిన తప్పిదం వుంటే మన్నించండి.

(వెడతాడు)

**కృష్ణపాణి** : (వెళ్ళిపోతున్న మాధవశర్మను పురుగును చూచినట్లు చూస్తూ) మాకు పేర్లు పెట్టడానికే అతడు వచ్చాడు. ఆ పని కాస్తా పూర్తి చేసి, చక్కాపోయాడు. ఈ స్థితిలో సార్వభౌములను విడిచిపెట్టి మే మెక్కడికి పోగలం? మేము చివరి వరకు శ్రీవారి సేవలో నిలవవలసినవారిమే!

**హరిశ్చంద్రుడు** : (శయ్యపై సగం లేచి) దేవీ! దేవీ!

**కృష్ణపాణి** : (దగ్గరికి వెళ్ళి, హరిశ్చంద్రుని తిరిగి మంచంపై పరుండబెట్టడంలో పరిచారకులకు సహాయపడుతూ) ఇంతలోనే ఎంత ముంచుకు వచ్చింది! నిన్న సూర్యాస్తమానం తర్వాత ఒక ఘడియకు మేము పరీక్షచేసినప్పుడు ఈ జ్వరతీవ్రత లేదు. అప్పుడు ప్రభువులు సుఖంగా నిద్రపోతున్నారు. (ఒక క్షణం ఆగి) శ్రీవారు శయ్యపై నిలవడం లేదని అర్ధరాత్రి వేళ మాకు వర్తమానంచేసేవరకు వ్యాధి విషమించిందని మాకు తెలియదు. ఆ వర్తమానం కాస్త ముందుగానైనా చేశారు కారు. అర్ధరాత్రి వేళ వైద్యునికి వర్తమానం చేయరాదని శాస్త్రం చెబుతున్నది. హుటాహుటిగా మేము బయల్దేరి వస్తుండగా, గుడ్లగూబ మా కెదురైంది. అది మరొక దుశ్శకునం. (సత్యకీర్తిపై తన పలుకుల ప్రభావాన్ని కనిపెట్టిచూస్తూ, ఇంకొక క్షణం తర్వాత) మా లోప మేమీ లేకుండా శాస్త్రం చెప్పిన దివ్యౌషధాలన్నీ ప్రయోగించాము. తక్షణం కొంత సుగుణం కనబడింది. కాని, తెల్లవారేసరికి మళ్ళీ తిరగబెట్టింది. ఎవరైనా నిజదోషానికి వైద్యం చేయగలరుగాని, విధిదోషానికి చేయగలరా?

**హరిశ్చంద్రుడు** : దేవీ! చంద్రమతీ!

**సత్యకీర్తి** : (నిట్టూర్చుతూ) సార్వభౌములు సతీమణిని పదే పదే సంస్మరిస్తున్నారు

**కృష్ణపాణి** : ఆమె పుణ్యాత్మురాలు. అందువల్లనే పుణ్యస్త్రీగా స్వర్గానికి వేం చేశారు. ఆ మహాసాధ్వీలలామ పుణ్యఫలమే శ్రీహరి నిప్పుడు కాపాడాలి.

**సత్యకీర్తి** : యువరాజు ప్రభువులు చెంతనైనా లేరు. వారం రోజులనగా ఆ

రాకుమారులనుంచి వర్తమానమైనా లేదు. ఎక్కడున్నారో, ఏమో? మీరు నిన్ననే మమ్ము ఏమాత్రం హెచ్చరించివున్నా...

**కృష్ణపాణి** : మనం త్రికాలజ్ఞులమా? ఏ క్షణాన ఏమి జరుగుతుందో మన కెలా తెలుస్తుంది?

**సత్యకీర్తి** : (చికాకుగా) మిమ్ముల ననవలసిన పనిలేదులెండి ఎటుపోయి ఎటువస్తుందో అని ముందుగా జాగ్రత్త పడకపోవడం మాదే పొరపాటు. (ఒక క్షణం ఆగి) ఎవరురా, అక్కడ!

**భటుడు** : (నమస్కరిస్తూ ప్రవేశించి) చిత్తం!

**సత్యకీర్తి** : తక్షణం సర్వసేనానివద్దకు వెళ్ళి – అన్నట్టు యువరాజ ప్రభువుల వెంట ఆయన వేటకు వెళ్ళారుగా! – తక్షణం దుర్గాధిపతి వద్దకు వెళ్ళి, యువరాజ ప్రభువు లెక్కడున్నా, వారిని వెంటనే తోడ్కొని రావలసిందని మా మాటగా చెప్పు.

**భటుడు** : చిత్తం, దేవరా!

(నమస్కరిస్తూ నిష్క్రమిస్తాడు)

**కృష్ణపాణి** : జన్మ నక్షత్రాన్ని సూర్యుడు, అంగారకుడు, రాహువు, ఆక్రమిస్తే మహారాజులకు మరణం తప్పదని ప్రాయికంగా జ్యోతిష్కులు చెబుతారు. ఈ పరిస్థితిలో సాక్షాత్తు ఆ ధన్వంతరి వైద్యం చేసినా, అశ్వనీదేవతలే అవనీతలానికి దిగివచ్చినా, మాట దక్కదు. మా వైద్య లోపమేమీ లేదని తమరు యువరాజ ప్రభువులతో....

**సత్యకీర్తి** : మనవి చేస్తాములెండి! (క్షణం ఆగి, తిరిగి పచారు చేస్తూ) ఆయనకు కడసారి చూపైనా అందుతుందో, లేదో!

**కృష్ణపాణి** : (హరిశ్చంద్రుని సమీపించి, నాడీ పరీక్షచేస్తూ) నాడీలో యుద్ధాశ్వగతి కానవస్తున్నది. మరి ఏ క్షణాన... ...

**హరిశ్చంద్రుడు** : (రాజవైద్యుని చేతిని విదిలించి వేస్తూ) ఎవడవురా నువ్వు? మాతంగకన్యలను సమీపించకుండా మమ్ము నిరోధిస్తున్నావ్!

**కృష్ణపాణి** : (శయ్యపై సగంలేచిన హరిశ్చంద్రుని పరిచారకుల తోడ్పాటుతో తిరిగి పరుండబెట్టి, ఇవతలికి వస్తూ) శ్రీవారి చిత్తం మరింతగా వారి వశం తప్పిపోతున్నది.

**హరిశ్చంద్రుడు** : (అంతలోనే మంచంపై తిరిగి సగం లేచి) రండి! రండి! వచ్చారా? మీ వీణలు తెచ్చారా? (పరిచారకులు నిరోధిస్తున్నా శయ్యనుంచి దిగబోతూ) మీ కుసుమ కోమలాంగుళులతో వీణాతంత్రులను మీటండి! మీ కిన్నెర కంఠాలతో పాడండి. (క్షణం ఆగి) సిగ్గుపడతారు దేనికి? పాడండి! గొంతెత్తి పాడండి. (అలసిపోయినట్టు, హరిశ్చంద్రుడు శయ్యపై వాలిపోతాడు)

**కృష్ణపాణి** : సార్వభౌములు నృత్యగానకళాభిమానులు! వారు మెచ్చిందే ఆట; వారికి నచ్చిందే పాట. వారి మెప్పు పొందడానికి దేవ లోకంలో సురకాంతలు ఎంతగా ఉత్సహిస్తున్నారో!

**సత్యకీర్తి** : (తీవ్రంగా) మీ అశుభవాక్కులు, మీ అధిక ప్రసంగాలు మరి కట్టిపెట్టండి. మీ వాచాలత్వంతో మాకు సగం మతిపోతున్నది. యువరాజు ప్రభువులకు కనీసం కడసారిచూపు అందించడానికైనా ప్రయత్నించండి

**కృష్ణపాణి** : కాలం, ఖర్మం కలిసి రానప్పుడు మన మేమి చేసినా ఫలిత మొక్కటే! తాము పెద్దలు, పూజ్యులు – మావల్ల వైద్యలోపం లేదని తమకు తెలియదా? మాకు మాట రాకుండా ఆ ప్రభువులతో...

**సత్యకీర్తి** : (విదిలిస్తూ) మీ గొడవే తప్ప మీకు మరొకటి లేనట్టున్నది!

**కృష్ణపాణి** : రాజాశ్రితుల బ్రతుకెట్టిదో – మహా మంత్రులు తమకు తెలియదా?

**భటుడు** : (ప్రవేశిస్తూ) మహా మంత్రులకు నమస్కారం.

**సత్యకీర్తి** : దుర్గాధిపతికి మా వర్తమానం అందజేశావా?

**భటుడు** : చిత్తం, దేవరా! వెంటనే బయల్దేరుతున్నట్లు తమకు మనవి చెయ్యమన్నారు.

**సత్యకీర్తి** : మంచిది!

(నమస్కరించి, భటుడు వెళ్ళిపోతాడు.)

**కృష్ణపాణి** : రాజ పురోహితులు వసిష్ఠ మహర్షికికూడా వర్తమానం చేయడం మంచిదేమో!

**సత్యకీర్తి** : ఔను! మాకు స్ఫురించనేలేదు సుమా! ఎవరురా, అక్కడ!

**భటుడు** : (తిరిగి ప్రవేశిస్తూ) ఏమి సెలవు?

సత్యకీర్తి : వసిష్ఠ మహర్షి ఆశ్రమానికి వెళ్ళి, వారిని వెంటనే తోడుకురావలసిందిగా సూతునితో మా ఆజ్ఞగా చెప్పు. ఉత్తమాశ్వాలను పూన్చిన రథంలో వెళ్ళమన్నామని చెప్పు.

భటుడు : చిత్తం, దేవరా!

హరిశ్చంద్రుడు : (శయ్యపై తిరిగి చివాలున లేస్తూ) ఆహా! ఏమి మధురగానం! ఏమి మధుర గానం! ఈ రత్నహారాన్ని మా బహుమానంగా పరిగ్రహించండి.

కృష్ణపాణి : (హరిశ్చంద్రుని శయ్యను సమీపిస్తూ) శ్రీవారికి తమ జీవితంలోని పూర్వఘట్టాలన్నీ జ్ఞప్తికి వస్తున్నాయి. (ఈ లోపల పరిచారకులు హరిశ్చంద్రుని శయ్యపై తిరిగి పరుండబెట్టగా, నాడిని పరీక్షిస్తూ) తక్కిన యేర్పాటులు కూడా తాము త్వరగా ముగించడం మంచిది.

సత్యకీర్తి : (ఆందోళనతో) అంతవరకు వచ్చిందా? ("ఔ" నన్నట్టు కృష్ణపాణి తల ఊపగా, బాధతో మూల్గుతూ) యువరాజు ప్రభువులకు కడసారి చూపు ప్రాప్తికూడా లేదన్న మాట! (కొన్ని క్షణాల మౌనం తర్వాత) ఎవరురా, అక్కడ!

భటుడు : (చేతులు కట్టుకొని ప్రవేశిస్తూ) ఏమి సెలవు?

సత్యకీర్తి : సూతునికి వర్తమానం అందిందా?

భటుడు : చిత్తం, దేవరా! తమరి సెలవైనంతనే అందు కేర్పాటు చేశాను.

సత్యకీర్తి : అయితే, ఉపదుర్గాధిపతి వద్దకు కూడా నమ్మకమైన బంటును చూచి, వెంటనే పంపించు. వసిష్ఠులవారిని, యువరాజు ప్రభువుల వారిని తప్ప అన్యులను మా అనుమతి లేకుండా దుర్గంలో ప్రవేశించనివ్వరాదు. తెలిసిందా?

భటుడు : చిత్తం, దేవరా!

(నిష్క్రమిస్తాడు.)

కృష్ణపాణి : (హరిశ్చంద్రుని శయ్యవద్ద నుంచి ఇవతలికి వస్తూ) కీడెంచి మేలెంచమన్నారు మహామంత్రులు గట్టి కట్టుదిట్టాలే చేశారు.

హరిశ్చంద్రుడు : (శూన్యంలోకి వేలెత్తి) ఎవరురా మీరు? ఎందుకు వచ్చారు?

సత్యకీర్తి : (హరిశ్చంద్రుడు వేలెత్తి చూపుతున్న దిక్కుకు చూస్తూ) ఎవ్వరూ లేరే!

**కృష్ణపాణి** : శ్రీవారు ఏవో రూపాలను చూస్తున్నారు. సంధించినప్పుడు అది సహజమే, మహామంత్రీ!

**హరిశ్చంద్రుడు** : యమకింకరులా? ఎందుకువచ్చారు? పొండి! పొండి!! పోతారా, లేదా! కదలరే? మెడపట్టి గెంటించాలా? ఎవరురా, అక్కడ?

**భటుడు** : (చేతులు కట్టుకొని ప్రవేశిస్తూ) ఏమి సెలవు?

**సత్యకీర్తి** : ఏమిలేదురా! నువ్వు పో!

**భటుడు** : (వెనకకు తిరగబోతూ) చిత్తం!

**సత్యకీర్తి** : ఉపదుర్గాధిపతి వద్దకు వర్తమానం వెళ్ళిందా!

**భటుడు** : చిత్తం దేవరా!

**సత్యకీర్తి** : మంచిది.

**హరిశ్చంద్రుడు** : ఆఁ! ఎంత సాహసం! ఎంత కండకావరం! మమ్మ సమీపిస్తారా? మేము మహాచక్రవర్తుల మని మీకు తెలియదా? ఏదీ నా కరవాలం? మిమ్ము తుత్తునియలు చేస్తాను! ఏదీ మా కరవాలం? ఎవడురా? అక్కడ?

**భటుడు** : (భయపడుతూ ప్రవేశించి) చిత్తం ప్రభూ!

**కృష్ణపాణి** : నిన్ను కాదురా! నువ్వు పో! మహామంత్రులు స్వయంగా పిలిస్తే తప్ప నువ్వు రాబోకు!

**భటుడు** : (బిత్తరపడి వెళ్ళిపోతూ) చిత్తం, స్వామీ!
(భటుని నిష్క్రమణ)

**హరిశ్చంద్రుడు** : మాకు మరణ మాసన్న మైందా? మా ప్రాణాలు తోడుకుపోవడానికి వచ్చారా? (వికటంగా నవ్వుతూ) మీ యమధర్మరాజుకు మతిపోయి నట్టున్నది. స్వర్గంనుంచి మా కోసం పుష్పక విమానం రావాలి; దానిలో దేవదూతలు రావాలి; “వేంచేయండి, ప్రభూ!” అని భక్తి, వినయాలతో మమ్ము ప్రార్థించాలి (ఆకసంవైపు రెండు చేతులెత్తి) అదుగో! పుష్పక విమానం! మాకోసం రానే వస్తున్నది! దానిపై దేవేంద్రుడు స్వయంగా వస్తున్నాడు. ఆయన వెంట రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ వస్తున్నారు. వీణలు మీటుతూ వస్తున్నారు; నృత్యం చేస్తూ వస్తున్నారు! రండి! రండి!

(శయ్యనుంచి హరిశ్చంద్రుడు దిగబోతాడు. పరిచారకులకు తోడుగా వెళ్ళి, సత్యకీర్తి, కృష్ణపాణి చక్రవర్తిని పట్టుకొని, నెమ్మదిగా తిరిగి పడుకోబెడతారు.)

**సత్యకీర్తి** : ఈ విపరీత చేష్ట లేమిటో?

**కృష్ణపాణి** : సంధిప్రకోపం చరమస్థాయికి చేరుకున్నది.

**హరిశ్చంద్రుడు** : (శయ్యపై చివాలున లేచి కూర్చుండి, దీనంగా) రానే లేదా? పుష్పకం రానే లేదా? (క్షణం ఆగి, పళ్లు పటపట నూరుతూ) తుచ్ఛులారా! నవ్వుతున్నారా! చతురంభోధి పరీత వసుంధరను ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలిస్తున్న ఈ చక్రవర్తిని చూచి నవ్వుతున్నారా? సత్యసంధుడని ముల్లోకాలలో కీర్తి నార్జించిన ఈ సార్వభౌముని చూచి నవ్వుతున్నారా? నవ్వండి! నవ్వండి! మీ పొట్టలు చెక్కలయేటట్లు నవ్వండి! మీ అంతు, మిమ్ము పంపించిన మీ యమధర్మరాజు అంతు మేము కనుక్కునే వరకు నవ్వండి. ఎవరురా, అక్కడ! ఏదీ మా ఖడ్గం?

(బిడియంతో లోనికి తొంగిచూచిన భటుడు అంతలోనే వెనకకు తగ్గుతాడు.)

**సత్యకీర్తి** : (శయ్యనుంచి దిగబోయిన హరిశ్చంద్రుని పరిచారకులు పట్టుకొని, పరుండబెట్టిన తర్వాత, కృష్ణపాణితో) గుడ్లు అప్పగించి చూస్తూ నిలబడక మరొక ప్రయత్నం చేసి చూడండి.

**కృష్ణపాణి** : మన ప్రయత్నాల స్థితి దాటిపోయింది. అయినా, మహా మంత్రుల మాట మే మెందుకు కాదనాలి? ఇదివరకే ఒకసారి వాడిన నవరత్న చింతామణి తిరిగి వాడి చూస్తాం!

(సంచిలో నుంచి మందు తీసి, పరిచారకుల సహాయంతో దాన్ని అతి కష్టంమీద హరిశ్చంద్రునితో సేవింప జేస్తాడు)

**హరిశ్చంద్రుడు** : (కృష్ణపాణి ఇవతలికి రాగానే మంచంపై తిరిగి దిగ్గున లేచి) పుణ్యలోకాలలో ప్రవేశించవలసిన మాకు – దేవేంద్రునితో అర్ధ సింహాసనం అదిష్ఠించవలసిన మాకు యమధర్మరాజునుంచి పిలుపు రావడమా? తాను స్వయంగానైనా రాక, తన కింకరులను పంపించడమా? ఏమి వింత! ఎంత విడ్డూరం! సత్యానికి ఇంతగా

చేవ చచ్చిందా? ధర్మం ఇంతగా శక్తిహీనమై పోయిందా? మేము రాము. రామని మీ ప్రభువుతో చెప్పండి. కావాలంటే తననే రమ్మనండి – అడగవలసిన నాలుగు మాటలు ఆయననే అడుగుతాము! (మరింత ఉద్వేగంతో) పొమ్మంటే పోక సమీపిస్తున్నారా! పాశాన్ని విసరుతున్నారా? ప్రాణాలు తోడుతున్నారా? మీకు బుద్ధి చెబుతాము! మా ప్రతాపం చవి చూపిస్తాము! ఏదీ మా కరవాలం! ఏవీ మా ధనుర్బాణాలు, ఏదీ మా రథం? ఎక్కడ మా చతురంగబలం? ఎక్కడ... ఎక్కడ... ఎక్కడ... (పరిచారకులు పట్టునుంచి తప్పించుకుని, హరిశ్చంద్రుడు మంచంపై నుంచి దూకబోయి, కిందికి పడిపోతాడు. సత్యకీర్తి, కృష్ణపాణి త్వరితంగా వెళ్లి, ఆయనను లేవనెత్తి మంచంపై పరుండ బెడుతున్న పరిచారకులకు సహాయపడతారు. నాడీ పరీక్ష చేసి, "హంస ఎగిరిపోయింది" అన్నట్టు కృష్ణపాణి సంజ్ఞ చేస్తుండగా) –

**(తెర)**

# ద్వితీయాంకం

(**య**మధర్మరాజు న్యాయపీఠంపై ఆసీనుడై వుంటాడు. ఆయనది గంభీరమైన మూర్తి, గంభీరమైన వాక్కు. జనులు సర్వసామాన్యంగా భావించినట్టు, ఆయన భయంకరుడు కాడు. చీనాంబరాన్ని ధరించి వుంటాడు. శిరస్సుపై రత్నఖచిత కిరీటం, కంఠంలో వజ్రహారం, హస్తాలకు భుజకీర్తులు. శరీరోపరిభాగానికి ఆచ్ఛాదన లేదు.

యమధర్మరాజు ధర్మపీఠానికి ఒక చెంపగా తన ప్రతిపత్తికి సముచితమైన భద్రాసనంపై చిత్రగుప్తుడు కూర్చుని వుంటాడు. నిరాడంబరమైనవి అతని వేషభూషలు.

యమకింకరుల దుస్తులు రాజభటులకు తగినట్టివి.

తన శయ్యాగారంలోని వేషభూషలతోనే హరిశ్చంద్రుడు న్యాయస్థానంలో ప్రవేశిస్తాడు.)

**హరిశ్చంద్రుడు** : (తన రెక్కలు పట్టుకొన్న యమకింకరులతో పెనుగులాడుతూ) తుచ్ఛులారా! మీ తుచ్ఛపుబుద్ధి పోనిచ్చారు కాదు. సామ్రాజ్యాధిపతి నన్ను సంకోచమైనా లేకుండా రెక్కలు పట్టుకుని మమ్మీడ్చుకు వస్తారా?

**చిత్రగుప్తుడు** : రమ్మనగానే తమరు రాకపోతే వారికి గత్యంతరం లేదు గదా! వారి ధర్మాన్ని వారు నిర్వర్తిస్తున్నారు.

**హరిశ్చంద్రుడు** : ధర్మోపన్యాసాలిస్తున్నావ్! మధ్య నీ వెవరివయ్యా?

**చిత్రగుప్తుడు** : నా పరిచయం తమకు లేదు కాబోలు! నన్ను చిత్రగుప్తుడంటారు.

**హరిశ్చంద్రుడు** : ఓహో! తప్పుడు లెక్కలు వ్రాసే చిత్రగుప్తులవారు తమరేనా, స్వామీ!

**యమధర్మరాజు** : ఇది న్యాయస్థాన మని మరచిపోతున్నావ్!

**హరిశ్చంద్రుడు** : న్యాయస్థానం కాదు, అన్యాయస్థానం. లేకపోతే సత్యవ్రతానికి, ధర్మనిరతికి విశ్వవిఖ్యాతి నార్జించుకొన్న మమ్మిక్కడికి రప్పిస్తారా? యమధర్మరాజు పాలించే న్యాయ మిదే కాబోలు! ఆయనను నా యెదట పడనివ్వండి – అడగవలసిన నాలుగు మాటలు ముఖంమీదే అడిగివేస్తాను.

**యమధర్మరాజు** : రెచ్చిపోయి పిచ్చిగా మాట్లాడుతున్నావు సుమీ!

**హరిశ్చంద్రుడు** : పిచ్చిగా మాట్లాడుతున్నది మేము కాదు, మీరే! ఇంతకూ మీరెవరు?

**చిత్రగుప్తుడు** : వారే ధర్మప్రభువులు.

**హరిశ్చంద్రుడు** : యమధర్మరాజులు తమరేనా? తమరు భయంకరులని విన్నామే!

**యమధర్మరాజు** : పాపులదృష్టిలో న్యాయమూర్తులు భయంకరులే!

**హరిశ్చంద్రుడు** : మా విషయంలో తమరు పొరపడినట్టున్నారు. లేకపోతే ఇంతటి ఘోరాన్యాయానికి పాల్పడరు!

**యమధర్మరాజు** : పొరపడినామా? ఏ విధంగా?

**హరిశ్చంద్రుడు** : మా సూర్యవంశంలోనే మరొక హరిశ్చంద్రుడు వుండేవాడు. ఆయన తండ్రి పేరుకూడా త్రిశంకుడే. ఆయన అనృత దోషానికి పాల్పడ్డాడు. వరుణదేవుని వరప్రసాదంగా తాను పొందిన పుత్రుని ఆయన ప్రీత్యర్థం యాగపశువుగా చేసి నరమేధ జరుపుతానని తానిచ్చిన మాటను ఆయన నిలుపుకోలేదు. ఆయన పాపాన్ని మీ చిత్రగుప్తుడు నాకు అంటగట్టినట్టున్నాడు.

**యమధర్మరాజు** : మా చిత్రగుప్తుడట్టి పొరపాటు చేయలేదు.

**హరిశ్చంద్రుడు** : అయితే, మమ్ము తమ సమక్షానికి ఎందుకు రప్పించినట్టు?

**యమధర్మరాజు** : ఎందుకు రప్పించామో విచారణతర్వాత నీకే తెలుస్తుంది.

**హరిశ్చంద్రుడు** : తెలిసి మేము చేసిన పాప మేదీ లేదే?

**యమధర్మరాజు** : తెలియక చేసే పాపా లుండవచ్చు గదా! తెలిసి చేసినా, తెలియక చేసినా పాపాలు పాపాలే! పైగా, నీవు చేసినవి తెలియక చేసిన పాపాలని నమ్మలేము.

**హరిశ్చంద్రుడు** : అవేవో సెలవిస్తారా?

**యమధర్మరాజు** : (తన లేఖకునివైపు తిరిగి) చిత్రగుప్తా! విచారణ లాంఛనాలను ప్రారంభించు! (కింకరులతో) అతడిని విడిచిపెట్టి, మీరు పొండి, అవసరమైనప్పుడు మేము పిలుస్తాము.

(హరిశ్చంద్రుని విడిచిపెట్టి, యమధర్మరాజుకు భక్తితో నమస్కరిస్తూ కింకరులు వెళ్ళిపోతారు)

**చిత్రగుపుప్తుడు** : (హరిశ్చంద్రునితో) నీ పేరు?

**హరిశ్చంద్రుడు** : పేరైనా తెలియకుండానే పిలిపించావా, స్వామీ? నరకానికి తగినట్టుగానే వున్నది మీ నడవడిక!

**యమధర్మరాజు** : తిరిగి హెచ్చరిస్తున్నాము – ఇది న్యాయస్థానం! అధిక ప్రసంగం చేయక, అడిగిన ప్రశ్నకు బదులు చెప్పు.

**చిత్రగుప్తుడు** : నీ పేరు?

**హరిశ్చంద్రుడు** : రాజమాన్య, రాజపూజిత శ్రీశ్రీశ్రీ హరిశ్చంద్ర చక్రవర్తి.

(యమధర్మరాజు నొసలు యెగరవేసి, చిరునవ్వు నవ్వుతాడు)

**చిత్రగుప్తుడు** : తండ్రి పేరు?

**హరిశ్చంద్రుడు** : త్రిశంకుచక్రవర్తి

**చిత్రగుప్తుడు** : ఊరు?

**హరిశ్చంద్రుడు** : అయోధ్యానగరం.

**చిత్రగుప్తుడు** : వృత్తి?

**హరిశ్చంద్రుడు** : చతురంభోధిపరీత భరతక్ష్మాతల మహాసామ్రాజ్యాధిపత్యం.

**చిత్రగుప్తుడు** : నీ పాపాల నంగీకరిస్తున్నావా?

**హరిశ్చంద్రుడు** : ఆ పాపా లేవో తమరు సెల విప్వలేదు!

**చిత్రగుప్తుడు** : సత్యవ్రతంలో నిష్ఠ తప్పడం నీ మొదటి పాపం.

**హరిశ్చంద్రుడు** : (ఆశ్చర్యంగా) సత్యహరిశ్చంద్రుడుగా పేరందిన మేము సత్య వ్రతంలో

నిష్ఠ తప్పడం! మీ అధోలోకంలో నుంచి చూచినప్పుడు అన్నీ తలక్రిందులుగానే కనబడతాయి కాబోలు!

**యమధర్మరాజు** : ఎలా కనబడతాయో త్వరలోనే తేలుతుంది. నీ పాపాన్ని అంగీకరిస్తున్నావా?

**హరిశ్చంద్రుడు** : లేదు.

**యమధర్మరాజు** : చేసిన ఒక పాపాన్ని చేయలేదంటే, అది రెండు పాపాలౌతుంది సుమీ!

**హరిశ్చంద్రుడు** : సత్యవ్రత నిష్ఠలో సామ్రాజ్యాన్ని త్యజించడానికైనా సంకోచించని పుణ్యపురుషుడనని భూలోకంలో మాకున్న కీర్తి తమ లోకంవరకు రాలేదు కాబోలు!

**యమధర్మరాజు** : కీర్తి కేమిలే! అది శేషంగా మీ లోకంలోనే మిగులుతుంది! కీర్తి, అపకీర్తులతో నిమిత్తం లేకుండా మే మిక్కడ చేసేది పాపపుణ్యాల పరిశీలన.

**హరిశ్చంద్రుడు** : అయితే, మేము సత్యవ్రతంలో నిష్ఠ తప్పినట్టే తమరు భావిస్తున్నారా?

**యమధర్మరాజు** : ఔను!

**హరిశ్చంద్రుడు** : ఎప్పుడు? ఎక్కడ?

**యమధర్మరాజు** : దాన్ని మా చిత్రగుప్తుడు వివరిస్తాడు.

**చిత్రగుప్తుడు** : (తన ముందు పెట్టుకొన్న వ్రాతప్రతి పుటలను పరికిస్తూ, యమధర్మరాజుతో) విశ్వామిత్రునికి రాజ్యాన్ని ధారవోసిన ఘట్టంతో ప్రారంభించ మంటారా, ప్రభూ!

**యమధర్మరాజు** : మంచిది.

**హరిశ్చంద్రుడు** : ఆడిన మాట ప్రకారం ఆ మహర్షికి సామ్రాజ్య మిచ్చి, దారా సుతులను వెంట బెట్టుకొని, కట్టుగుడ్డలతో కాననాలకు వెళ్లిపోయాము. మాటకోసం మహీమండలాధి పత్యాన్ని చేజేతుల వదులుకొన్నామని మానవలోకానికి లోకమే మమ్ము కీర్తిస్తున్నది. ఇది తమ లెక్కలలోకి పాపంగా ఎక్కడం – ఔరా!– ఎంత విపరీతం! (చిత్రగుప్తునితో) ఈ పద్ధతిలోనే మీరు లెక్కలు వ్రాస్తారా, స్వామీ!

**యమధర్మరాజు** : అతనిపై నీవు విసరులు విసర నక్కలేదు. మాకు సమాధానం చెప్పు! నీవు రాజ్యాన్ని ధారవోసిన వెంటనే విశ్వామిత్రుడు ఏమన్నాడు?

**హరిశ్చంద్రుడు** : యాగానికై అంతకు ముందొకనాడు మేము దానంగా తమ కిచ్చిన ధనాన్ని తిరిగి తెమ్మన్నారు.

**యమధర్మరాజు** : తిరిగి తెమ్మన్నాడా? అంటే, ఒకసారి నీవు దాన్ని చెల్లించావన్న మాట.

**హరిశ్చంద్రుడు** : చెల్లించామనే చెప్పవచ్చు. యాగార్థం మహర్షి కోరిన ధనాన్ని మత్తేభాలపై కట్టించి వెంటనే పంపుతామన్నాము. ''వద్దు! వద్దు! మా కవసరమైనప్పుడు మేమే వచ్చి తీసుకు వెడతాము. అంతవరకు రాజకోశాగారంలో దాన్ని భద్రపరచి వుంచు!" అని చెప్పి ఆయన వెళ్ళిపోయారు. "తమ ధనం తమవద్దనే వుండడం మంచి"దని మే మెంత చెప్పినా ఆయన వినిపించుకోలేదు.

**యమధర్మరాజు** : నీ వద్ద భద్రపరచిన తన ధనాన్ని తనకు అప్పగించవలసిందిగా మహర్షి కోరడం దాన్ని తిరిగి తెమ్మనడం కాగలదా?

**హరిశ్చంద్రుడు** : మా రాజ్యంతో పాటు ఆయన ధనాన్ని భద్రపరచిన కోశాగారాన్ని కూడా ఆయనకు మేము అప్పగింత పెట్టలేదా? అయినప్పుడు దాన్ని తెమ్మనడం తిరిగి తెమ్మనడమే కాదా? పైగా, అది కొద్దిపాటి ధనమైనా కాదు. దంతావళంపై బలవంతుడొకడు నిలిచి, రత్నాన్ని ఎంతపైకి రువ్వుతాడో అంత యెత్తు ధనం!

**యమధర్మరాజు** : రాజ్యాన్ని ధారవోసే సందర్భంలో రాజకోశాగారంలో తమ కోర్కెపై భద్రపరచిన తమ ధనంవినా తక్కిన దాన్ని మాత్రమే ధారవోస్తున్నానని విశ్వామిత్రునితో నీ వన్నావా?

**హరిశ్చంద్రుడు** : ఆ మాట మే మనవలసిన పనిలేదు కాబట్టి అనలేదు. విశ్వామిత్ర మహర్షి తపోవనం మా రాజ్యంలోనే వున్నది. ఆ కారణాన తమ తపోవన భూములువినా, తక్కిన మా రాజ్యాన్ని ధారవోస్తున్నామని మే మనాలా? పైగా, ఒకసారి మేము దానం చేసినంతనే ఆ ధనం ఆయనదై పోయింది. ఆయన ధనాన్ని ఆయనకే రెండవసారి మేము దానం చేయగలమా?

**యమధర్మరాజు** : ఈ వాదం ఆయన వద్ద చేశావా?

**హరిశ్చంద్రుడు** : ఇంత వివరంగా చేయలేదు గాని, మా రాజ్యంతోపాటు ఆయన ధనాన్ని, భద్రపరచిన కోశాగారాన్ని కూడా ఆయనకే అప్పగించినట్టు చెప్పాము.

**యమధర్మరాజు** : అందుపై ఆయ నేమన్నారు?

**హరిశ్చంద్రుడు** : ఆడిన మాట తప్పుతున్నా వన్నారు.

**యమధర్మరాజు** : ఆయన ఆరోపణ నిజమైనదేనా?

**హరిశ్చంద్రుడు** : కాదు.

**యమధర్మరాజు** : అయితే, తనకు ముట్టిన ధనం ముట్టలేదని ఆయన పలకడం అబద్ధం కాదా?

**హరిశ్చంద్రుడు** : అంతమాట మే మనలేము.

**యమధర్మరాజు** : "నీవు అబద్ధమాడుతున్నా"వని విశ్వామిత్రునికి చెప్పడానికి చాలా సాహసం కావాలి. ఆయన శాపాలభయం, మాకులేదు కాబట్టి, ఈ సందర్భంలో ఆయన అబద్ధమాడినట్టు మే మన వచ్చునా?

**హరిశ్చంద్రుడు** : తమ రేమైనా అనగలరు!

**యమధర్మరాజు** : అది అబద్ధమైనప్పుడు నీవు దానికి తలవొగ్గ వచ్చునా? అబద్ధానికి తలవొగ్గడం అబద్ధమాడ్డంతో సమానం కాదా?

**హరిశ్చంద్రుడు** : ఆ విధంగా మేము భావించలేదు.

**యమధర్మరాజు** : ఎందువల్ల?

**హరిశ్చంద్రుడు** : సత్యవ్రతాన్ని ఎవరికి వారు పాటించగలరు గాని మరొకరిని నిర్బంధించి పాటింపజేయగలరా?

**యమధర్మరాజు** : విశ్వామిత్రుని నిర్బంధించి ఆయనచే సత్యవ్రతాన్ని పాటింప జేసే ప్రశ్న ఇక్కడలేదు. ఆయన అబద్ధమాడగా, అది అబద్ధమని చెప్పకపోగా, సత్యంగా దాన్ని ఎందుకు స్వీకరించావు?

**హరిశ్చంద్రుడు** : మేము దానంగా తమ కిచ్చిన ధనం ఆయనకు ముట్టనే ముట్టిందని మే మనకపోలేదు. అయినా, మా మాట ఆయన వినిపించుకోలేదు.

**యమధర్మరాజు** : ఆయన వినిపించుకొన్నా, వినిపించుకొనకపోయినా, వాస్తవం అంతే కాదా?

**హరిశ్చంద్రుడు** : అంతే!

**యమధర్మరాజు** : అయినప్పుడు తిరిగి ధన మివ్వడానికి సమ్మతించడం వాస్తవానికి ద్రోహం చేయడం కాదా?

**హరిశ్చంద్రుడు** : విశ్వామిత్ర మహర్షికి ధర్మసూక్ష్మాలు చెప్పవలసింది మేమా అని సంకోచించాము.

**యమధర్మరాజు** : ఆయన మహర్షి కాక, నీ రాజ్యంలో సామాన్య పౌరుడైతే, ఆ విధంగా సంకోచించే వాడివా? మహర్షులైనా, మరొకరైనా, ధర్మసూక్ష్మాలు ధర్మసూక్ష్మాలే కావా? నీ రాజ్యాంలో నీవు న్యాయపాలన చేసింది ఈ పద్ధతిలో నేనా?

**హరిశ్చంద్రుడు** : న్యాయపాలనలో మేము శక్తిమంతులకు, శక్తిహీనులకు మధ్య వివక్ష చేయలేదు. మహర్షిని మేము సంతృప్తి పరచడం, అందువల్ల వచ్చే కష్టనష్టాలు మావే కాని, ఇతరులకు కావని...

**యమధర్మరాజు** : నీ చర్య వల్ల నీవేనా కష్టనష్టాల పాలైంది? చంద్రమతి మాటేమిటి? లోహితాస్యుని మాటేమిటి? వారిని నీవు అష్టకష్టాల పాల్జేయలేదా? అన్నవస్త్రాలకు వారిని దూరం చేయలేదా? పశువులవలె వారిని సంతలో తెగనమ్ముకో లేదా?

**హరిశ్చంద్రుడు** : వారు నా భార్యాపుత్రులు.

**యమధర్మరాజు** : నీ భార్యాపుత్రులైనంత మాత్రాన నీ కీర్తి దాహానికి వారు బలికావాలా?

**హరిశ్చంద్రుడు** : మే మాడిన మాట తప్పరాదని మాకంటె వారే ఎక్కువ పట్టుదల చూపించారు.

**యమధర్మరాజు** : ఆడిన మాట తప్పకుండానే అబద్ధ మాడవచ్చు. నిజాన్ని మాటలోనే కాదు : మనస్సులో కూడా పాటించాలి. సత్యవ్రతాన్ని నెరపవలసింది మనోవాక్కాయకర్మలతో. అయినా, కేవలం మాటలను పట్టుకొని వ్రేలాడ్డమే సత్యవ్రతంగా నీవు సంభావించావు! సరే! చిత్రగుప్తా! సత్యానికి ఇతడు ద్రోహంచేసిన మరొక సందర్భమేది?

**చిత్రగుప్తుడు** : (వ్రాతప్రతి పుటలను తిరగవేస్తూ) నక్షత్రకుని దారిబత్తెం విషయంలో!

**హరిశ్చంద్రుడు** : ఆ సందర్భంలో కూడా మేము అపచారం చేశామా?

**యమధర్మరాజు** : నిస్సందేహంగా! "నీ గురుకార్యంపై నీవు మావెంట వచ్చినప్పుడు నీకు మే మెందుకు దారిబత్తె మివ్వాలి? పైగా, మావెంట నున్నప్పుడు మేము నిన్ను పోషించలేదా? అవి కందమూల ఫలాలే కావచ్చు. అయినా, వాటిని ముందు నీకుపెట్టి, నీవు తినగా మిగిలినవాటినే మేము తినలేదా? మాకు మిగల్చకుండా వాటిని నీవే తినివేస్తే, మేము పస్తుండలేదా? అయినా, దారిబత్తెం కోరడం తగునా?" అని నీవు నక్షత్రకుని ప్రశ్నించ లేదా?

**హరిశ్చంద్రుడు** : ఔను.

**యమధర్మరాజు** : అయినా, నక్షత్రకుడు విశ్వామిత్రుని పేరెత్తేసరికి బెదిరిపోయి, నిన్ను నీవు వీరబాహునికి తెగనమ్ముకొని, దారిబత్తె మిచ్చి పంపించలేదా?

**హరిశ్చంద్రుడు** : మే మేమి చేసినా, ఆడినమాట తప్ప రాదన్న దీక్షతోనే

**యమధర్మరాజు** : మాట యిచ్చినట్టు భ్రమపడ్డానికైనా ఇక్కడ సావకాశం లేదే? విశ్వామిత్రుడు నక్షత్రకుని నీవెంట పంపినప్పుడు అతడిని పోషించడం చాలదని నీతో అన్నాడా? అదనంగా దారిబత్తెం చెల్లించ వలె నన్నాడా? అందుకు నీ వంగీకరించావా?

**హరిశ్చంద్రుడు** : లేదు.

**యమధర్మరాజు** : ఆడినమాటే లేనప్పుడు దాన్ని తప్పడ మేమిటి, తప్పక పోవడమేమిటి?

**హరిశ్చంద్రుడు** : దారిబత్తెం మాట విశ్వామిత్ర మహర్షి మాతో అనకపోయినా; నక్షత్రకునితో అన్నారేమో అని మే మనుమానించడానికి వీలులేదా? లేకపోతే, నక్షత్రకుడు అంతగా పట్టు పట్టేవాడా?

**యమధర్మరాజు** : విశ్వామిత్రుని మాటపైనే నక్షత్రకుడు దారిబత్తెం తెమ్మన్నా, అది న్యాయం కాదు. న్యాయంకాదని నక్షత్రకునికి నీవు స్వయంగానే చెప్పావు. న్యాయంకానిదాన్ని ధిక్కరించడం సత్యవ్రతంలో ఒక భాగం కాదా? న్యాయం లేనిచోట సత్యం నిలవగలదా?

**హరిశ్చంద్రుడు** : అంత దూరం మేము ఆలోచించలేదు. దారిబత్తెం చెల్లించాలనడం విశ్వామిత్రుని అభిమతమైతే, దాన్ని గౌరవించడం మా ధర్మమని భావించాము.

**యమధర్మరాజు** : అయితే, ఆయన అభిమతాన్ని అన్ని సందర్భాలలో గౌరవించ లేదేమి?

**హరిశ్చంద్రుడు** : అన్ని సందర్భాలంటే తమ తాత్పర్యం?

**యమధర్మరాజు** : చిత్రగుప్తా! అదేమిటో వివరించు!

**చిత్రగుప్తుడు** : తన కుమార్తెలను వివాహ మాడవలసిందిగా విశ్వామిత్రుడు కోరగా, అందుకు నీవు నిరాకరించలేదా?

**హరిశ్చంద్రుడు** : వర్ణవ్యవస్థను రక్షించవలసిన మేము వర్ణ సాంకర్యానికి దిగడం మా రాజధర్మానికి విరుద్ధం కాదా?

**యమధర్మరాజు** : రాజులైన వా రెందరు వర్ణాంతర వివాహాలు చేసుకోలేదు?

**హరిశ్చంద్రుడు** : వీరు వర్ణ బాహ్యులు, మాతంగకన్యలు.

**యమధర్మరాజు** : మీ కులగురువు వసిష్ఠుని పత్ని మాతంగ స్త్రీ కాదా?

**హరిశ్చంద్రుడు** : వారు మహర్షులు; వా రేమైనా చేస్తారు!

**యమధర్మరాజు** : మీరు మహారాజులు; మీరూ ఏమైనా చేస్తారు! వారు అబలలన్న సంకోచమైనా లేకుండా మాతంగకన్యలను నీవు దండించలేదా?

**హరిశ్చంద్రుడు** : లేదు, పాపపు కోర్కెను వారు కోరగా మా సమక్షం నుంచి తొలగించ మన్నాము. అంతే!

**యమధర్మరాజు** : మరి, వారిని నీవు దండించినట్టు విశ్వామిత్రుడు నిన్ను ఎందుకు నిందించవలసి వచ్చింది?

**హరిశ్చంద్రుడు** : అది అకారణ నింద,

**యమధర్మరాజు** : అయితే, తిరిగి అసత్యాన్ని సత్యంగా గుర్తించావన్నమాట! వాస్తవానికి తిరిగి ద్రోహం చేశావన్నమాట!

**హరిశ్చంద్రుడు** : తమకు తెలిసిన ధర్మసూక్ష్మాలు అందరికీ తెలుస్తాయా?

**యమధర్మరాజు** : ధర్మసూత్రాల పరిజ్ఞానం ఎంత మాత్రం లేకుండా సత్యవ్రతానుష్ఠానం సాధ్యమా?

**హరిశ్చంద్రుడు** : మా వ్రతాన్ని మా వసిష్ఠ, విశ్వామిత్రులు హర్షించారు.

**యమధర్మరాజు** : శంఖంలో పోసిందే తీర్థమైనట్టు, మహర్షులు హర్షించిందే సత్యవ్రత మౌతుంది కాబోలు!

**హరిశ్చంద్రుడు** : అయితే, తమరు చెప్పే సత్యవ్రత మేది?

**యమధర్మరాజు** : ఇంత వరకు చెప్పింది చాలదా? ఇంకా చెప్పాలా? అయితే, విను! నీవు భ్రమపడుతున్నట్టు అబద్ధా లాడకపోవడమే సత్యవ్రతం కాబోదు. భావనాబలం లేక అబద్ధాలాడకపోవచ్చు, కల్పనాచాతుర్యం లేక అబద్ధా లాడకపోవచ్చు, ధైర్యసాహసాలు లేక అబద్ధా లాడకపోవచ్చు. అది అంగిలితో పాటించే సత్యవ్రతమే, అంతరంగంతో పాటించేది కాదు. కొందరి విషయంలో అది పైపై నటన, కొందరి విషయంలో అది కీర్తి దాహం. అట్టివారి కంటె అబద్ధా లాడేవారే నయం.

**హరిశ్చంద్రుడు** : (వెటకారంగా) అబద్ధా లాడేవారే నయమా? ఈ సూత్రం తమ లోకానికే వర్తిస్తుందా, అన్నిటికీనా?

**యమధర్మరాజు** : ఏ లోకంలోనైనా అంగిలితో నిజమాడేవానికంటె అంతరంగంలో కల్మషం లేకుండా అబద్ధ మాడేవాడే నయం!

**హరిశ్చంద్రుడు** : ఇదేనా సత్యవ్రతానికి తమ నిర్వచనం?

**యమధర్మరాజు** : అది నీకు అర్థం కాకపోవచ్చు గాని, సత్యవ్రత మంటే అసత్యాన్ని ఖండించడం, అధర్మాన్ని నిరసించడం, అవినీతిని ప్రతిఘటించడం, అన్యాయాన్ని ధిక్కరించడం, అస్వాతంత్ర్యాన్ని నిర్మూలించడం.

**హరిశ్చంద్రుడు** : అస్వాతంత్ర్యనిర్మూలన కూడా సత్యవ్రతంలో ఒక భాగమా?

**యమధర్మరాజు** : స్వాతంత్ర్యం లేనిచోట సత్యం నిలవగలదా? న్యాయం నిలవ గలదా? అస్వాతంత్ర్యంపట్ల, అన్యాయంపట్ల ఆగ్రహంతో కూడిందే సత్యవ్రతం. దాన్ని సత్యాగ్రహ మన్నా అనవచ్చు.

**హరిశ్చంద్రుడు** : తిరిగి ప్రశ్నిస్తే సత్యవ్రత నిర్వచనాన్ని తమరు మరింత సాగదీస్తారేమో!

**యమధర్మరాజు** : సత్యవ్రత సమగ్రస్వరూపాన్ని తెలుసుకొనడానికైనా జంకుతున్న నీవు సత్యవ్రతాన్ని పాటించగలవా?

**హరిశ్చంద్రుడు** : మేము దాన్ని పాటించలేకపోయామని మా విశ్వామిత్రు లనలేదు, మా వసిష్ఠులనలేదు.

**యమధర్మరాజు** : వారి మాట కేమి? నీ అంతరాత్మ ఏ మంటున్నది?

**హరిశ్చంద్రుడు** : దాన్ని మేము శోధించుకోలేదు.

**యమధర్మరాజు** : ఆత్మశోధన లేకుండానే సత్యవ్రతం కొనసాగించా వన్నమాట! ఇప్పుడైనా ఒకసారి దాన్ని శోధించుకుంటే, మాతంగకన్యలకు నీ అంతఃపురంలో స్థాన మివ్వకపోయినా, నీ అంతరంగంలో స్థాన మిచ్చినట్టు నీకే తెలుస్తుంది.

**హరిశ్చంద్రుడు** : (చెవులు మూసుకొంటూ) శివశివా!

**చిత్రగుప్తుడు** : మాతంగకన్యలను ఇంతకుముందే ఈయన సంస్మరించాడు, ప్రభూ!

**హరిశ్చంద్రుడు** : ఎప్పుడు?

**చిత్రగుప్తుడు** : మా పిలుపు రావడానికి కొంచెం ముందుగా, అపస్మారక స్థితిలో వున్నప్పుడు.

**హరిశ్చంద్రుడు** : అపస్మారకస్థితిలో జరిగినదానికి మేము బాధ్యులమా.

**యమధర్మరాజు** : స్వప్నాలలోవలె అపస్మారక స్థితిలో వింతవింత రూపాలలో బాహిరిల్లేవి అంతరంగంలో నిగూఢమై వుండే అపరితృప్తవాంఛలే! ప్రయత్నించి కూడా తీర్చుకొనలేకపోయిన కోర్కెలు, లోకానికి వెరచి ప్రయత్నించ కుండా విడిచిపెట్టిన కోర్కెలు – ఇవన్నీ నిద్రలో స్వప్నాలుగా, సంధిలో

ప్రేలాపనలుగా వెలువలికి తోసుకు వస్తాయి. నిజమనేది మనస్సు పైపొరలలో కాక, దాని లోతులలో దాగి వుంటుంది. దాన్ని తెలుసుకొన గలవాడే సత్యవ్రతుడు.

**హరిశ్చంద్రుడు** : తమ మాటలు మాకర్థం కావడంలేదు. కారుణ్యరహితమైన తమ ధర్మచర్చతో మమ్ము ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఏమైనా, తెలిసి మేము ఏ దోషాన్నీ చేయలేదు.

**చిత్రగుప్తుడు** : (వ్రాతప్రతి పుటలలోకి చూస్తూ) తెలిసి చేసిన దోషం కూడా వున్నది ప్రభూ!

**హరిశ్చంద్రుడు** : తెలిసి చేసిన దోషం వున్నదా?

**యమధర్మరాజు** : లేకేమి? చంద్రమతి నిర్దోషి అని నీకు తెలియదా? శవదహనానికి చెల్లించవలసిన సుంకానికై ఆమె కాశీరాజపుత్రుని హత్య చేయలేదని నీకు తెలియదా? అయినా, ఆమె శిరశ్ఛేదానికి నీ వెందుకు సిద్ధపడినట్టు?

**హరిశ్చంద్రుడు** : అప్పటిలో మేము వీరబాహుని సేవకులమైనందున మా సేవాధర్మాన్ని పాటించబోయాము.

**యమధర్మరాజు** : రాజధర్మమని, సేవాధర్మమని ప్రతిచర్యను సమర్థించుకొనడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నావు. వాటిని మించిన మరొక ధర్మం – మానవధర్మం – లేదా? దానికి విరుద్ధంగా నీ భార్యా పుత్రులను నీ వెంత క్షోభ పెట్టలేదు?

**హరిశ్చంద్రుడు** : సత్యమని మేము నమ్మినదానికోసం మాతోపాటు వారు కూడా త్యాగాలను చేయవలసి వచ్చింది.

**యమధర్మరాజు** : సంతోషంగా చేసేవే త్యాగాలు, విలపిస్తూ చేసేవి కావు. సత్యవ్రతానికై విషమపరీక్షలకు గురికావలసి వచ్చిందని నీ వెంతగా విలపించ లేదు?

**హరిశ్చంద్రుడు** : అది మానవ సహజం.

**యమధర్మరాజు** : నిర్దోషి అని తెలిసికూడా భార్యా శిరశ్ఛేదానికి సంసిద్ధం కావడం కూడా మానవసహజ మేనా?

**హరిశ్చంద్రుడు** : మా ప్రతిచర్యకు మీరు విపరీతార్థాలు తీస్తున్నారు!

**యమధర్మరాజు** : మేము తీసున్నవి ఏ అర్థాలో ఇక్కడ కొంత కాలంపాటు వుంటే నీకే తెలుస్తుంది. కీర్తి దాహం, స్వర్గలోభం మొదలైన నీ తక్కిన పాపాలను

క్షమిస్తున్నాము. సత్యవ్రతాన్ని సరిగా అర్థం చేసుకొనక, అర్థం చేసుకొన్న మేరకైనా దాన్ని నిష్ఠగా పాటించక, నీవు చేసిన పాపానికై ఒక పుష్కరంపాటు ఇక్కడ మా అతిథిగా వుండు.

**హరిశ్చంద్రుడు** : (తన చెవులను తనే నమ్మలేనట్టు) ఎవరికి ఈ కఠిన శిక్ష!

**యమధర్మరాజు** : చతురంభోధి పరీత భరతక్ష్మాతల చక్రవర్తి శ్రీశ్రీశ్రీ హరిశ్చంద్రుల వారికి!!

**హరిశ్చంద్రుడు** : ఆ చక్రవర్తి సత్యవ్రత పాలనకై తన సామ్రాజ్యాన్ని ధారవోయలేదా? ఆయన కేనా ఈ ఘోర శిక్ష!

**యమధర్మరాజు** : మూల్యంలేని సత్యానికి సామ్రాజ్యాన్ని మూల్యంగా భావిస్తున్న నీకు మే మిచ్చింది చాలా స్వల్పశిక్ష!

**హరిశ్చంద్రుడు** : విశ్వామిత్రులవలె మీరు మమ్ము పరీక్షిస్తున్నారా?

**యమధర్మరాజు** : ఇంతవరకు ఆ భ్రమలో వున్నావా?

**హరిశ్చంద్రుడు** : మా సత్యనిష్ఠా గరిష్ఠను పరీక్షించడానికి ఆయన కూడా పెద్ద నాటకం నడిపారు లెండి!

**యమధర్మరాజు** : మూర్ఖుడా! ఇది న్యాయస్థానం, నాటకశాల కాదు.

**హరిశ్చంద్రుడు** : (తెల్లబోతూ) నిజంగానే తమరు మాకు శిక్ష విధించారన్న మాట!

**యమధర్మరాజు** : నిజంగానో, అబద్ధంగానో ఒక పుష్కరంపాటు కరకు కత్తుల బోనులో గడిపిన తర్వాత నీకే తెలుస్తుందిలే!

**హరిశ్చంద్రుడు** : (సడలిన బింకంతో) ఆ కత్తుల బోనులో మేము పుష్కరం గడపాలా?

**యమధర్మరాజు** : నీకు తోడుగా చాలా మంది వున్నారులే!

**హరిశ్చంద్రుడు** : వారు చక్రవర్తులు కారు!

**యమధర్మరాజు** : ఆ చింత నీవు పెట్టుకోనక్కరలేదు. చక్రవర్తుల తలదన్నిన వారే నీకిక్కడ జతగా వున్నారు.

**హరిశ్చంద్రుడు** : (దీనంగా) మాకు అన్యాయం జరిగినట్టు మేము భావిస్తున్నాము. ధర్మప్రభువులు మా విషయం పునరాలోచన చెయ్యాలి!

**యమధర్మరాజు** : మానవునికి, మానవునికిమధ్య అన్ని కృత్రిమ విభేదాలను తొలగించే మృత్యువు తర్వాత కూడా చక్రవర్తినని అహంకరిస్తున్నావు. పాపిగా నిర్ణయించి, శిక్ష విధించిన పిదప కూడా "మేము, మేము" అంటూ నీకు నీవే ఆధిక్య మిచ్చుకొంటున్నావు. నీకు మరొక పుష్కరంపాటు శిక్ష విధిస్తున్నాము.

**హరిశ్చంద్రుడు** : వద్దు, ప్రభో! వద్దు! తమరు నా కళ్ళు తెరిపించారు! నాకు వివేకం కలిగించారు! మరి అహంకరించను! తమరు ధర్మానికే చక్రవర్తులు, ఈ పాపిని మన్నించండి! ఈ దీనుని కరుణించండి!!

**యమధర్మరాజు** : సరే! నీ రెండవ శిక్షను ఉపసంహరిస్తున్నాము.

**హరిశ్చంద్రుడు** : తాము ధర్మప్రభువులే కారు, కారుణ్యమూర్తులు!

**యమధర్మరాజు** : స్తోత్రపాఠాలకు పొంగేది మీ భూలోకచక్రవర్తులు; మేము కాము సుమీ!

**హరిశ్చంద్రుడు** : ప్రభువులు తిరిగి నన్ను మన్నించాలి!

**యమధర్మరాజు** : ఎవరురా, అక్కడ! (కింకరులు నమస్కరిస్తూ ప్రవేశించగా) ఇతడిని తీసుకుపొండి!

(కింకరులు తనవైపుకు ఒక అడుగు వేసీవేయకముందే వారి దిక్కులో నడిచి, మేకపిల్లవలె వారిని హరిశ్చంద్రుడు అనుసరిస్తుండగా) –

**(తెర)**

# తృతీయాంకం

(ఈ అంకంలో ప్రవేశించే కొత్త పాత్ర లిద్దరిలో వసిష్ఠుడు వృద్ధుడైనా దృఢకాయుడు. తెల్లని పంచె, తెల్లని ఉత్తరీయం, తెల్లని బవిరిగడ్డం. మెడలో రుద్రాక్షమాలలు, భుజంపైగా యజ్ఞోపవీతం, చేతిలో కమండలం, కాళ్ళకు పావుకోళ్ళు.

కొత్త పాత్రలలో రెండవ వాడైన లోహితాస్యుని వయస్సు దాదాపు నలభై సంవత్సరాలు. చీనాంబరాన్ని ధరించాడు. చెవులకు రత్నకుండలాలు, మెడలో రత్నహారం, వేళ్ళకు వజ్రాంగుళీయాలు, భుజాల నంటుతున్న, నల్లని జుట్టు, కోరమీసం.

హరిశ్చంద్రుని శయ్యాగారంపై తిరిగి తెర లేచినప్పుడు సత్యకీర్తి చింతాక్రాంతుడై ఒక భద్రాసనంపై కూర్చుని వుంటాడు. ఆయనకు కొద్ది దూరంలో మరొక భద్రాసనంపై కూర్చున్న కృష్ణపాణి ముఖంలో విచారంకంటె ఆందోళన హెచ్చుగా కనబడుతూ వుంటుంది.

పరిచారకులు చక్రవర్తి పాదాలవద్ద చేతులు కట్టుకుని మౌనంగా నిలబడి వుంటారు.

తెర లేచిన తర్వాత కొన్ని క్షణాల వరకు మృత్యుమందిరంలో కానవచ్చే నిస్తబ్ధత.)

**సత్యకీర్తి** : (దీర్ఘంగా నిట్టూర్చుతూ) వసిష్ఠులవారైనా ఇంకా దయచేశారు కారు!

**కృష్ణపాణి** : మరి ఏక్షణమైనా వారు రావచ్చు.

**సత్యకీర్తి** : యువరాజప్రభువులు ఏ కీకారణ్యాలలో వున్నారో! వారికి వర్తమానం చేరిందో, లేదో!

**కృష్ణపాణి** : ఉపసర్వసేనాని ఘటికుడు. జాడలు తీసి, ఆ ప్రభువుల శిబిరాన్ని ఈ సరికి చేరే వుండవచ్చు; వారిని తోడ్కొని వస్తూనే వుండవచ్చు; మా వైద్యలోపం లేదని వారితో తమరు...

**సత్యకీర్తి** : (చికాకుగా) మనవి చేస్తాము లెండి! ఎందుకు రాజవైద్యులుండి ఏమి ఫలం? యువరాజ ప్రభువులకు కడసారి చూపైనా దక్కించలేక పోయారు.

**కృష్ణపాణి** : రాజవైద్యులైనా విధిలిఖితాన్ని మార్చగలరా, మహామంత్రి!
మా లోపం లేకుండా మేము...

**హరిశ్చంద్రుడు** : (చివాలున మంచంపై లేచి కూర్చుండి) మరి అహంకరించను, మరి అహంకరించను! తమరు నా కళ్ళు తెరిపించారు! నాకు వివేకం కలిగించారు!!

(ఆశ్చర్య సంభ్రమాలతో సత్యకీర్తి, కృష్ణపాణి, పరిచారకులు కొన్ని క్షణాలపాటు నిశ్చేష్టులౌతారు. వారిలో పరిచారకులు ముందుగా తెప్పరిల్లి, హుటాహుటిగా హరిశ్చంద్రుని చేరి, ఆయనను నెమ్మదిగా పట్టుకొని, శయ్యపై పరుండబెడతారు.)

**కృష్ణపాణి** : (తాను కొంత తెప్పరిల్లగానే హరిశ్చంద్రుని సమీపించి, నాడీ పరీక్ష చేస్తూ) ఆగిపోయిన నాడి తిరిగి కొట్టుకుంటున్నది! లేచిపోయిన హంస తిరిగి వచ్చింది!

**సత్యకీర్తి** : (ఎట్టకేలకు నోట మాట రాగా) ప్రభువుల వారు గట్టెక్కినట్టేనా? తిరిగి మనకు దక్కినట్టేనా?

**కృష్ణపాణి** : మళ్ళీ ఆశ కలుగుతున్నది, మహామంత్రి!, మళ్ళీ ఆశ కలుగుతున్నది! (నాడీనిదానాన్ని కొనసాగిస్తూ) నాడిగతి క్రమంగా హెచ్చుతున్నది. (రెండు, మూడు క్షణాల తర్వాత) నాడీగమనంలో దుర్లక్షణాలు తగ్గుతున్నాయి.

**సత్యకీర్తి** : అయితే, ప్రభువులు బ్రతికి బయటపడ్డట్టే!

**కృష్ణపాణి** : (నాడిని, శ్వాసను మరికొంత సేపు పరీక్షించి, ఇవతలికి వస్తూ) మాకు

తెలుసు – పోయే ప్రాణాలనైనా సంజీవిని పోలిన మా దివ్యౌషధాలు తిరిగి రప్పిస్తాయని! అసూయాగ్రస్తులైన మాధవశర్మలు, గీదవశర్మలు ఏమి కూసినా, మా హస్తవాసే శ్రీవారిని–

**భటుడు** : (ప్రవేశిస్తూ) వసిష్ఠులవారు వేంచేస్తున్నారు!

**సత్యకీర్తి** : (వస్తున్న వసిష్ఠునికి ఎదురుగా వెళ్లి) మహర్షిచంద్రులకు నమస్కారం!

**కృష్ణపాణి** : (సత్యకీర్తి మాటతో మాట కలుపుతూ) బ్రహ్మర్షులకు నమస్కారం!

**వసిష్ఠుడు** : (ఉభయుల నుద్దేశించి) శతాయుష్మాన్భవ!

(భటుడు నిష్క్రమిస్తాడు)

**వసిష్ఠుడు** : (హరిశ్చంద్రుని వైపు చూచి) సార్వభౌములు శయ్యాగతులైనారు – స్వాస్థ్యం చెడిందా? ఎప్పుడు? మొన్న మేము చూచినప్పుడు ఆరోగ్యంగానే వున్నారే!

**సత్యకీర్తి** : నిన్న ప్రొద్దున కొద్దిగా జ్వరం తగిలింది. సాయంత్రానికి పెరిగి అర్ధరాత్రి వేళకు సంధించింది.

**కృష్ణపాణి** : తెల్లవారేసరికి ఆ సంధి చరమస్థాయికి వెళ్ళింది.

**సత్యకీర్తి** : ఆశలన్నీ వదులుకొన్న తర్వాత....

**కృష్ణపాణి** : హంస లేచిపోయినతర్వాత...

**వసిష్ఠుడు** : ఆఁ! అంత ఉపద్రవం వచ్చిందా?

**కృష్ణపాణి** : మా దివ్యౌషధాల ప్రభావంతో ప్రభువులవారు పునర్జన్మయెత్తారు!

**వసిష్ఠుడు** : (హరిశ్చంద్రుని వద్దకు వెళ్లి, నుదుటిపై చేయివేసి) సార్వభౌముని ఫాలభాగంపై స్వేదబిందువు లంకురిస్తున్నాయి.

**కృష్ణపాణి** : అయితే, నిస్సందేహంగా వ్యాధి తిరుగుముఖం పట్టినట్టే! జ్వరమిక త్వరగా దిగిపోతుంది! మా దివ్యౌషధాలకు తిరుగులేదు.

**వషిష్ఠుడు** : (సత్యకీర్తితో) నిన్ననే మాకు వర్తమానం చెయ్యకపోయారా? మంత్రతీర్థ మిచ్చివుంటే ప్రమాదం ఉత్పన్న మయ్యేదే కాదు.

**కృష్ణపాణి** : రాత్రి పొద్దుపోయేవరకూ ఏదో స్వల్పమైన జ్వరమనే భావించాము. జరిగిన పొరపాటుకు మహర్షి పుంగవులు మమ్ము మన్నించాలి.

(వసిష్ఠుడు తన కమండలంలోని నీళ్ళను హరిశ్చంద్రుని ముఖంపై చల్లుతాడు. కళ్లు నులుముకొంటూ లేచి, హరిశ్చంద్రుడు శయ్యపై కూర్చుంటాడు)

**సత్యకీర్తి** : బ్రహ్మర్షుల మంత్రతీర్థం ఎంత అమోఘంగా పనిచేసింది!

**హరిశ్చంద్రుడు** : (నిద్రలోనుంచి నెమ్మదిగా మేల్కొంటున్న వానివలె దిక్కులను కలయజూచి, వసిష్ఠుని గుర్తుపట్టి నంతనే, ఆశ్చర్య భావాన్ని ముఖంలో ద్యోతకంచేస్తూ) తమరు విచ్చేశారా?

**వసిష్ఠుడు** : ఔను, నాయనా?

**హరిశ్చంద్రుడు** : ఎప్పుడు?

**వసిష్ఠుడు** : ఇంతకు ముందే!

**హరిశ్చంద్రుడు** : ఒంటరిగా వచ్చారా? జంటగా వచ్చారా?

**వసిష్ఠుడు** : జంట యేమిటి, నాయనా?

**హరిశ్చంద్రుడు** : విశ్వామిత్రులవారు తమవెంట రాలేదా?

**వసిష్ఠుడు** : రాలేదు

**హరిశ్చంద్రుడు** : తమకంటె ముందుగా ఆయ నిక్కడికి వేంచేయవలసిన వారేనే!

**వసిష్ఠుడు** : అధికంగా మాట్లాడకు, నాయనా! ఆయాసం వస్తుంది.

**హరిశ్చంద్రుడు** : తమ రిక్కడకు రాక తప్పదని తెలుసుగాని, ఇంత త్వరలో వస్తారను కోలేదు!

**వసిష్ఠుడు** : వర్తమానం చేరగానే రాకుండా, ఆలస్యం చేస్తామా?

**హరిశ్చంద్రుడు** : ఆలస్యంచేస్తే ఊరుకుంటారా? రెక్కలు పట్టుకుని బడబడ ఈడ్చుకు వస్తారు!

**వసిష్ఠుడు** : ఏమిటి, నాయనా! చిత్రంగా మాట్లాడుతున్నావ్!

**హరిశ్చంద్రుడు** : (నవ్వుతూ) తమ కెంత శిక్ష? ఒక పుష్కరమా? రెండు పుష్కరాలా? నన్నడిగితే పది పుష్కరాలైనా తమ కది స్వల్పశిక్షే!

**వసిష్ఠుడు** : ఏమి మాటలివి నాయనా? నువ్వు ఏ లోకంలో వున్నావ్?

**హరిశ్చంద్రుడు** : తమరున్న లోకంలోనే!

**వసిష్ఠుడు** : అంటే?

**హరిశ్చంద్రుడు** : (మరింతగా నవ్వుతూ) నరకలోకం, మహాత్మా! నరకలోకం! కొన్ని పుష్కరాలపాటు యమధర్మరాజు అతిథిగా తమరు గడపవలసిన నరకలోకం! అయితే, తమ రిక్కడ రాజపురోహితులుగా వుండలేరు! వెర్రి హరిశ్చంద్రుడు కాదు, యమధర్మరాజు తమ మాయలో పడ్డానికి!

**వసిష్ఠుడు** : ఏవో పిచ్చిభయాలు నీ మనస్సులో పెట్టుకున్నావు, నాయనా! ఇది అయోధ్యానగరం.

**హరిశ్చంద్రుడు** : కాదు, మహాత్మా! కాదు! ఇది సంయమినీనగరం!

**వసిష్ఠుడు** : అయోధ్యను వీడితే మనం చేరేది, సంయమినీనగరానికి కాదు, నాయనా! అమరావతికే!

**హరిశ్చంద్రుడు** : (విరగబడి నవ్వుతూ) ఆహాహా! అమరావతి! అమరావతి! పుష్పకంలోనే తమరిక్కడికి వేంచేశారా! దేవదూతలే తోడ్కొని వచ్చారా? దేవేంద్రుడే స్వాగత మిచ్చాడా? తమ మాతృశ్రీ ఊర్వశీదేవి ఆశీర్వదించిందా?

(నవ్వి నవ్వి, హరిశ్చంద్రుడు గుక్కతిప్పుకోలేకపోతాడు. పరిచారకులు చప్పున మంచితీర్థ మిస్తారు. రెండు గుక్కలు తాగి, సొమ్మసిల్లినట్టు హరిశ్చంద్రుడు శయ్యపైకి వాలిపోతాడు.)

**కృష్ణపాణి** : (నివ్వెరపాటును కప్పిపుచ్చుకొనడానికి ప్రయత్నిస్తున్న వసిష్ఠునితో) సంధిలోనుంచి సార్వభౌములు బయటపడలేదు.

(వసిష్ఠుడు తిరిగి గంభీరముద్ర ధరించి, శిరఃకంపనం చేస్తాడు.)

**సత్యకీర్తి** : బ్రహ్మర్షులు తిరిగి మంత్రతీర్థం...

**భటుడు** : (ప్రవేశిస్తూ) యువరాజ ప్రభువులు దయచేస్తున్నారు!

(వసిష్ఠుడు, సత్యకీర్తి, కృష్ణపాణి భటుడు ప్రవేశించిన దిక్కుకు చూస్తారు. లోహితాస్యుడు ఆతురతతో ప్రవేశిస్తాడు.)

**లోహితాస్యుడు** : (వసిష్ఠుని చూడగానే, తలవంచి, చేతులు జోడించి) కులగురువులకు నమస్కారం!

**వసిష్ఠుడు** : దీర్ఘాయుష్మాన్ భవ! నీ ప్రియజనకులు ఆకస్మికంగా వ్యాధిగ్రస్తులైనారు. నీవు ఆందోళనపడ నక్కరలేదు. త్వరలో కోలుకొంటారులే!

**లోహితాస్యుడు** : (తండ్రి వద్దకు చకచక వెడుతూ) నాన్నగారికి నమస్కారం! (హరిశ్చంద్రుడు కన్నెత్తి చూడకపోగా, ఆయన శయ్యపై కూర్చుండి, ముఖంలోకి ఆందోళనతో చూస్తూ, అక్కడి వారి నందరినీ సమష్టిగా ప్రశ్నిస్తున్నట్టు) స్పృహలో లేరా?

**కృష్ణపాణి** : వ్యాధి తీవ్రత ఇప్పుడే తగ్గుతున్నది. యువరాజ ప్రభువులు భయపడనక్కరలేదు.

**లోహితాస్యుడు** : ఎప్పటి నుంచి ఈ స్థితిలో వున్నారు?

**కృష్ణపాణి** : అర్ధరాత్రి నుంచి.

**లోహితాస్యుడు** : ముందుగానే మా కెందుకు వర్తమానం చేయలేదు?

**సత్యకీర్తి** : శ్రీవారికి జ్వరం తగిలింది నిన్న ప్రొద్దునే!

**లోహితాస్యుడు** : ఇంతలోనే ఇంతగా ప్రమాదించిందా?

**వసిష్ఠుడు** : ఆందోళనపడకు, నాయనా! అదే తగ్గిపోతుంది.

**లోహితాస్యుడు** : బ్రహ్మర్షులే మా కిప్పుడు దిక్కు.

**సత్యకీర్తి** : బ్రహ్మర్షుల మంత్రతీర్థం అమోఘంగా పని చేస్తుంది. ఇంతకు ముందు వారు తీర్థాన్ని సంప్రోక్షించగానే సార్వభౌములు శయ్యపై లేచి కూర్చున్నారు.

**లోహితాస్యుడు** : మరొకసారి మమ్ము కరుణించండి, బ్రహ్మర్షీ!

**వసిష్ఠుడు** : మంచిది. (కమండలంలోని నీళ్ళను తిరిగి హరిశ్చంద్రుని ముఖంపై జల్లుతూ) పవనాహతికి లోనైన కారుమేఘంవలె అపస్మారకస్థితి మరి విచ్చిపోతుందిలే!

**హరిశ్చంద్రుడు** : (చన్నీళ్ళు తగలగానే చివాలున లేచి, ఎదురుగా కనబడిన లోహితాస్యుని కౌగలించుకుని కన్నీరు పెడుతూ) వచ్చావా; నా తండ్రీ! నన్ను వెతుక్కుంటూ వచ్చావా? నిన్ను, నీ తల్లిని పెట్టరాని కష్టాలు పెట్టాను! ఆమెకు దూరమైనాను – ఆమె క్షమాభిక్ష కోరలేను! నువ్వైనా నన్ను క్షమిస్తావా? నువ్వైనా క్షమిస్తావా? (బిత్తరపడి లోహితాస్యుడు పలకక పోగా) క్షమిస్తానను, బాబూ! క్షమిస్తా నను!!

**లోహితాస్యుడు** : (వసిష్ఠు నుద్దేశించి, గద్గదస్వరంతో) మా జనకు లింత వింతగా మాట్లాడుతున్నారేమి, బ్రహ్మర్షీ?

**వసిష్ఠుడు** : సంధి మాటలవి, బాబూ! ఆయన మన లోకంలో లేరు! అయినా, భయం లేదు. ఆయన సత్యవ్రతమే ఆయనను కాపాడుతుంది!

**హరిశ్చంద్రుడు** : (ఏడ్పులోనుంచి నవ్వులోకి మారి) సత్యవ్రతమా? అది నన్ను కాపాడుతుందా? ఆ వ్రతస్వరూపమైనా నాకు సరిగా తెలియదే! తెలియ జెప్పడానికి మీరు ప్రయత్నించనైనా లేదే! పైగా, నేను సంధిలో ఏదో ప్రేలుతున్నానని అంటున్నారా?

**వసిష్ఠుడు** : సత్యవ్రతస్వరూపం నీకు తెలియక పోవడ మేమిటి, నాయనా? సత్యహరిశ్చంద్రుడుగా నీ కీర్తి ఆచంద్రతారార్కం నిలుస్తుంది!

**హరిశ్చంద్రుడు** : మీరు నాలో పెంచింది ఈ కీర్తిదాహాన్నే! దానితోనే నన్ను క్షోభపెట్టుకున్నాను, నా భార్యాపుత్రులను క్షోభ పెట్టాను! ఆ యమధర్మ ప్రభువు పుణ్యమా అని ఇప్పటికైనా నా కళ్ళు తెరచుకున్నాయి, నాకు వివేకం కలిగింది!

**లోహితాస్యుడు** : (కన్నీటితో తండ్రికి విజ్ఞప్తి చేస్తూ) కులగురువుల దూషణ తిరస్కారాలు

మనకు తగవు! (వసిష్ఠునితో) మా పితృపాదులేమి మాట్లాడుతున్నారో వారికి తెలియదు, క్షమించండి.

**హరిశ్చంద్రుడు** : నావి తెలియని మాటలు కావు, బాబూ! తెలిసిన మాటలే! ఈ వసిష్ఠుడు, ఆ విశ్వామిత్రుడు పంతాలకు పోయి, మనలను కాల్చుకు తిన్నారు! సర్వజ్ఞుల మన్న నటనతో మన ఉసురు పోసుకున్నారు! (వసిష్ఠునితో) పొండి! ఇక్కడినుంచి తక్షణం పొండి! పోతారా, లేదా? ఊఁ!!

(హరిశ్చంద్రుడు శయ్యపై నుంచి దిగబోగా, లోహితాస్యుడు, పరిచారకులు వారిస్తారు. గద్దించగా వచ్చిన అలుపుతో ఆయన వెనకకు వాలిపోతాడు.)

**లోహితాస్యుడు** : (వసిష్ఠునికి పాదాభివందనం చేస్తూ) బ్రహ్మర్షిపుంగవులు మమ్మ్మ మన్నించాలి.

**వసిష్ఠుడు** : మన్నించడాని కేమున్నది, బాబూ! విషజ్వరపీడితుని సంధి ప్రలాపాలను బ్రహ్మర్షులు పట్టించుకోరు!

**లోహితాస్యుడు** : దైవసమానులుగా తమను సంభావించుకునే మా పితృపాదులు ఎంత సంధిలో నైనా ఈ విధంగా తమపట్ల సంచరించడం ఏదో మహావిపరీతం! ఈ విపత్కాలంలో – మహాత్ములు, మీరే మమ్మ్మ రక్షించాలి.

**సత్యకీర్తి** : బ్రహ్మర్షులు తిరిగి మంత్రతీర్థాన్ని సంప్రోక్షించడం మంచిదేమో!

**కృష్ణపాణి** : ఔషధప్రక్రియకు తప్ప ఈ సంధిప్రకోపం లొంగకపోవచ్చు. బ్రహ్మర్షుల సెలవైతే....

**సత్యకీర్తి** : (కృష్ణపాణితో) మీరు కాస్త సంక్షేపించండి! (వసిష్ఠునితో) బ్రహ్మర్షులు కరుణించాలి.

**వసిష్ఠుడు** : పాపం! మన కృష్ణపాణి ఒక అవకాశం కోరుతున్నాడు. దాన్ని అతని కిచ్చి చూడండి! వైద్యంలో అతడు ఘనుడు!

**కృష్ణపాణి** : (నమస్కరిస్తూ) బ్రహ్మర్షుల దీవనలే మమ్మింతవానిగా చేశాయి!

**సత్యకీర్తి** : ఆయనకు అవకాశాలకు కొదవలేదులెండి; తమరు సార్వభౌముని కాపాడాలి.

**లోహితాస్యుడు** : (కాళ్లపై పడుతూ) మా ప్రార్థన మన్నించండి!

(వసిష్ఠుడు లోహితాస్యుని, లేవనెత్తి, గంభీరముద్రతో శిరఃకంపనం చేస్తూ కమండలంలోని నీళ్లు మరొకసారి హరిశ్చంద్రుని ముఖంపై చల్లుతాడు.)

**హరిశ్చంద్రుడు** : (చరాలున లేచి) చాల్చాలు – మీ కపట నటన! తీర్థాలని, ప్రసాదాలని నన్నిక మోసపుచ్చలేరు!

(లోహితాస్యుడు కళ్లుమూసుకొని విలపిస్తాడు.)

**హరిశ్చంద్రుడు** : విలపిస్తావు దేనికి, బాబూ! ఈ మునిముచ్చులు గుప్పిటిలోనుంచి ఇప్పటికైనా బయటపడినందుకు మనం సంతోషించాలి. ఇలారా! నా దగ్గరికిరా!

**లోహితాస్యుడు** : (శోకోద్వేగంతో) బ్రహ్మర్షీ! బ్రహ్మర్షీ!

**హరిశ్చంద్రుడు** : ఆయనను నమ్ముకొని నేను చెడ్డాను. నాయనా! నీవుకూడా ఎందుకు చెడతావు! ఇలారా, నావద్ద కూర్చో!

**వసిష్ఠుడు** : మహా దుష్టగ్రహా లేవో ప్రవేశించి, ఆయనను పీడిస్తున్నాయి, బాబూ! జప తప హోమాలతోగాని వాటిని తరిమి వేయలేము. మా పుణ్యాశ్రమానికి వెళ్లి, తగు శాంతులు చేస్తాములే! నీవు విచారించకు, బాబూ!

**హరిశ్చంద్రుడు** : ఔను, మహాత్మా! వసిష్ఠ విశ్వామిత్రులనే రెండు మహా దుష్ట గ్రహాలు మమ్ము పట్టి పీడిస్తున్నాయి! (లోహితాస్యునితో) నాయనా! మనను, మన రాజవంశాలనే కాదు, మన ప్రజలను సయితం పురోహితులనే ఈ దుష్ట గ్రహాలు తరతరాలుగా పీడిస్తున్నాయి! అంధ విశ్వాసాలనుంచి బయట పడాలంటే, నిర్నిరోధంగా సత్యాన్వేషణ చేయాలంటే, జ్ఞానపరిధులను పెంచుకోవాలంటే, నవపథాలవెంట నడిచి, నూతన శిఖరాలను అందుకోవాలంటే, ముందుగా మనం ఈ దుష్టగ్రహాలనుతన్ని తరమాలి!

**వసిష్ఠుడు** : (లోహితాస్యునితో) సరే, బాబూ! మేము వెళ్ళి వస్తాము!

**హరిశ్చంద్రుడు** : వెళ్లండిగాని, మళ్లీ రాబోకండి సుమీ!

(లోహితాస్యుడు మరింతగా విలపిస్తుండగా)

**(తెర)**



# NARAKAMLO HARISCHANDRUDU

*by* Narla Venkateswararao

ఇరవయ్యో శతాబ్దిలో సయితం మన పురాణాలలోని కట్టుకథలను, పిట్టకథలను మనలో అత్యధిక సంఖ్యాకులు పరమ సత్యాలుగా, వాటిలోని బొంకులను, రంకులను పవిత్ర విషయాలుగా విశ్వసించడం ఆశ్చర్యకరమైన విషయం...

మన పురాణాలను నిరసించినవారు కొందరు లేకపోలేదు గాని, వారి సంఖ్య బహుస్వల్పం. ఈ శతాబ్దిలో పెరియార్ రామస్వామి, త్రిపురనేని రామస్వామి పురాణాలపై దాడి చేశారు. గత శతాబ్దిలో రాజా రామమోహన్ రాయ్, దయానంద సరస్వతి వాటిపై దెబ్బ తీశారు గాని వారి విమర్శలు గాలికి ఎగిరి పోయినట్టుగా భావించవలసి వస్తుంది...

స్నానం చేయించి, వలువలు మార్చి, తలదువ్వి, జడవేసి, పూలు తురిమి, సుగంధ ద్రవ్యాలను పులిమి, పురాణాలలోని కంపును కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు...

రామాయణంలో అహల్య ఇంద్రునితో వ్యభిచరించి, "నా జన్మ పావనమైనది. మనకు ప్రమాదం రాకుండా నా భర్త తిరిగి రాకముందే మీరు చల్లగా తప్పుకొనండి" అని హెచ్చరించిన గాథ లేదా? ఇదే విధమైన బూతుకథలు భారతంలోనైనా ఎన్నిలేవు? కర్ణుని జన్మవృత్తాంతాన్ని, ధర్మరాజును, భీముని, అర్జునుని కుంతి ఎవరికి కన్నదో జ్ఞాపకం తెచ్చుకొనండి. ఋషిపత్నులలో కొందరు తమ భర్తలకంటె రెండాకులు ఎక్కువ చదివిన వారే. ఉదాహరణకు బృహస్పతినే తీసుకొండి – ఆతడు అన్న పెండ్లాన్ని చెరచగా అతడిభార్య తార చంద్రుడిని తగులు కొంటుంది. ఈ ఋషులన్న వారిలో కొందరైనా చారిత్రక వ్యక్తులైతే వీరిని పోల్చవలసింది ఈనాటి రజనీష్, మహేష్‌యోగి, సత్యసాయిబాబా, ధీరేంద్ర బ్రహ్మచారి వగైరా వగైరాలతో...

పురాణాల దుష్ప్రభావంనుంచి ఇప్పటికైనా మనం బయట పడలేకపోతే ధర్మశాస్త్రాలను భస్మీపటలం చేయకపోతే, కులవ్యవస్థను రూపుమాపకపోతే, హేతుదృష్టిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొనకపోతే మనదేశం పైకి కాక క్రిందికే – మరింత క్రిందకే పోతుంది. మనలో భావవిప్లవం రానంతవరకు ఏ పంచవర్ష ప్రణాళికలు ఏ పంచసూత్రాలూ అధోగతినుంచి మనను తప్పించలేవు.

– నార్ల వెంకటేశ్వరరావు

₹ 60/-

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004